PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 216 | విజయవాడ, ఆదివారం 9 మార్చి 2025 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 9 March 2025 | Rs

కుకీ మహిళలపై లాఠీఛార్జి

- భద్రతా దళాల దాడిలో ఒకరు మృతి
- మణిపూర్‌లో బస్సు సర్వీసులను పలుచోట్ల అడ్డుకున్న నిరసనకారులు

7




ఛాంపియన్ ఎవరో..?

- నేడు భారత్‌-న్యూజిలాండ్ జట్ల మధ్య టైటిల్ పోరు

6

ఏడాదిలో లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలు

- ఉపాధి కల్పనకు 24 సంస్థలతో ఒప్పందాలు
- ఎన్ని కాన్పులకైనా ప్రసూతి సెలవులు
- అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో చంద్రబాబు



మహిళలకు అభివాదం చేస్తున్న సిఎం

ప్రజాశక్తి- మార్కాపురం, ఒంగోలు బ్యూరో

ఈ ఏడాది లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్నదే తన ఆలోచనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఇకపై ఎంతమంది పిల్లలను కన్నా, అన్ని కాన్పులకూ ప్రసూతి సెలవులు ఇస్తామని ప్రకటించారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో ఆయన డ్వాక్రా సంఘాల మహిళలతో మాటామంతీ నిర్వహించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ మహిళలు అన్ని అవకాశాలనూ అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. అవకాశాలను తెచ్చే పని తాను చేస్తానని, వాటిని వినియోగించుకుని ఉపాధి పొందాలని సూచించారు. ఫ్లిప్‌కార్డ్స్, అరకు కాఫీ తదితర 24 సంస్థలతో ఈ సందర్భంగా చేసుకున్న ఒప్పందాలను వివరించారు. డ్వాక్రా ఉత్పత్తులను ప్రపంచ స్థాయి మార్కెట్లోకి తీసుకొనిపోయి అమ్ముకునేలా చేస్తామన్నారు. వస్తువుల తయారీలో నాణ్యత పెంచేందుకు శిక్షణ తీసుకోవాలని సూచించారు. మహిళలు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేయించే బాధ్యత తనదేన్నారు. ఆనాడు ఆర్‌టిసిలో కండక్టర్లుగా మహిళలను తీసుకున్నామని గుర్తు చేశారు. ఇప్పుడు రాపిడో వంటి సంస్థలతో మహిళలు కూడా ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. డ్వాక్రా మహిళలకు నాలుగు గిన్నీస్ రికార్డులు వచ్చాయంటే ఎంత వ్యాపారం చేశారో చెప్పాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. రూ.35 వేల కోట్ల రుణాలు తీసుకుని తిరిగి చెల్లిస్తున్నారంటే ఎంతో గర్వంగా ఉందన్నారు. ఆడబిడ్డల చదువు ఆగిపోకుండా ఉండాలనే ఉద్దేశంతో ఆనాడు పాఠశాలల విద్యార్థినులకు సైకిళ్లను అందజేశామని ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. చదువుకోవడం వల్లనే ఈ రోజు మహిళలు శక్తిగా ఎదిగారన్నారు. డ్వాక్రా సంఘాల వల్ల మహిళలకు గౌరవం పెరిగిందని పేర్కొన్నారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. వెలుగొండ ప్రాజెక్టుపై ఓ మహిళ అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ ఈ ప్రాజెక్టును గతంలోనే మిగతా 2లో

అవాస్తవాలతో అసెంబ్లీని, ప్రజలను

తప్పుదారి పట్టించొద్దు

విద్యుత్ శాఖ మంత్రి ప్రకటనపై సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవాస్తవాలతో అసెంబ్లీని, ప్రజల్ని తప్పుదారి పట్టించొద్దని సిపిఎం రాష్ట్రకమిటీ డిమాండ్ చేసింది. తమ కూటమి అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలు పెంచలేదని శాసనసభలో ఆ శాఖమంత్రి జి రవికుమార్ శుక్రవారం శాసనసభలో అవాస్తవాలు చెప్పడాన్ని తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. టిడిపి కూటమి అధికారానికి వచ్చిన తరువాతనే రెండు పర్యాయాలు ట్రూఅప్, ఎఫ్‌పిపిసిఎ పేరుతో సుమారు రూ.16వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేసిన మాట నిజం కాదా అని ప్రశ్నించారు. అంతేగాక గత వైసిపి సర్కార్ యూనిట్‌కు ఆరు పైసలుగా ఉన్న విద్యుత్ సుంకాన్ని ఏకంగా రూపాయికి పెంచితే దానికి చట్టబద్ధత కల్పించింది కూటమి ప్రభుత్వమేనని వివరించారు. ఇప్పటికీ ప్రతి నెల ప్రతి యూనిట్‌కు 40పైసల చొప్పున ఎఫ్‌పిపిసిఎ చార్జీలను అదనంగా వసూలు చేస్తున్నది కూటమి సర్కారే కదా అని తెలిపారు. ప్రజలపై గత ప్రభుత్వం వేసిన భారాలను కొనసాగిస్తూ, ఇంకొన్ని కొత్త భారాలను మోపుతూనే నిండు శాసనసభలో మంత్రి అలా ప్రకటించడం సభను, రాష్ట్రప్రజలను తప్పుదారి పట్టించడమేనని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లుల భారం తగ్గిస్తామని కూటమి మేనిఫెస్టోలో హామీనిచ్చారని తెలిపారు. చంద్రబాబు నాయుడు ఉపన్యాసించిన భారీ ఎన్నికల సభల్లో ఇదే విషయం గట్టిగా చెప్పారని గుర్తుచేశారు. వైసిపి పాలనలో రకరకాల పేర్లతో వేసిన వేల కోట్ల రూపాయల భారంతో బాధపడుతున్న రాష్ట్రప్రజలు చంద్రబాబు మాటతో ఊరట చెందారని తెలిపారు. రానున్న ఐదేళ్లూ కరెంట్ చార్జీలు పెరగవని భావించారని తెలిపారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రెండు సార్లు ఎఫ్‌పిపిసిఎ చార్జీల భారం మోపిందని గుర్తుచేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.6,072.86కోట్ల ఎఫ్‌పిపిసిఎ ఛార్జీల భారం మోపుతూ 2024 అక్టోబర్ 25వ తేదిన ఎపిఇఆర్‌సి ఉత్తర్వులు విడుదల చేసిందని తెలిపారు. 2024 నవంబర్ నుంచి 2026 జనవరి వరకు వీటిని వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రూ.9,412కోట్ల ఎఫ్‌పిపిసిఎ చార్జీల భారం మోపుతూ 2024 నవంబర్ 29వ తేదిన ఎపిఇఆర్‌సి ఉత్తర్వులు ఇచ్చిందని గుర్తుచేశారు. 2024 డిసెంబర్‌లో మొదలైన వసూలు 2026 నవంబర్ వరకూ కొనసాగుతుందని వివరించారు. రెండింటికి అదనంగా నెలనెలా ఎఫ్‌పిపిసిఎ చార్జీ యూనిట్‌కు 40 పైసలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈ భారాలు టిడిపి కూటమి వేసినవేనని తెలిపారు. ఎస్సి,ఎస్టిలకు 200 యూనిట్లలోపు ఉచితంగా విద్యుత్ ఇస్తామని చెప్పినా చాలాచోట్ల అమలు కావడం లేదని, బకాయిల పేరుతో వేల రూపాయలు చెల్లించాలని నోటీసులు ఇస్తున్నారని వివరించారు. గత ప్రభుత్వం తప్పుడు విద్యుత్ ఒప్పందాలు చేసుకొని రూ.1.80లక్షల కోట్ల భారాన్ని వేసిందని టిడిపి కూటమి సర్కారు శ్వేతపత్రంలో పేర్కొన్నా, మాట మార్చి ఆ భారాన్ని జనంపై మోపడం వాస్తవం అవునా? కాదా చెప్పాలని కోరారు. చార్జీలు పెంచేది లేదని తప్పుడు సమాచారం ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నెలనెలా పెరుగుతున్న కరెంట్ బిల్లులు చెల్లిస్తూ ఉసూరుమంటున్న వినియోగదార్లు ప్రభుత్వ అబద్ధాలను నమ్మబోరని తెలిపారు. గత ప్రభుత్వం అదాని కంపెనీతో చేసుకున్న అవినీతికరమైన సెకి విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయకుండా మిగతా 7లో

రంగన్న మృతదేహానికి రీపోస్టుమార్టం

- కేబినెట్ ఆదేశాలతో కదిలిన సిట్
- ఎనిమిది మంది వైద్యుల బృందం పర్యవేక్షణ
- మంగళగిరికి అవశేషాలు
- 15 రోజుల్లో నివేదిక?



3

వివిధ భాషలు నేర్చుకోవాలి

- ఎన్‌డిఎకు బేషరతుగా మద్దతు
- ఇండియా టుడే కాంక్లేవ్‌లో మంత్రి నారా లోకేష్



2

సాధికార మహిళ
దేశ నిర్మాణంలో కీలకం



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- శ్రామిక శక్తిలో స్త్రీల ప్రాతినిధ్యం పెరగాలి : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ : ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించే దిశగా భారత్ పయనిస్తున్న తరుణంలో దేశ శ్రామిక శక్తిలో మహిళల ప్రాతినిధ్యం మరింత వేగంగా పెరగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా అభివృద్ధి ద్వారా భారత్ అభివృద్ధి (నారీ శక్తి సే వికసిత్ భారత్) అన్న అంశంపై కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన జాతీయ సదస్సులో ఆమె ప్రసంగించారు. గత 50ఏళ్లలో మహిళలు అనూహ్యమైన రీతిలో పురోగతి సాధించారని చెప్పారు. ఒరిస్సాలో బాగా వెనుకబడిన ప్రాంతంలో సామాన్యమైన కుటుంబంలో జన్మించిన తన ప్రయాణం ఈనాడు రాష్ట్రపతి భవన్‌కు వరకు సాగిందని, భారతీయ సమాజంలో అందరికీ సమాన అవకాశాలు, మహిళలకు సామాజిక న్యాయం వుందనడానికి తన జీవితమే ఒక ఉదాహరణ అని అన్నారు. పిల్లల సంరక్షణ వల్ల మహిళలు తరచుగా సెలవులు తీసుకుంటారని, వారు పనిపై పెద్దగా దృష్టి పెట్టలేరనే భావన మనదేశంతోపాటు ఇతర దేశాల్లోనూ ఉందని, ఇది సరికాదని అన్నారు. పిల్లల పట్ల సమాజానికి బాధ్యత వుందా లేదా అనే ప్రశ్న మనకు మనం వేసుకోవాల్సి వుందన్నారు. కుటుంబంలో మొదటి ఉపాధ్యాయురాలు అంటే తల్లేనని మనందరికీ తెలుసు, పిల్లలను చూసుకోవడానికి ఒక తల్లి సెలవు తీసుకుందంటే ఆమె చేసే ఈ ప్రయత్నం సమాజ అభ్యున్నతికి కూడా అని, తన కృషి ద్వారా తన బిడ్డను ఆదర్శప్రాయమైన పౌరుడిగా ఆ తల్లి తీర్చిదిద్దగలుగుతుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. ఒక దేశం సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే బాలికలకు మరింత మెరుగైన వాతావరణం వుండాలని, అప్పుడే వారు తమ జీవితాల గురించి నిర్భయంగా, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటారని అన్నారు.



ఐటిఆర్ దాఖలుకు సమీపిస్తున్న గడువు

న్యూఢిల్లీ : ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటిఆర్) దాఖలుకు సంబంధించి గడువు సమీపిస్తోంది. ఆర్థిక సంవత్సరాలు 2021-22, 2022-23లకు సంబంధించి పన్ను చెల్లింపు దారులు 2025 మార్చి 31 లోపు ఐటిఆర్‌ను దాఖలు చేయాల్సి ఉంది. సంబంధిత అసెస్‌మెంట్ సంవత్సరం ముగిసిన రెండు సంవత్సరాల లోపు మాత్రమే ఇది చేయాల్సి ఉంటుంది. అదే విధంగా పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లలో ఉన్న లోపాలను సరిదిద్దుకుని అప్‌డేట్ చేసిన రిటర్న్‌లను దాఖలు చేసేందుకు అవకాశం ఉంది.

పోరాడతాం.. గెలుస్తాం...

కార్పొరేట్, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సిపిఎం మహిళా మార్చ్



మహిళా మార్చ్ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కొల్లాం: 'మేం పోరాడతాం.. గెలుస్తాం' అని నినదిస్తూ సిపిఎం మహిళా నేతలు శనివారం మార్చ్ నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్పొరేట్, మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా సిపిఎం కేరళ రాష్ట్ర 24వ మహాసభ జరుగుతున్న కొడియేరి బాలకృష్ణన్ నగర్ నుంచి వి పార్క్ వరకూ శనివారం ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా మహిళల హక్కులు, సమానత్వం, న్యాయం కోరుతూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. మహిళల హక్కులపై అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, సుభాషిణి అలీ, కేంద్ర కమిటీ సభ్యులు పికె శ్రీమతి, కెకె శైలజ టీచర్, సిఎస్ సుజాత, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.మెర్సికుట్టి అమ్మ, సుసాన్ కోడి ఈ మార్చ్‌కు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ లింగ, వర్గ అణచివేత నిర్మూలన, మహిళల విముక్తి, విప్లవాత్మక పరివర్తన ప్రాధాన్యతను వివరించారు. పితృస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం రెండూ మహిళలను అణచివేస్తాయని, సమసమాజం కోసం నిర్వహించే విస్తృత పోరాటాల నుంచే మహిళల విముక్తి కలుగుతుందని స్పష్టం చేశారు. మహిళలపై పెరుగుతున్న హింస, వివక్షను అరికట్టడంలో ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మహిళలపై దారుణాలను చూసీచూడనట్లు పదేపదే వ్యవహరిస్తున్న కేంద్రం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లైంగిక హింస, వరకట్న మరణాలు, లింగ పక్షపాతం, మహిళలపై నేరాలు పెరగడానికి ఈ వైఖరే కారణమని చెప్పారు. బేటీ బచావో బేటీ పడావో ప్రచార కార్యక్రమంగానే ఉందని, ఇది దేశంలోని మహిళలు, పిల్లల అవసరాలను తీర్చడానికి, సమస్యలను పరిష్కరించడానికి ఏమాత్రం ఉపయోగపడడం లేదని విమర్శించారు. మహిళల భద్రత, విద్య, గౌరవంపై దృష్టి పెట్టడానికి బదులుగా, మహిళా సాధికారత పునాదులను దెబ్బతీసే కార్పొరేట్ అనుకూల, మతపరమైన ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇచ్చిందని విమర్శించారు. ఈ ఎజెండా ఉన్నత వర్గాలకు, కార్పొరేట్ ప్రయోజనాలకే ప్రయోజనం చేకూరుస్తుందని పేర్కొన్నారు. అణగారిన వర్గాల మహిళలు, ముఖ్యంగా పేదలు, గ్రామీణ, మైనారిటీ మహిళలు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. హింస, అసమానతలను శాశ్వతం చేసే పితృస్వామ్య, పెట్టుబడిదారీ విధానాలను కూల్చివేసేందుకు, న్యాయం, సమానత్వం కోసం పోరాటానికి, మహిళా విముక్తి కేంద్రంగా ఉన్న సమాజం కోసం పోరాడటానికి తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ సిపిఎం రాష్ట్ర మహాసభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

కాఫీ కొనుగోలులో దోపిడి

- కాస్త ధర పెంచి తూకంలో, తరుగు పేరుతో భారీగా మోసం
- జిసిసి నామమాత్రపు పాత్ర
- గిరి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు



ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, పాడేరు టౌన్ విలేకరి

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీలో కాఫీ పంట కొనుగోలులో ప్రయివేటు వ్యాపారులదే హవా.ప్రభుత్వ ప్రోత్సాహం కరువవడంతో గిరిజన రైతులను దోపిడీ చేస్తున్నారు. గిరిజన సహకార సంస్థ (జిసిసి) ప్రకటించిన ధర కంటే దళారులు కాస్త ధర పెంచినా తూకంలోనూ, తరుగు పేరుతోనూ భారీగా మోసానికి పాల్పడుతున్నారు. దీంతో, గిరిజన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గిరిజన గ్రామాల్లో ఎవరు ఏ ధరకు కాఫీ కొంటున్నారో చెప్పే మనుషులను స్థానికంగా దళారులు ఏర్పాటు చేసుకున్నారు. ఆ ధరకు కొంత పెంచి కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్న వీరు ఎలక్ట్రానిక్ కాటాలో రైతులు పసిగట్టలేని మోసాలకు పాల్పడుతున్నారు. కిలో పార్చుమెంట్ కాఫీకి జిసిసి రూ.400 చెల్లిస్తుండగా, వ్యాపారులు రూ.20, రూ.30 పెంచి ఇస్తున్నారు. అదే సమయంలో ఎలక్ట్రానిక్ కాటాలో కాఫీ పరిమాణాన్ని బట్టి కనీసం ఐదు కేజీలు తక్కువ చూపేలా రిమోట్ ద్వారా ఆపరేట్ చేస్తున్నారు. ఒక తూకంలో ఐదు కేజీలకు రెండు వేల రూపాయలకుపైగా గిరిజనులు నష్టపోతున్నారు. తరుగు పేరిట మరో విధమైన దోపిడీ కొనసాగుతోంది. 70 నుంచి 80 కిలోల కాఫీ గింజల బస్తాపై తరుగు కింద 2 నుంచి 3 కిలోలను ప్రయివేటు వ్యాపారులు తీసేస్తున్నారు. ఆ రకంగా పది బస్తాలు పండించే రైతుకు సగటున 30 కిలోల తరుగుపోతోంది. ఆ లెక్కన మిగతా 7లో

లోక్ అదాలత్‌లో 49 వేల కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం హైకోర్టుతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల్లో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 49,056 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి, సభ్య కార్యదర్శి ఎం బబిత పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు జస్టిస్ అవధానం హరాహరనాథ్‌శర్మ, జస్టిస్ డాక్టర్ వై లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. హైకోర్టులో 125 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో 343 లోక్‌అదాలత్ బెంచీలను ఏర్పాటు చేయగా.. 4842 కేసులు పెండింగ్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. వీటితో పాటు ప్రీ లిటిగేషన్ కేసులు 789 పరిష్కరించినట్లు పేర్కొన్నారు.

'స్విమ్స్'లో మతవివక్ష

- వైద్యుల పోస్టులకు హిందువులే అర్హులట!
- 14న 38 పోస్టులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ



స్విమ్స్ మెడికల్ కళాశాల

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీలోని 20 విభాగాలకు సీనియర్ రెసిడెంట్ వైద్యులను అడహాక్ పద్ధతిన ఈ నెల 14న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణకు రిజిస్ట్రార్ శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. అనాటమి విభాగంలో నాలుగు, బయో కెమిస్ట్రీ రెండు, కార్డియాక్ సర్జరీ ఒకటి, కార్డియాలజీ ఒకటి, కమ్యూనిటీ మెడిసిన్ రెండు, ఫోరెన్సిక్ మెడిసిన్ నాలుగు, మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఒకటి, మెడికల్ అంకాలజీ ఒకటి, మైక్రో బయాలజీ రెండు, నెఫ్రాలజీ ఒకటి, న్యూరో సర్జరీ ఒకటి, ఒబిజి మూడు, ఆర్థినోలర్జి ఒకటి, పిడియాట్రిక్స్ మూడు, ఫార్మాకాలజీ మూడు, ఫిజియాలజీ నాలుగు, రుమటాలజీ ఒకటి, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఒకటి, సర్జికల్ ఆంకాలజీ ఒకటి, యురాలజీ విభాగంలో ఒక పోస్టు చొప్పున మొత్తం 38 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ నోటిఫికేషన్‌లో పైపోస్టులకు 'హిందూ మతానికి చెందిన వారు మాత్రమే వాక్ ఇన్ ఇంటర్వ్యూకు రావాలి' అని ప్రత్యేకించి సూచించడం గమనార్హం. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని పేర్కొన్నారు. నెల రోజుల క్రితం రేడియాలజీ విభాగంలె ఇదే విధంగా మతప్రాతిపదికన ఆరు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు రావడంతో ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేశారు. తాజాగా ఆ ఆరు పోస్టులనూ కలిపి 38 పోస్టులకు మళ్లీ మతం ప్రాతిపాదికనే నోటిఫికేషన్ ఇవ్వడం గమనార్హం. రెండేళ్ల క్రితం స్విమ్స్ యూనివర్సిటీకి ముఖ్యమంత్రి చైర్మన్‌గా ఉండేవారు. మతప్రాతిపదికన కాకుండా అర్హులకు పోస్టుల భర్తీలో అవకాశం కల్పించేవారు. ఇటీవల స్విమ్స్‌ను టిటిడిలో విలీనం చేయడంతో ప్రస్తుత టిటిడి చైర్మన్ యూనివర్సిటీకి మిగతా 7లో

నిధుల దుర్వినియోగం కేసుల్లో... రికవరీ ఏది?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్థానిక సంస్థల నిధుల వివరాలను ప్రజలందరికీ తెలిసేలా బోర్డులో పేర్కొనాలని, నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చెబుతున్నా... ఆ దిశగా చర్యలు తీసుకోవడంలో వైఫల్యం కనిపిస్తోంది. ఆడిట్ నిర్వహణలో అక్రమాలు వెలుగుచూస్తున్నా..బాధ్యులపై చర్యలు తీసుకోవడంలోనూ, నిధులను రికవరీ చేయడంలోనూ పంచాయతీరాజ్ శాఖ మీన మేషాలు లెక్కిస్తోంది. ఇందుకు ఆ శాఖ విడుదల చేసిన నివేదికలే నిదర్శనం. ఆరు జిల్లాల పరిధిలోని 13 మండల పరిషత్‌ల్లో రూ.4.38 కోట్ల నిధులు దుర్వినియోగం కాగా..ఇందుకు 30 మంది అధికారులను బాధ్యులుగా గుర్తించారు. అయితే వీరిలో కేవలం 13 మంది అధికారులపైనే చర్యలు తీసుకున్నారు. దుర్వినియోగమైన నిధుల్లో కేవలం 10.5 శాతం అంటే రూ.46 లక్షలే రికవరీ చేశారు. గ్రామ పంచాయతీల విషయానికి వస్తే 113 గ్రామ పంచాయతీల్లో రూ.33.87 కోట్ల నిధుల దుర్వినియోగమైనట్లు గుర్తించారు. ఇందుకు 283 మంది అధికారులను బాధ్యులుగా తేల్చారు. కానీ 155 మందిపైనే చర్యలు ప్రారంభించగా.. కేవలం 7.11 శాతం మేర అంటే రూ.2.41 కోట్లే రికవరీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వెలుగులోకి రాని నిధుల మొత్తం ఎక్కువ ఉండే వీలుంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సవరణ

'సుధాభాస్కర్‌కు పితృవియోగం' శీర్షికన ఈ నెల 8న ప్రచురితమైన వార్త ఫొటో రైటప్‌ను 'జనార్ధన్ పార్థివదేహం వద్ద నివాళు లర్పిస్తున్న నాయకులు' అని చదువుకోగలరు.

దోపిడీ రహిత సమాజం కోసం ఉద్యమించాలి

- పిఒడబ్ల్యు జాతీయ కన్వీనర్ వి.సంధ్య
- రెండు ప్రగతిశీల మహిళా సంఘాలు విలీనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

దోపిడీ రహిత సమాజం కోసం మహిళలు అన్ని ఉద్యమాలలో ముందు వరుసలో ఉండాలని పిఒడబ్ల్యు జాతీయ కన్వీనర్ వి.సంధ్య కోరారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రెండు ప్రగతిశీల మహిళా సంఘాల విలీన సభ శనివారం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఎన్‌జిఒ హోమ్‌లో జరిగింది. మహిళా అమరవీరులకు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి నివాళు లర్పించారు. తొలుత కలెక్టరేట్ నుంచి ఎన్‌జిఒ హోమ్ వరకు మహిళలు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు పిఒడబ్ల్యు అధ్యక్షులు విష్ణు, గంగాభవాని అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వి.సంధ్య మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వం కోసం పోరాడుదామని పిలుపునిచ్చారు. పిఒడబ్ల్యు జాతీయ కోఆర్డినేటర్ ఝాన్సీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు రమా సుందరి మాట్లాడుతూ.. స్త్రీకి సమాన హోదా, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు బి పద్మ, ఎం.లక్ష్మి ప్రసంగించారు. మహిళా దినోత్సవం సందర్భంగా అరుణోదయ సాంస్కృతిక ప్రదర్శనలు, మహిళా కోలాటం ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరుకు సిద్ధం కండి

ప్రజా చైతన్య యాత్రలో వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నెల్లూరు, ఎన్‌టిఆర్, పశ్చిమగోదావరి, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోనూ ప్రజాచైతన్య యాత్రలు చేపట్టారు. స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకుంటూ సిపిఎం బృందం ముందుకు సాగింది.

రెండోరోజు ప్రజా చైతన్యయాత్ర శనివారం కాకినాడ తాళ్లరేవు మండలం సీతారామపురం నుంచి ప్రారంభమైంది. మాధవరాయునిపేట, పోలేకుర్రు, తోటపేట, తూర్పుపేట, పి.మల్లవరం గ్రామాల్లో సాగింది. రెడ్డివారిపేటలో రెడ్డి శ్రీదేవి, రెడ్డి వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయిలు వేశారని, ఏడు నెలలు గడిచినా నేటికీ తాగునీరు సరఫరా చేయడం లేదని తెలిపారు. పోలేకుర్రు పంచాయతీ పరిధిలోని తోటపేటకు చెందిన పేద రైతులు కొండబాబు, లక్ష్మణరావు మాట్లాడుతూ.. గ్రామంలో 30 ఏళ్లుగా 60 ఎకరాల రాణిగారి భూములను సాగు చేసుకుంటున్నామని, వీటికి పట్టాలిస్తామని ప్రజాప్రతినిధులు చెప్పడం తప్ప నేటికీ ఇవ్వలేదని వాపోయారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వి శ్రీనివాసరావును కోరారు. సాగునీరు అందడం లేదని పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేటకు చెందిన రైతులు తెలిపారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండలంలోని శివారు భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. వరి పంట పొట్టదశలో ఉందని, ఈ సమయంలో నీటిని అందించకపోతే రైతులు నష్టపోతారన్నారు. నీలపల్లిలో దళిత శ్మశాన వాటికలో ముంపు నివారణా చర్యలు చేపట్టాలని కోరారు.



విజయనగరంలో నిర్వహించిన ప్రజా చైతన్యయాత్రలో పాల్గొన్న సిపిఎం నాయకులు, ప్రజలు


అమరవీరుల స్తూపం శంకుస్థాపనలో పాల్గొన్న వి.శ్రీనివాసరావు

అమరవీరుల స్థూప నిర్మాణానికి శంకుస్థాపన

తాళ్లరేవు మండలం నీలపల్లిలో నూతనంగా నిర్మించనున్న అమరవీరుల స్థూపానికి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. 1950 దశకంలో తెలంగాణ సాయుధ పోరాటం జరిగినప్పుడు నీలపల్లి గ్రామంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించిన కమిడి వెంకటనారాయణ, మాతా వేమనాచార్యులు, దడాల మహాలక్ష్మి, మేడిశెట్టి నీలాద్రిలకు గుర్తుగా దీనిని నిర్మిస్తున్నట్లు సిపిఎం నాయకులు తెలిపారు. విజయనగరం జిల్లా కేంద్రం లంకాపట్నం హుదూద్ ఇళ్ల సముదాయం వద్ద నిర్వహించిన యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. 2009లో నిర్మించిన హుదూద్ ఇళ్లు, పదేళ్ల క్రితం నిర్మించిన టిడ్కో ఇళ్లను నేటికీ లబ్ధిదారులకు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పరిధిలోని తాడేరు టిడ్కో గృహ సముదాయాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య సైకిల్ యాత్రను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం ప్రారంభించారు. ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి, నెల్లూరు, విజయవాడలో యాత్రలు కొనసాగాయి.

టిడిపి కార్యాలయంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్ల రామయ్య, టిడిపి నేత కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పాల్గొన్నారు. వర్ల రామయ్య మాట్లాడుతూ టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టి రామారావు మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. అదే బాటలో ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దన్నలా మహిళలకు ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు. అనేక మంది మహిళా నాయకులను రాజకీయంగా చంద్రబాబు ప్రోత్సాహించారని చెప్పారు. అనంతరం కార్యాలయంలో ఉన్న మహిళా సిబ్బందికి వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సయ్యద్ రఫి, రమేష్, మహిళా నాయకులు కృష్ణవేణి, రాధిక, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయంలో

వైసిపి కార్యాలయంలోనూ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి ఆర్‌కె రోజా, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల సాధికారత అంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే గుర్తుకు వస్తారని చెప్పారు.

మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా వారిని గాలికి వదిలేయడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని విమర్శించారు. అధికారంలోకి వచ్చి 9 నెలలైనా ఆడబిడ్డ నిధి పథకం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. హోంమంత్రి సొంత జిల్లా విశాఖపట్నంలో గంజాయి పండిస్తున్నా కనపడదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వానికి రెడ్‌బుక్ రాజ్యాంగంపై ఉన్న శ్రద్ధ మహిళల భద్రతపై లేదని విమర్శించారు.

వైసిపి ఆధ్వర్యంలో 12న 'యువత పోరు'

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి అమలు, మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ వైసిపి ఈ నెల 12న 'యువత పోరు' కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆ పార్టీ నాయకులు వైవి సుబ్బారెడ్డి శనివారం వైసిపి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ప్రధాన హామీలు అమలు చేయకపోవడంతో యువకులు, నిరుద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వైసిపి హయాంలో ప్రారంభించిన వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనివల్ల వైద్య విద్య చదవాలన్న పేద విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లుతోందని పేర్కొన్నారు. ఈ నెల 12న తమ పార్టీ ఆవిర్భావ దినోత్సవం అని, ఆ రోజు అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట విద్యార్థులు, నిరుద్యోగులు, యువతతో కలిసి వైసిపి శ్రేణులు ధర్నా నిర్వహిస్తారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, వరుదు కళ్యాణి, మాజీ ఎమ్మెల్యేలు టిజేఆర్ సుధాకర్ బాబు, మల్లాది విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రులు ఎక్కడున్నా...బాసటగా నిలవాలి

- ఏపి, తెలంగాణ ప్రభుత్వాలకు మాజీ సిజెఐ ఎన్‌వి రమణ పిలుపు

రాయ్‌పూర్ : ఆంధ్రులు ఎక్కడున్నా..వారికి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు బాసటగా నిలవాలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ పిలుపునిచ్చారు. ఛత్తీస్‌గఢ్ తెలుగు మహా సంఘం ద్వితీయ మహాసభ శనివారం రాయ్‌పూర్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ ఎన్‌వి రమణ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లోని తెలుగు వారు మాతృభాషా, సంస్కృతి పరిరక్షణకు చేస్తున్న కృషికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు సహకారం అందించాలన్నారు. పదేళ్ల క్రితం ప్రపంచంలో తెలుగు రెండోస్థానంలో ఉండగా నేడు నాలుగో స్థానానికి దిగజారిందన్నారు. ఏపిలో గత ప్రభుత్వం ఇచ్చిన జీవో 85ను ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాల్సి ఉందని, ఇందుకోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చిస్తానని తెలిపారు. ఆత్మీయ అతిథిగా హాజరైన రాష్ట్ర అధికార భాషా సంఘం మాజీ చైర్మన్, అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుమారు పది కోట్ల మంది తెలుగు ప్రజలు నివసిస్తుంటే, భారతదేశంలోని ఇతర రాష్ట్రాల్లో, ఇంకా విదేశాలలో దాదాపు ఐదు కోట్ల మంది ఉన్నారన్నారు.

దేశంలో హిందీ తర్వాత తెలుగునే ఎక్కువగా మాట్లాడుతున్నారన్నారు. పశ్చిమ బెంగాల్లో తెలుగును అక్కడి ప్రభుత్వం అధికార భాషగా గుర్తించిందని, ఆ దిశగా ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కూడా కృషి చేయాలని కోరారు. శ్రీకాకుళం శాసనసభ్యుడు గొండు శంకరరావు మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో ఉన్న తెలుగు వారిలో బిసిలకు సంబంధిత ధ్రువ పత్రాలను ఇవ్వడం లేదని, ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఛత్తీస్‌గఢ్ తెలుగు మహా సంఘం అధ్యక్షులు రాళ్లపల్లి మురళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సినీ నటులు సాయికుమార్, గజల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జస్టిస్ ఎన్‌వి రమణ

'ఉక్కు' పరిరక్షణే ధ్యేయంగా పోరాటాలు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు పరిరక్షణే ధ్యేయంగా కార్మికులు పోరాడుతున్నారని, తప్పక విజయం సాధిస్తారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1486వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అవలంబిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాలు కార్మికుల్లో భయాందోళనలను రెట్టింపు చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికులను తొలగించేందుకు రంగం సిద్ధం చేశారని, శాశ్వత కార్మికులను విఆర్‌ఎస్ పేరుతో దూరం చేయడానికి సిద్ధమయ్యారని తెలిపారు. మెయింటినెన్స్‌లేక ప్లాంట్‌లో యంత్రాలు తుప్పు పడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులు లక్ష్యాలను పూర్తి చేయడానికి మరింత ఎక్కువ కష్టపడాల్సి వస్తోందని తెలిపారు. వేతనాలను ఆరు నెలలుగా సకాలంలో ఇవ్వకపోవడంతో వారంతా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా మోడీ సర్కారు తీరు మార్చుకోవాలని కోరారు.



నల్లవస్త్రాలు ధరించి వినూత్న నిరసన తెలుపుతున్న వెటర్నరీ విద్యార్థినులు

'న్యాయం' కావాలి

- కొనసాగిన వెటర్నరీ విద్యార్థుల దీక్ష

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

'న్యాయం కావాలి' అంటూ వెటర్నరీ వైద్య విద్యార్థులు తమ దీక్షలను కొనసాగిస్తున్నారు. మహిళా దినోత్సవం రోజున పోరాట స్ఫూర్తిని చాటారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయంలో ఉపకార వేతనాలు, ఇతర వైద్య విద్య కోర్సులతో సమానంగా తమకు స్టైఫండ్ పెంచాలని కోరుతూ చేస్తున్న నిరసన దీక్షలు శనివారం 34వ రోజుకు చేరుకున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పశువైద్య విద్యార్థులు నల్ల వస్త్రాలు ధరించి, నల్ల మాస్కులతో వినూత్నంగా నిరసన తెలిపారు. మహిళా దినోత్సవం జరుపుకోవడంలేదని ఇంతమంది సమ్మె నిర్వహిస్తుంటే ఏ ఒక్క అధికారి నుంచి స్పష్టమైన హామీ లేకపోవడం బాధాకరమని విద్యార్థినులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య కళాశాల విద్యార్థులు నీలిమ, ప్రవీణ, పురుషోత్తం, యుగంధర్, పవన్ పాల్గొన్నారు.


విజయవాడ భవానీపురం పోలీసుస్టేషన్లో పోసాని మురళీకృష్ణ

పోసానికి 20 వరకు రిమాండ్

- విజయవాడ సిఎంఎం కోర్టులో హాజరు
- మళ్లీ కర్నూలు సబ్ జైలుకు తరలింపు

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ)

సినీ నటుడు, వైసిపి నాయకులు పోసాని కృష్ణమురళికి ఈ నెల 20 వరకు రిమాండ్ విధిస్తూ విజయవాడ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పిటి వారెంట్‌పై శనివారం కర్నూలు జిల్లా జైలు నుంచి ఆయనను విజయవాడ భవానీపురం పోలీసుస్టేషన్‌కు పోలీసులు తరలించారు. అనంతరం విజయవాడ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ (సిఎంఎం) కోర్టులో పోసానిని పోలీసులు హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆయనకు ఈనెల 20 వరకు రిమాండ్ విధించడంతో పోసానిని తిరిగి కర్నూలు సబ్ జైలుకు తరలించారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, మంత్రులు, వారి కుటుంబ సభ్యులు, మీడియా సంస్థలపై దూషణలు, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంపై గత ఏడాది నవంబరు 12న జనసేన నేత శంకర్ ఫిర్యాదు మేరకు విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్‌లో పోసానిపై కేసు నమోదైంది.

ఒకే కేసుల్లో వివిధ స్టేషన్లకు తిప్పుతున్నారు : న్యాయమూర్తి ఎదుట పోసాని

తనపై అక్రమంగా కేసులు పెట్టారని, ఒకే విధమైన కేసులతో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ తిప్పుతున్నారని కోర్టులో హాజరు పరిచిన సమయంలో పోసాని న్యాయమూర్తికి తెలిపారు. తాను అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నానని, గుండె జబ్బు, పక్షవాతం లాంటి రుగ్మతలు ఉన్నాయని చెప్పారు. తనను ఎక్కడికి తీసుకెళ్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసు వాహనంలో గంటల తరబడి కూర్చోలేకపోతున్నానని, తనను ఒకే జైలులో ఉంచేలా ఆదేశాలివ్వాలని కోరారు. పిటి వారెంట్‌పై వచ్చినందున తాను ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేనని న్యాయమూర్తి తెలిపారు.



శక్తి యాప్ లోగోను ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

ఏడాదిలో లక్షమంది మహిళా పారిశ్రామికవేత్తలు

మొదటిపేజీ తరువాయి

ప్రారంభించారు కదా? నీళ్లు రాలేదా? అని చమత్కారంగా అడిగారు. ఆయన చెప్పిందంతా ఒట్టిమాటలే కదా? అని చంద్రబాబు అన్నారు. వెలుగొండను పూర్తి చేసే బాధ్యత తనదేనని తెలిపారు. కృష్ణా నది నుంచి చాలనప్పుడు గోదావరి నీటిని కృష్ణాకు మళ్లించి అక్కడ నుంచి కృష్ణా కాలువల ద్వారా వెలుగొండ కాలువలకు అనుసంధానం చేసి ఆయకట్టు రైతులకు నీళ్లు అందిస్తామని వివరించారు. మార్కాపురం జిల్లాను త్వరలో ఏర్పాటు చేసి ఎన్నికల హామీని నిలబెట్టుకుంటానన్నారు.

మహిళల రక్షణకు 'శక్తి' యాప్ ఆవిష్కరణ

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల రక్షణ కోసం 'శక్తి' పేరుతో రూపొందించిన యాప్‌ను చంద్రబాబు ఆవిష్కరించారు. యాప్‌ను మహిళలు తమ సెల్‌ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. ఎక్కడైనా అకతాయిలతో ప్రమాదం పొంచి ఉంటే ఐదు లేదా ఆరుసార్లు సెల్‌ఫోన్‌ను ఊపితే 7-8 నిమిషాల వ్యవధిలో పోలీసులు అక్కడకు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గుమ్మడి సంధ్యారాణి, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా, ఎమ్మెల్యేలు కందుల నారాయణరెడ్డి, దామచర్ల జనార్ధన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, ముత్తుముల అశోక్‌రెడ్డి, బిఎన్ విజయకుమార్, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పర్యాటక సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్, దర్శి ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, కలెక్టర్ తమీన్ అన్సారియా, ఎస్‌పి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

వివిధ భాషలు నేర్చుకోవాలి

ఎన్‌డిఎకు బేషరతుగా మద్దతు
ఇండియా టుడే కాంక్లేవ్‌లో మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ఎల్లప్పుడూ దేశ ప్రగతికి దోహదపడుతుందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. శనివారం నాడిక్కడ ఇండియా టుడే కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తెలుగును ప్రమోట్ చేస్తున్నామని, స్థానిక భాష తెలుగు అని పేర్కొన్నారు. భాషను బలవంతంగా రుద్దుతారని చెప్పడాన్ని తాను నమ్మనని అన్నారు.

వివిధ భాషలు నేర్చుకోవడం అవసరమని అన్నారు. వైసిపి పాలనలో ఇసుక అక్రమ మైనింగ్ జరిగిందని, సుప్రీంకోర్టులో కేసు కూడా నడుస్తుందని తెలిపారు. ఎన్‌డిఎకు బేషరతుగా మద్దతు ఇస్తున్నామని చెప్పారు. శాసనసభలో ప్రతిపక్ష హోదా ఉండాలంటే మొత్తం సభ సంఖ్యాబలంలో పదిశాతం ఉండాలని అన్నారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిని తానని చెప్పారు. పార్లమెంట్, శాసనసభలో ఉండే నిబంధనలను తాము ఎలా ఉల్లంఘిస్తామని ప్రశ్నించారు. ప్రపంచ భాషలు నేర్చుకోవడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. జర్మనీ, జపాన్ భాషలను నర్సింగ్ వృత్తిలో ఉండే వారికి నేర్పిస్తున్నామని, అందువల్ల వారికి ఆయా దేశాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. పిల్లలకు ఏది ఇష్టమో అది నేర్చుకునే అవకాశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మనమిత్ర పథకంతో వాట్సాప్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కుల ధ్రువీకరణ పత్రాలు, హాల్ టికెట్లు, ఇతర పత్రాలు, ల్యాండ్ రికార్డులను ఈజీగా వాట్సాప్ సేవలో పొందవచ్చని అన్నారు. టాటా పవర్‌తో 7 గిగా వాట్స్ ఒప్పందం జరిగిందని అన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఎఐ)కు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. విద్యా శాఖ కావాలని తాను ఎంచుకున్నానని, దానిలో బలమైన టీచర్స్ యూనియన్లు ఉన్నాయని గుర్తుచేశారు. తన భార్య తన క్రెడిట్ కార్డు బిల్లు చెల్లిస్తోందని చెప్పారు. మహిళా దినోత్సవం ఒక్క రోజు మాత్రమే కాదు, ప్రతిరోజూ జరుపుకోవాలని అన్నారు. ఛాంపియన్ ట్రోఫీ ఫైనల్ ఇండియా గెలుస్తుందని మంత్రి నారా లోకేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

గ్రామ సర్వేయర్ల పోరుబాట

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సర్వేలు, రీసర్వే పేర్లతో భారాల మీద భారాలు పడుతున్న గ్రామ సర్వేయర్లు సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టనున్నారు. ఇందులో భాగంగా ఈనెల 9న విజయవాడలో భారీ ధర్నా చేపట్టనున్నారు. ఇప్పటికే ఈ నెల 4న కలెక్టర్లను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నా ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో ఫలితం రాలేదని, అందుకే ఉద్యమబాట పట్టాల్సివస్తోందని గ్రామ సర్వేయర్లు తెలిపారు. తరాల నుంచి రెవెన్యూ రికార్డుల్లో దొర్లిన తప్పులను సరిచేయకుండా భూముల రీసర్వే చేయాలనడం, గత తప్పులకు ఇప్పుడు గ్రామ సర్వేయర్లను బాధ్యులు చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ప్రతి గ్రామ సర్వేయర్‌కు ఒక లాప్‌టాప్, ఇతర ఎక్విప్‌మెంట్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. భూముల సర్వేకు అదనంగా ప్రభుత్వం ఆదేశిస్తున్న పలు సర్వేలను కూడా తామే చేయాలంటూ తమను మల్టీపర్పస్ రీసోర్స్‌గా పని చేయాలంటూ అధికారుల నుంచి ఒత్తిళ్లు ఎదురౌతున్నాయని వాపోతున్నారు. సర్వేలో పాల్గొనకపోతే షోకాజ్ నోటీసులు, మెమోలు ఇస్తున్నారని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్-2047 అమలులో భాగంగా గ్రామ సచివాలయాల్లో మిగులు సిబ్బందని ప్రభుత్వం నోటిపై చేసింది. ఇందులో అత్యధికంగా గ్రామ సర్వేయర్లు (గ్రేడ్-3) 4,722మంది ఉన్నట్లు తేల్చారు. మిగులు సిబ్బందిని ఎక్కడ ఎలా సర్దుబాటు చేస్తారనే విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదని వారు పేర్కొంటున్నారు. భూ యాజమాన్యహక్కులను నిర్ధారించే అధికారులను సర్వే శాఖ తరపున నియమించేలా శాఖాపరమైన సంస్కరణలు చేపట్టాల్సి ఉందని క్షేత్రస్థాయి రెవెన్యూ సిబ్బంది నుంచి డిమాండ్ వినిపిస్తోంది. అర్హత గల గ్రామ సర్వేయర్లందరికీ తక్షణమే పదోన్నతులు కల్పించడంతో పాటు పనిభారాన్ని తగ్గించాలని లేని పక్షంలో తాము ఉద్యోగ నిర్వహణలో ముందుకు సాగడం ఇబ్బందికరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రామ స ర్వే సిబ్బందిని మాతృశాఖ అయిన సర్వే, భూ రికార్డుల శాఖలోకి మార్చాలని గ్రామ సర్వేయర్లు విజ్ఞప్తి చేస్తున్నారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో గ్రామ సరిహద్దులను, ప్రభుత్వ భూములు అన్నీ కూడా నిర్ధారించిన తర్వాత మండల లెవల్ సర్వేఆఫీసరు (ఎంఎల్ఎస్ఓ), 30 వాతం డిప్యూటీఇనెస్పెక్టర్ ఆఫ్ సర్వేయరు (డిఐఓఎస్) భూమి మీద పరిశీలించాల్సి ఉంటుంది. అనేక ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన సక్రమంగా లేక పోవడంతో రైతులకు సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఫలితంగా ఆ ప్రభావం గ్రామ సర్వేయర్ల పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మహిళలపై పెరిగిన అఘాయిత్యాలు

- పిసిసి చీఫ్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ఐదేళ్లలో మహిళలపై అఘాయిత్యాలు 25 శాతం పెరగడం, 54 వేల మంది మహిళల మిస్సింగ్ కేసులు నమోదు కావడం అత్యంత దారుణమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో మహిళలకు భద్రత లేదని పలు అంశాలను ఆమె పేర్కొన్నారు. గడిచిన పదేళ్లలో 2 లక్షల వేధింపుల కేసులు నమోదైనట్లు తెలిపారు. హింసకు కారణం అవుతున్న మద్యం, మత్తు పదార్థాలు అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.

మరోవైపు సాధికారత అంటూ మహిళలను మోసం చేస్తున్నారని చెప్పారు. ఉచిత బస్సు, నెలకు రూ.1500 ఆర్థిక సాయం, సున్నా వడ్డీకే రుణాలు, తల్లికి వందనం వంటి పథకాలు ఇస్తామని మహిళలకు టోకరా వేశారని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపికి మహిళలు అంటే గౌరవం లేదని, మహిళలకు భద్రత కరువైందని తెలిపారు. ఓటు బ్యాంక్ కోసం మహిళలను సెకండ్ క్లాస్ సిటిజన్ల కింద బిజెపి సర్కార్ లెక్కగట్టిందని పేర్కొన్నారు. వికసిత్ భారత్‌లో గంటకు 50 మంది మహిళలపై భౌతికదాడులు, రోజుకు 80 మందిపై లైంగిక వేదింపులు జరగడం అత్యంత శోచనీయమన్నారు. ఆచరణలో మహిళలను నగ్నంగా ఊరేగించిన చరిత్ర బిజెపి, దాని అనుబంధ సంఘాలదని చెప్పారు. మహిళల భద్రతపై ఎన్ని చట్టాలు ఉన్నా పేరుకే తప్ప, ప్రయోజనం లేదన్నారు.

నేటి నుంచి శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు

ప్రజాశక్తి -తిరుమల

శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు ఆదివారం నుంచి నిర్వహించనున్నారు. తొలిరోజు రాత్రి ఏడు గంటలకు ఈ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 13 వరకూ ప్రతిరోజూ రాత్రి ఏడు నుంచి ఎనిమిది గంటల వరకు స్వామి, అమ్మవార్లు పుష్కరిణిలో విహరించనున్నారు. తెప్పోత్సవాల కారణంగా మార్చి తొమ్మిది, పది తేదీల్లో సహస్ర దీపాలంకార సేవ, మార్చి 11, 12, 13 తేదీల్లో ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

మహిళలు ఆత్మగౌరవంతో జీవించాలి

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)/పెదనందిపాడు (గుంటూరు జిల్లా)



విజయవాడ లెనిన్ సెంటరులో జరిగిన బహిరంగ సభలో మహిళలు, నేతలు

మహిళలు ఆత్మగౌరవంతో జీవిస్తూ ఆర్థికంగా అభివద్ధి చెంది, వారి హక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. బాపట్ల జిల్లా చీరాలలోని యుటిఎఫ్ కార్యాలయంలో చీరాల ప్రాంతీయ మండలాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. యుటిఎఫ్ మహిళా జిల్లా కార్యదర్శి రావి పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలందరూ ఆత్మగౌరవంతో జీవించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. మహిళలు వంట గదులకే పరిమితం కాకుండా వారి హక్కులను వినియోగించుకుంటూ అన్ని రంగాలలో రాణించాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రమాదేవిని సన్మానించారు.

విజయవాడలో ఐద్వా, శ్రామిక మహిళా సంఘం (సిఐటియు), యుటిఎఫ్ ఆధ్వర్యాన ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం లెనిన్ సెంటర్‌లో ఐద్వా ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి, శ్రామిక మహిళా కన్వీనర్ ఎ.కమల అధ్యక్షతన బహిరంగ సభలో డి.రమాదేవి, ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మీ మాట్లాడుతూ 115 ఏళ్ల క్రితం పని గంటల కోసం, ఓటు హక్కు కోసం, నిర్బంధ పనికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు జరిగాయన్నారు. ఆ పోరాటాల స్ఫూర్తితో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు. మహిళలు అనేక రంగాల్లో పని చేస్తున్నా.. ఇప్పటికీ అనేక రూపాల్లో వివక్షకు గురవుతున్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం అనేక రంగాల్లో అమలు కావటంలేదని తెలిపారు. టిడిపి కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ 6 పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు కె.సుబ్బరావమ్మ, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సమాన హక్కుల బాధ్యత ప్రభుత్వాలదే : రమాదేవి

మహిళలు ఆత్మగౌరవంతో జీవించేందుకు వీలుగా అన్ని రంగాల్లో సమాన హక్కులు కల్పించి అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని రమాదేవి అన్నారు. గుంటూరు జిల్లా పెదనందిపాడులో ఆమె శనివారం విలేకర్లతో మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, ఉపాధి కల్పనకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులను పెంచాలని డిమాండ్ చేశారు. వారు చేస్తున్న పనికి న్యాయమైన వేతనం ఇవ్వాలని కోరారు. డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు సున్నా వడ్డీ రుణాలిస్తామని ఎన్నికలప్పుడు టిడిపి కూటమి హామీ ఇచ్చినా ఇంకా అమలు చేయలేదని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సును జిల్లా వరకే పరిమితం చేస్తామనడం అన్యాయమని, ఇతర రాష్ట్రాల్లో మాదిరి రాష్ట్ర వ్యాప్తంగా ప్రయాణ అనుమతి ఉండాలని, తక్షణమే దీన్ని అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు.

కాటికాపరులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి

- కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - విజయవాడ


సింగ్‌నగర్‌లో కాటికాపరుల సమస్యలను తెలుసుకుంటున్న అంద్ర మాల్యాద్రి, తదితరులు

కాటికాపరులకు గుర్తింపు కార్డులిచ్చి, నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంద్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. వయస్సు నిండిన వారిందరికీ రూ.ఎనిమిది వేలు పింఛను ఇవ్వాలని, వృత్తి పరికరాలు అందజేయాలని కోరారు. విజయవాడ సింగ్‌నగర్‌లో ఉన్న హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశాన వాటికలను శనివారం ఆయన పరిశీలించి, వాటిలోని కాటికాపరుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ.. శ్మశానంలో పనిచేసే వృత్తిదారులందరికీ ప్రమాద బీమా, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని, రెండెకరాల సాగు భూమి ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు స్థలం కేటాయించి, ఇల్లు నిర్మించి ఇవ్వాలని, ఆక్రమణదారుల నుంచి శ్మశానాన్ని కాపాడాలని, చుట్టూ ప్రహరీలు నిర్మించాలని, శ్మశానంలో బోరు వేయించి, షెడ్డు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిఒ నెంబరు 1235 ప్రకారం ప్రతి దళితపేటకు రెండెకరాల శ్మశాన స్థలం కేటాయించాలని కోరారు. సింగ్‌నగర్ ప్రాంతంలోని మూడు శ్మశానాలపై ఆరు కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని, మరికొన్ని కుటుంబాల వారు భవన నిర్మాణ, టైల్స్, పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరికి ఏలాంటి గుర్తింపులేదన్నారు. వీరిలో డిగ్రీ, ఇంటర్ చదివిన యువకులు ఉన్నారని తెలిపారు. కాటికాపురుల వృత్తిని ప్రభుత్వం నేటికీ గుర్తించడం లేదని, వీరికి ఎటువంటి వృత్తి భద్రతా లేదన్నారు. కాటికాపరుల సమస్యలను శాసనసభలో చర్చించి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని డిమాండ్ చేశారు. కాటికాపరుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ విజయవాడ సెంట్రల్ అధ్యక్షులు చింతల శ్రీనివాస్, ప్రజా సంఘాలు నాయకులు పీరు సాహెబ్, పి.రవి కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల డేటాకు రక్షణ కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థుల డేటాకు రాష్ట్రప్రభుత్వం రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఏ అశోక్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రప్రభుత్వం 161 సేవలను వాట్సాప్ ద్వారా ఇ-గవర్నెన్స్ సేవలు అందించాలనే ఉద్దేశంతో వాట్సాప్ ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఇందులో భాగంగానే ఇంటర్మీడియట్, పదో తరగతి విద్యార్థులకు వాట్సాప్ ద్వారా హాల్ టికెట్లు అందించేలా ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రంలో ఇప్పటికే ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశ్శారు. ఆధార్ ఆధారిత యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో జరిగే మోసాలు పట్ల జాగ్రత్తగా ఉండాలంటూ ప్రభుత్వం హెచ్చరిస్తూ ప్రకటనలు కూడా జారీ చేస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి సందర్భంలో వాట్సాప్ ద్వారా విద్యార్థుల డేటా బయటకు వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల డేటాకు రక్షణ కల్పించే బాధ్యత తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న అర్జున అవార్డు గ్రహీత ఇషాసింగ్

సంకల్పం ఉంటే సాధించలేనిది లేదు

- విట్ మహిళా దినోత్సవంలో షూటర్ ఇషాసింగ్

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

మహిళలమనే ఆత్మన్యూనతా భావం వద్దని, సంకల్పం ఉంటే ఎలాంటి అవరోధాలనైనా అధిగమించొచ్చని అర్జున అవార్డు (షూటింగ్) గ్రహీత ఇషాసింగ్ అన్నారు. రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. ధృడ సంకల్పం ఉంటే మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటారని నిరూపితమవుతోందని చెప్పారు. విజయం సాధించాలంటే కష్టపడి పనిచేయాలన్నారు. తక్కువ మార్కులు వచ్చాయని బాధపడకుండా లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విసి డాక్టర్ ఎస్‌వి కోటారెడ్డి మాట్లాడుతూ.. తమ వర్సిటీ అడ్మిషన్లలో మహిళలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని తెలిపారు. 2017లో తమ క్యాంపస్‌లో 8 శాతమే విద్యార్థినులు కాగా.. ఇప్పుడు 33 శాతానికి పెరిగిందని, త్వరలోనే 50 శాతానికి చేరుతుందని ఆశిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా విటోపియా-2025 వార్షిక క్రీడలు, సాంస్కృతిక ఉత్సవం రెండో రోజు కార్యక్రమాలు నిర్వహించగా ప్రముఖ నేపథ్య గాయకులు షల్మాలి ఖోల్గాడే, కార్తీక్, డిజె యష్ సంగీత విభావరి ఆకట్టుకుంది. అంతకు ముందు డ్రగ్ రహిత ఇండియా నినాదంతో నిర్వహించిన మారథాన్‌ను గుంటూరు జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విఐటి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జివి సెల్వం, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీశ్‌చంద్ర ముదిగంటి, విటోపియా కన్వీనర్ డాక్టర్ కష్ణసామి, స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖాదీర్ పాషా, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.రామచంద్రరావు పాల్గొన్నారు.

మహిళపై సామూహిక అత్యాచారం

- ఆలస్యంగా వెలుగులోకి..

ప్రజాశక్తి-నిమ్మనపల్లె(అన్నమయ్య జిల్లా)

సమాజంలో మహిళల ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఓవైపు అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకునే సందర్భంలో.. మహిళల భద్రతపై టిడిపి కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు నిదర్శనంగా, సభ్య సమాజం తలదించుకునేలా ఓ వివాహితను బెదిరించి ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అన్నమయ్య జిల్లా నిమ్మనపల్లె మండలంలో ఈ దారుణం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు...నిమ్మనపల్లె మండలం, తవళం పంచాయతీ నాయునివారిపల్లికి చెందిన ఓ వివాహిత గత నెల 27న సాయంత్రం పాలు పోయడానికి సమీప గ్రామమైన నల్లంవారిపల్లికి కాలినడకన వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తుండగా నల్లంవారిపల్లెకు చెందిన నాగేంద్ర, సురేంద్ర అనే ఇద్దరు వ్యక్తులు మహిళను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డారు. ఎవరికైనా చెబితే ఆమె భర్తను చంపేస్తామని నిందితులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయమై మదనపడుతూ పక్కింటి మహిళకు జరిగిన దారుణాన్ని ఆమె వివరించారు. దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులకు ఈ విషయం ఆమె తెలపడంతో అత్యాచార ఘటన వెలుగు చూసింది. విషయం తెలుసుకున్న మదనపల్లె రూరల్ సిఐ సత్యనారాయణ, స్థానిక ఎస్ఐ తిప్పేస్వామితో కలిసి గ్రామానికి చేరుకొని బాధితురాలిని విచారించారు. వైద్యపరీక్షల నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై అత్యాచారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రంగన్న మృతదేహానికి రీపోస్టుమార్టం

- కేబినెట్ ఆదేశాలతో కదిలిన సిట్
- ఎనిమిది మంది వైద్యుల బృందం పర్యవేక్షణ
- మంగళగిరికి అవశేషాలు - 15 రోజుల్లో నివేదిక?



సమాధి వద్ద పోలీసులు, వైద్య సిబ్బంది (ఇన్‌సెట్‌లో) రంగన్న (ఫైల్)

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి వాచ్‌మెన్ రంగన్న మృతదేహానికి శనివారం రీ పోస్టుమార్టం నిర్వహించారు. తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆయన భార్య సుశీలమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. రంగన్న మృతిపై అనుమానాలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో డిజిపిని పిలిపించుకుని రాష్ట్ర కేబినెట్ ఆరా తీశారు.

రంగన్న మృతిని అత్యంత అనుమానాస్పద కేసుగా పరిగణించి సైంటిఫిక్ కోణంలో విచారించాలని కేబినెట్ ఆదేశించింది. దీంతో పోలీస్ ఉన్నతాధికారులు సిట్ విచారణకు ఆదేశించారు. సిట్ బృందం సభ్యులు అడిషనల్ ఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ ఉలసయ్య, జమ్మలమడుగు డిఎస్‌పి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో తహశీల్దార్ మహ్మద్ నజీర్, విఆర్ఒ ఆధ్వర్యంలో కడప జిజిహెచ్‌కు చెందిన ముగ్గురు వైద్యులు, తిరుపతికి చెందిన మరో ముగ్గురు ఎఫ్ఎస్ఎల్ సభ్యులు, మంగళగిరికి చెందిన ఇద్దరు ఫోరెన్సిక్ వైద్య నిపుణులు కలిసి మొత్తం ఎనిమిది మంది వైద్య బృందం పులివెందుల లయోలా డిగ్రీ కళాశాల సమీపంలోని శ్మశానంలో రంగన్న మృతదేహాన్ని వెలికితీసి రీ పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహం నుంచి కీలకమైన అవశేషాలను సేకరించి మంగళగిరి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. అక్కడ అత్యాధునిక పరికరాల సహాయంతో అవశేషాలను పరిశీలించనున్నారు. రంగన్నకు వైద్యులు అందించిన చికిత్సలో విషపూరిత కారకాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పరిశీలించనున్నట్లు తెలుస్తోంది. 15 రోజుల అనంతరం ఫోరెన్సిక్ నిపుణులు తుది నివేదిక అందజేయనున్నట్లు సమాచారం. రీ పోస్టుమార్టం ప్రాంతంలో జిల్లాకు చెందిన సిఐలు నరసింహులు, హాజీవల్లి, నలుగురు ఎస్ఐలు, పది మంది స్పెషల్ పార్టీ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



దీక్షలు చేస్తున్న శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు

200వ రోజుకు శ్రీవారిమెట్టు చిరు వ్యాపారుల దీక్షలు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి శ్రీవారి మెట్టు చిరువ్యాపారులు చేపట్టిన నిరసన దీక్షలు శనివారం నాటికి 200 రోజులకు చేరాయి. ఈ సందర్భంగా శ్రీవారి పటాన్ని ఏర్పాటు చేసి వినూత్నంగా యాగం నిర్వహించారు. '200 రోజులుగా దీక్షలు చేస్తున్నా మమ్మల్ని కరుణించవా స్వామి' అంటూ బ్యానర్‌ను ప్రదర్శించారు. గోవిందనామ సంకీర్తనలు చేస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు, కుటుంబ సభ్యులు, మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు తమ న్యాయమైన సమస్యల పరిష్కారానికి 200 రోజులుగా టిటిడి పరిపాలనా భవనం ఎదుట దీక్షలు చేస్తున్నా, టిడిపి కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. చిరు వ్యాపారులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలిపారు.

ఏడు నెలలుగా ఉపాధి లేక, ఆదాయం రాక వీరి కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. టిటిడి ఇఒ శ్యామలరావు, అడిషనల్ ఇఒ వెంకయ్యచౌదరి, చైర్మన్ బిఆర్ నాయుడు జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, శ్రీవారి మెట్టు చిరు వ్యాపారుల యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు, మధు, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

సర్క్యులర్ రద్దు కోసం 11న ధర్నా

- వెలుగు విఓఏ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన విఓఏ కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11న రాష్ట్రవ్యాప్త ధర్నా చేపట్టనున్నట్లు ఏపి వెలుగు విఓఏ(యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం(సిఐటియు) వెల్లడించింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ రూపాదేవి, కె ధనలక్ష్మీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెలుగు విఓఏలకు మూడేళ్ల కాలపరిమితి విధిస్తూ ఉద్యోగ భద్రత లేకుండా గత వైసిపి ప్రభుత్వం సర్క్యులర్ తీసుకొచ్చిందని తెలిపారు. దీనిని రద్దు చేయాలని విఓఏలు రాష్ట్రవ్యాప్తంగా పోరాడుతూనే ఉన్నారని వివరించారు. 2024 జనవరి 30, 31 తేదీల్లో విజయవాడలో వేలాది మందితో 36 గంటల ధర్నా నిర్వహించామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని నాడు ప్రతిపక్ష టిడిపి ఈ సభకు హాజరై హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఆ సర్క్యులర్‌ను రద్దు చేయలేదని, ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 4,500 మంది విఓఏలను అక్రమంగా తొలగించిందని, వీరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగభద్రత, మూడు నెలల బకాయి వేతనాలు, ఇన్సూరెన్స్, అక్రమ తొలగింపులు, రాజకీయ వేధింపులు ఆపాలని, కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని, ఆన్‌లైన్‌లో పొదుపు మహిళలతో బలవంతపు సరుకుల కొనుగోళ్లు ఆపాలని, స్వావలంబన పేరుతో వసూలు చేసిన రూ.1000ల నగదు తిరిగి పొదుపు మహిళలకు చెల్లించాలనే డిమాండ్‌తో ఈ ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

అనుమతుల్లేని ఓలా ఎలక్ట్రిక్ షోరూమ్‌లు

- 95 శాతం ట్రేడ్ సర్టిఫికెట్లు లేనివే..!
- ఆర్‌టిఎ అధికారుల చర్యలు



బెంగళూరు : ప్రముఖ ద్విచక్ర విద్యుత్ వాహనాల కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ ట్రేడ్ అనుమతులు లేకుండానే షోరూంలను నిర్వహిస్తోంది. 95 శాతం షోరూంలను అనుమతులు లేకుండానే నిర్వహిస్తోందని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆ వివరాలు.. దేశ వ్యాప్తంగా ఓలా ఎలక్ట్రిక్‌కు మొత్తంగా 4,000 రిటైల్ అవుట్‌లెట్‌లు ఉన్నాయి.. అందులో 3,400 షోరూంలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంది. వాటిలో కేవలం 100 షోరూంలకు మాత్రమే భారత మోటారు వాహనాల చట్టం ప్రకారం ట్రేడ్ సర్టిఫికేట్లు ఉన్నాయి. దీంతో ఆ సంస్థ 95 శాతం సెంటర్లను నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తోన్నట్లు స్పష్టం అవుతోంది. వీటిల్లో ద్విచక్ర వాహనాలను ప్రదర్శించడానికి, విక్రయించడానికి, టెస్ట్ రైడ్లను అందించడానికి లేదా రవాణా చేయడానికి అవసరమైన అనుమతులు లేవు.

2022లో తొలుత డిజిటల్ అమ్మకాలను మాత్రమే ప్రారంభించగా.. ఆ తర్వాత వినియోగదారులకు భౌతిక అనుభవాన్ని అందించడానికి, సర్వీసింగ్ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో షోరూంలను ఏర్పాటు చేయడం ప్రారంభించింది. గతేడాది కొత్తగా దాదాపు 3200 స్టోర్లను ఏర్పాటు చేయడం ద్వారా మొత్తం నెట్‌వర్క్‌ను 4,000 సెంటర్లకు విస్తరించింది. ఇందులో ద్వితీయ, తృతీయ శ్రేణీ నగరాలు ఉన్నాయి. ఈ విస్తరణ లక్ష్యంలో ప్రాథమిక అనుమతులు అయినటువంటి ట్రేడ్ సర్టిఫికెట్‌ను తీసుకోకపోవడం గమనార్హం.

పలు షోరూంలు సీజ్..

అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పలు షోరూంలను వివిధ రాష్ట్రాల్లోని రవాణా అధికారులు మూసివేస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. సంబంధిత రాష్ట్రాల్లోని కంపెనీ షోరూంల్లో దాడులు నిర్వహించి, వాటిని మూసివేసి, వాహనాలను సీజ్ చేసినట్లు సమాచారం. మరోవైపు రాష్ట్ర స్థాయి రవాణా అధికారుల నుంచి ఓలా ఎలక్ట్రిక్ షోకాజ్ నోటీసులను అందుకుంటుంది. కాగా.. ఈ వార్తలను ఓలా ఎలక్ట్రిక్ ఖండించింది. కంపెనీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, గోదాములు మోటారు వాహనాల చట్టం మార్గదర్శకాలకు అనుగుణంగానే ఉన్నాయని పేర్కొంది. అయితే ఆయా షోరూంలు ట్రేడ్ సర్టిఫికెట్లు కలిగి ఉన్నాయని మాత్రం స్పష్టం చేయకపోవడం గమనార్హం.

ఓలా ఎలక్ట్రిక్‌పై ముఖ్యంగా అమ్మకాల తర్వాత సర్వీసింగ్‌కు సంబంధించిన కార్యకలాపాలు, సేవలపై వాహనదారుల నుంచి ఇటీవల భారీగా ఫిర్యాదులు నమోదయ్యాయి. వినియోగదారుల హక్కుల ఉల్లంఘన, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, అన్యాయమైన వాణిజ్య పద్ధతులపై జాతీయ వినియోగదారుల హెల్ప్‌లైన్‌కు 10,000 పైనే ఫిర్యాదులు రావడంతో సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సిసిపిఎ) విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో విస్తరణ, కొత్త సర్వీసు సెంటర్లపై దృష్టి పెట్టింది. ఇదే క్రమంలో వ్యయాలు పెరగడంతో ఇటీవల 1,000 మంది సిబ్బందికి ఉద్వాసన పలుకనుందని రిపోర్టులు వచ్చాయి. ఇందులో శాశ్వత, కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారు. ప్రొక్యూర్‌మెంట్, కస్టమర్ రిలేషన్స్, ఛార్జింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సహా పలు విభాగాల్లో ఉద్వాసనలు ఉన్నట్లు తెలుస్తోంది. గతేడాది నవంబర్‌లోనూ 500 మందిని రోడ్డున పడేసింది. ఇటీవల ఆ సంస్థకు నష్టాలు పెరగడంతో ఈ చర్యలకు దిగుతోందని తెలుస్తోంది.

హీరో ఫిన్‌కార్ప్‌తో మారుతి సుజుకీ ఒప్పందం



న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ఇండియా (ఎంఎస్ఐఎల్) తన కొత్త, పాత కార్ల కొనుగోలుదారులకు రుణ సౌకర్యాన్ని అందించడానికి హీరో ఫిన్‌కార్ప్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు శనివారం మారుతి సుజుకి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ, హీరో ఫిన్‌కార్ప్ ఎండి, సిఇఒ అభిమన్యు ముంజల్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. దీంతో మారుతి సుజుకీ 40 కంటే ఎక్కువ రిటైల్ ఫైనాన్స్ భాగస్వాములకు విస్తరించినట్లయ్యింది. హీరో ఫిన్‌తో జట్టు కట్టడం ద్వారా వినియోగదారుల విభిన్న అవసరాలకు అనుగుణంగా వారికి విస్తృత శ్రేణి ఫైనాన్స్ ఎంపికలు లభిస్తాయని ఎంఎస్ఐఎల్ పేర్కొంది.

పసిడి రుణ నిబంధనలు కఠినతరం..!

న్యూఢిల్లీ : పసిడి తాకట్టు రుణాలు తీసుకునే వారి సంఖ్య భారీగా పెరగడంతో రిజర్వ్ బ్యాంక్ ఆందోళన వ్యక్తం చేస్తోంది. రుణదాతలు ఇబ్బడిమబ్బడిగా ఇస్తోన్న రుణాలకు తోడు ఇష్టారీతిన తాకట్టుదారులను ఇబ్బందులకు గురి చేస్తోన్న ఘటనలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కఠిన నిబంధనలను అమలులేకి తేవాలని రిజర్వ్ బ్యాంక్ యోచిస్తోందని సమాచారం. బ్యాంకులు, బ్యాంకింగేతర విత్త సంస్థలు జారీ చేస్తున్న పసిడి రుణాలపై నిఘా పెట్టాలని భావిస్తోంది. తాకట్టు పెడుతోన్న అసలు బంగారం వారిదేనన్న దానిపై పూర్తి వివరాలు సేకరించాలని బ్యాంకులకు ఇప్పటికే సూచించింది. ఇటీవల కాలంలో తమవద్ద ఉన్న బంగారాన్ని వేరేవారి నుంచి తీసుకొని ఇతర పెట్టుబడులకు, తనఖాకు వాడుతున్నారని ఆర్‌బిఐ అనుమానిస్తోంది. గడిచిన ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతానికి పైగా పెరగడంపై దృష్టి సారించింది.

మహిళలకు ఎస్‌బిఐ చౌక రుణాలు

ముంబయి : ఔత్సాహిక మహిళ వ్యాపారవేత్తలకు చౌక రుణాలు అందించనున్నట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) తెలిపింది. తక్కువ వడ్డీరేటుకే పూచీకత్తు లేకుండా అప్పులివ్వనున్నట్లు ఆ బ్యాంక్ ఛైర్మన్ సిఎస్ శెట్టి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'అస్మిత' పేరుతో ప్రత్యేక రుణాలను జారీ చేయనున్నామన్నారు. మహిళల ఆధ్వర్యంలోని ఎంఎస్ఎంఇలకు వేగంగా, సులభంగా రుణాలను అందిస్తామన్నారు.

సంపాదకీయం

పట్టుదలతో సాధ్యమే!

ఎండాకాలం...పరీక్షల కాలం కట్టకట్టుకుని ఒకేసారి వస్తాయి. ఎండాకాలం అంటే ఉష్ణోగ్రతలు పెరిగే కాలం. పరీక్షల కాలం అంటే ఒత్తిడి పెరిగే సమయం. వీటితో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా పెద్ద సవాళ్లను ఎదుర్కొంటారు. మార్చి 15తో ఇంటర్ పరీక్షలు ముగియనుండగా, 17 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమై ఈనెల చివరివరకూ కొనసాగుతాయి. పరీక్షలు విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన భాగం. అయితే, ఈ రోజుల్లో పరీక్షలు విద్యార్థులపై అత్యధిక ఒత్తిడిని కలిగిస్తున్నాయి. పరీక్షా ఫలితాలు వారి భవిష్యత్‌ను నిర్ణయిస్తాయన్న భావన వల్ల విద్యార్థులు తీవ్రమైన మానసిక ఒత్తిడిని అనుభవిస్తున్నారు. ఈ ఒత్తిడి వల్ల కొందరు విద్యార్థులు మానసిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. సమాజంలో వున్న పోటీ భావన, ఇంట్లో తల్లిదండ్రులు, స్కూల్లో టీచర్ల అధిక అంచనాలు ఒత్తిడికి గురిచేస్తున్నాయి. అయితే, సరైన ప్రణాళిక, సమర్థవంతమైన అధ్యయనం, ఆరోగ్య సంరక్షణ ద్వారా ఈ కాలాన్ని సులభంగా ఎదుర్కోవచ్చు. జీవితంలో విజయం సాధించడానికి క్రమశిక్షణ, శ్రమ, ఆత్మవిశ్వాసం అవసరం. మార్కులు తక్కువ వచ్చినవారు, తరగతి గదిలో మొద్దబ్బాయిలుగా ముద్ర పడినవారు...జీవితంలో గొప్ప విజయాలు సాధించిన ఉదాహరణలు అనేకం వున్నాయి. విద్య యొక్క వేర్లు చేదుగా వుంటాయి. కానీ, దాని ఫలాలు తీపిగా వుంటాయి.

ఈసారి మార్చి మొదటివారం నుంచే ఎండలు, వడగాడ్పుల తీవ్రత కూడా ఎక్కువగానే వుంటుందని నిపుణులు చెబుతున్నారు. వెంటిలేషన్ లేని గదులు, రేకుల షెడ్లలో పరీక్షలు రాసే విద్యార్థులు అప్రమత్తంగా వుండాలని, ఏమాత్రం అజాగ్రత్త వహించినా వడదెబ్బ బారిన పడే ప్రమాదం వుందని చెబుతున్నారు. దీనికితోడు పిల్లలు... ఏం చదవాలి? ఎలా చదవాలి? అన్న టెన్షన్‌తో సరిగ్గా తినలేరు, నిద్రపోలేరు. ఆ తర్వాత కూడా పాస్ అవుతామో, ఫెయిల్ అవుతామోనన్న భయం వారిని వెంటాడుతుంటుంది. తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి, పెద్దపెద్ద ఉద్యోగాలలో స్థిరపడాలని, తాము సాధించలేనిది తమ పిల్లల ద్వారా సాధించాలని కలలుగంటారు తల్లిదండ్రులు. వారి ఆశలను, ఉపాధ్యాయులు మెడకు తగిలించే ర్యాంకుల గుదిబండను మోయలేక, వాటిని నెరవేర్చుతామో లేదోనన్న ఆత్మన్యూనతా భావంతో, క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. 'చదువురాని వాడినని దిగులు చెందకు/ ఏమి చదివి పక్షులు పైకెగర గలిగెను/ ఏ చదువు వల్ల చేపపిల్ల ఈద గలిగెను' అంటారో కవి. కార్పొరేట్ స్కూళ్ల ర్యాంకుల మాయాజాలంలో కొట్టుకుపోకుండా... తమ బిడ్డల ఆసక్తిని గుర్తించి, ప్రోత్సహించాలి. ఎవరో ఏదో చేశారని, మనవాడూ అదే చెయ్యాలన్న అతి అంచనాలకు పోతే, బిడ్డలపై శక్తికి మించిన భారం మోపినట్లవుతుంది.

అదే సమయంలో పరీక్షలకు భయపడాల్సిన పనిలేదు. పరీక్షలు, మార్కులు మాత్రమే మనిషి జీవితాన్ని నిర్ణయించవు. అవి జ్ఞానానికి ఒక అంచనా మాత్రమే. శక్తి మేరకు కృషి చేయడం ముఖ్యం. ప్రతి విజయం-ప్రయత్నించాలనే నిర్ణయంతోనే మొదలవుతుంది. విజయం రాత్రికి రాత్రే లభించదు. 'విజయం సాధించడమే అంతిమం కాదు, వైఫల్యం ప్రాణాంతకం కాదు... కొనసాగించాలనే పట్టుదలే ముఖ్యం' అంటారు విన్‌స్టన్ చర్చిల్. విద్యార్థులు ర్యాంకులు తెచ్చే యంత్రాలు కాదు. పోటీతత్వం వారిని యాంత్రికంగా మార్చేస్తోంది. చదువొక్కటే కాదు... ఆటపాటలతో పాటు ఉల్లాసంగా, ఉత్సాహంగా పెరిగే వాతావరణం కూడా అవసరం. 'మనసు నింపాల్సిన పాత్ర కాదు... రగిలింపజేయాల్సిన నిప్పు' అంటారో కవి. ఇవాళ ఓడినా... రేపు గెలుస్తామన్న ఆశను మనసులో రగిలించాలి. అది తమ లక్ష్యం కోసం నిరంతరం శ్రమించేలా, పరితపించేలా చేస్తుంది. ఒకవేళ పరీక్షలలో ఫెయిల్ అయినా... నిరుత్సాహపడాల్సిన పనిలేదు. వారికి ఆసక్తి వున్న రంగంలో ప్రోత్సహించాలి. ప్రపంచంలోని ఏ మారుమూలనున్న ఇంట్లోనైనా రాత్రవగానే స్విచ్ వేస్తే... ఎలక్ట్రిక్ బల్బు వెలుగులు విరజిమ్ముతుంది. చిన్నతనంలో మొద్దబ్బాయిగా ముద్రపడి, ఆ తర్వాత గొప్ప శాస్త్రవేత్తగా ఎదిగిన థామస్ ఆల్వా ఎడిసన్ ఆ బల్బును కనుగొన్నారు. ప్రతి ఒక్కరిలోనూ నిగూఢంగా గొప్ప శక్తి దాగివుంటుంది. దాన్ని గుర్తించి, వెలికితీయగలిగితే... ప్రతి విద్యార్థీ ఒక ఎడిసన్‌లా ఉన్నత శిఖరాలకు ఎదుగుతారు.

మహనీయుల మాట



ప్రపంచానికి పెట్టుబడిదారీ వ్యవస్థ ఇచ్చిన కొత్త పారిశ్రామిక వ్యవస్థ కార్మికులకు విద్య, శిక్షణ గరపాల్సిన అవసరాన్ని నెలకొల్పింది. ఎందుకంటే అప్పుడే వాళ్లు సమర్థవంతమైన సంపద సృష్టికర్తలవుతారు గనక. అందువల్ల అది విద్యను 'ప్రజాస్వామీకరించింది'.

- లీనా మార్రో లెవిస్,
అమెరికా సోషలిస్టు పార్టీ నాయకురాలు.

మీడియాలో సృజన స్వేచ్ఛ, సభ్యతా విలువలు

ప్రస్తుతం

ఎ.పి, తెలంగాణ రాష్ట్రాలలో సోషల్ మీడియా ద్వారా వివిధ పార్టీల ప్రతినిధులు, నాయకులు చేసిన వ్యాఖ్యానాలు, ప్రయోగించిన బూతు పురాణాలపై ఎడతెగని వివాదాలు నడుస్తున్నాయి. కేసులూ అరెస్టులూ ఎలా వున్నా ఆ ధోరణులు మాత్రం మారడం లేదు. సినీ మీడియా రంగాల్లో ఎప్పుడూ ముందుండే వాళ్లు సోషల్ మీడియాను కూడా వ్యాపార మార్గంలో మళ్లించి అనేక అవాంఛనీయ ధోరణులు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో అసలు మీడియా, సోషల్ మీడియా ప్రయోజనాలు ప్రజా కోణం మరుగున పడిపోతున్నాయి. జాతీయ స్థాయిలో మీడియా స్వేచ్ఛ గురించిన పోరాటంతో సంబంధం లేని రాజకీయ తగాదాగా ఇది మారిపోయినట్టు కనిపిస్తుంది గానీ నిజానికి అదే కీలకమైన కోణం. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా మీకు ప్రాథమిక హక్కులంటే ఏమిటో తలకెక్కలేదని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఓకా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసిందంటే ఇదెంత తీవ్రమైన పోరాటంగా వుందో అర్థమవుతుంది.



తెలకపల్లి రవి

ఇమ్రాన్ ప్రతాప్ గర్హి రాజ్యసభ సభ్యుడు. కాంగ్రెస్ తరపున ఎన్నికైన ఈయన ఉర్దూ భాషా కవి, అవార్డు గ్రహీత కూడా. కాంగ్రెస్‌లో చేరిన కొద్ది కాలంలోనే ఆయనను ప్రమోట్ చేసి ఎంపీగానూ మైనార్టీ సెల్ చైర్మన్‌గానూ నియమించారు. కవి సమ్మేళనాల్లో ఆయన కవితలు బాగా ఆకర్షిస్తుంటాయట. ఇటీవల ఆయన జామ్ నగర్‌లో సామూహిక వివాహాలకు హాజరైన సందర్భంలో చదివిన కవిత వీడియో పోస్ట్ చేశాడు. 'ఏ ఖూన్‌కే ప్యాసే బాత్ సునో..' అంటూ. రక్త పిపాసులారా ఈ మాట వినండి అని దాని అర్థం. ఈ 46 సెకండ్ల పోస్టుకు బాగా స్పందన రావడమే గాక కింద ఇది మత రాజకీయాలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్య అన్నట్టు స్పందనలు కనిపించాయి. వెంటనే జామ్‌నగర్ పోలీసులు ఇది భిన్న మతాల మధ్య విద్వేషాలు పెంచేవిధంగా వుందంటూ కిషన్ నందా అనే వ్యక్తి నుంచి ఫిర్యాదు వచ్చిందని ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. ప్రతాప్ గర్హి ఇది నిజానికి ప్రేమను పెంచేందుకు ఉద్దేశించిందని వివరిస్తూ తనపై కేసు కొట్టేయాలని అహ్మదాబాద్ హైకోర్టును ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. ప్రఖ్యాత కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్‌దో లేక హబీబ్ జలీద్‌తో కావచ్చని చాట్ జీపిటతో సహా చెబుతున్నాయని సమాధానంలో తెలియజేశారు (వాస్తవానికి ఇది ఫైజ్ పాటగా సినిమాల్లో కూడా వాడారు). ఈ పాట ద్వారా తాను ప్రేమ, అహింస సందేశం ఇవ్వడానికి ప్రయత్నించానని కూడా పేర్కొన్నారు. తాను ఏదో నేరం చేసినట్టు ఎఫ్‌ఐఆర్ కూడా చెప్పడం లేదని ఆయన వాదించారు. అయితే ఈ పాటలో పదాలు వింటే రాజ్యాన్ని ఎదుర్కోమని చెప్పడం స్పష్టంగా అర్థమవుతుందని ప్రాసిక్యూషన్ వాదించింది. విచారణకు నిందితుడు సహకరించడం లేదని రాష్ట్ర ప్రభుత్వం కూడా అందుకు వంత పలికింది. మొత్తానికి అహ్మదాబాద్ హైకోర్టు ఎఫ్‌ఐఆర్ కొట్టివేయడానికి తిరస్కరించింది. సోషల్ మీడియా పోస్టుల ప్రభావం ఎంతటిదో తెలుసుగనక ఒక ఎంపీగా ప్రతాప్ గర్హి బాధ్యతగా వ్యవహరించాలని ఆయనకే సలహాలు ఇచ్చింది.

ఈ దశలో తనపై పోలీసులు చర్య తీసుకోకుండా ఆపాలంటూ ప్రతాప్ గర్హి సుప్రీం కోర్టును ఆశ్రయించారు. కపిల్ సిబాల్ ఆయన తరపున వాదించగా జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఆయనపై కేసులో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని గుజరాత్ పోలీసులను ఆదేశించింది. అంతకంటే కీలకంగా జస్టిస్ ఓకా చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ఈ పాట మతానికి గానీ జాతికి గానీ వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. నిజానికి ఇది అహింసను బోధిస్తున్నది. మతంతో ఏ సంబంధం లేదు. ఏ విధంగానూ జాతి వ్యతిరేక చర్య కానేరదని పేర్కొంది. జస్టిస్ ఓకా మరో అడుగు ముందుకేసి కవిత్వాన్ని అర్థం చేసుకోలేకపోవడం పట్ల ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇదే సమస్య. ఎవరికీ సృజనాత్మకత పట్ల గౌరవం లేదు. మీరు అన్యాయానికి గురైనా ప్రేమతో తట్టుకోండని ఆ పాట చెబుతుంది. రక్తదాహం తీరని వారు మా మాట వినాలని అంటున్నది. మేము న్యాయం కోసం చేసే పోరాటంపై మీరు అన్యాయంగా దాడి చేసినా మేము ప్రేమతోనే ఎదర్కొంటామని ప్రకటిస్తున్నది" అని ఆయన వివరించారు. హైకోర్టు ఈ అంశాలను గమనంలోకి తీసుకోకపోవడం బట్టి చూస్తే దేశం ఎటు పోతుందో తెలియడం లేదని కపిల్ సిబాల్ వ్యాఖ్యానించారు. దీనిపై కోపగించుకున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మనం హైకోర్టు మీద వ్యాఖ్యలు చేయొద్దని అడ్డుతగిలారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులు హైకోర్టుపై స్పందించకుండానే పోలీసులకు మాత్రం చురకలు వేశారు. 'పోలీసులు కూడా కొంతైనా సున్నితత్వం చూపించాలి, చదివి అర్థం చేసుకోవాలి. రాజ్యాంగం ఆమోదించిన 75 ఏళ్ల తర్వాత కూడా మీ పోలీసులు భావప్రకటనా రీతులు, వ్యక్తీకరణలు తెలుసుకోవాలని హితం చెప్పారు. ఇది కూడా తుషార్ మెహతాకు నచ్చలేదు. పోలీసులు కవిత్వం ఆస్వాదించాలనడం మరీ అతిశయంగా వుంటుందని వ్యాఖ్యానించారు. ఇది ఫైజ్‌ది కాదు రోడ్డు పక్క చెట్టు కింద కవిత లాంటిదేనని దెప్పి పొడిచారు. అంతకుముందు న్యాయమూర్తి మాటల్లో మహాత్మా గాంధీ కూడా అన్యాయాన్ని ప్రేమతో ఎదుర్కోవాలన్నారని చెప్పినప్పుడు ఈ కవితను మరీ మహాత్ముడితో పోల్చవద్దని అభ్యంతరం చెప్పారు. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీం కోర్టు తీర్పు వాయిదా వేసింది గానీ పోలీసులు పెట్టిన కేసు, హైకోర్టు సమర్థన, తుషార్ మెహతా అదే వాదించడం పరిస్థితికి అద్దం పడుతుంది.



> **జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఆయనపై కేసులో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని గుజరాత్ పోలీసులను ఆదేశించింది. అంతకంటే కీలకంగా జస్టిస్ ఓకా చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. ఈ పాట మతానికి గానీ జాతికి గానీ వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. నిజానికి ఇది అహింసను బోధిస్తున్నది. మతంతో ఏ సంబంధం లేదు. ఏ విధంగానూ జాతి వ్యతిరేక చర్య కానేరదని పేర్కొంది. జస్టిస్ ఓకా మరో అడుగు ముందుకేసి కవిత్వాన్ని అర్థం చేసుకోలేకపోవడం పట్ల ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇదే సమస్య. ఎవరికీ సృజనాత్మకత పట్ల గౌరవం లేదు. మీరు అన్యాయానికి గురైనా ప్రేమతో తట్టుకోండని ఆ పాట చెబుతుంది. రక్తదాహం తీరని వారు మా మాట వినాలని అంటున్నది. మేము న్యాయం కోసం చేసే పోరాటంపై మీరు అన్యాయంగా దాడి చేసినా మేము ప్రేమతోనే ఎదర్కొంటామని ప్రకటిస్తున్నది" అని ఆయన వివరించారు. హైకోర్టు ఈ అంశాలను గమనంలోకి తీసుకోకపోవడం బట్టి చూస్తే దేశం ఎటు పోతుందో తెలియడం లేదని కపిల్ సిబాల్ వ్యాఖ్యానించారు.**

సెన్సార్ కాదు, క్రమబద్ధీకరణ

సరిగ్గా ఈ కేసు విచారణ రోజునే సుప్రీంకోర్టులో యూట్యూబర్ రణవీర్ అల్హాబాదియా దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్ కీలక సూచనలు చేశారు. ఇవి నాణేనికి మరో వైపును కూడా చూపించాయి. అనేక సామాజిక అంశాలు చర్చకు పెట్టే అల్హాబాదియా ఇటీవల చేసిన కొన్ని వ్యాఖ్యలు దుమారం రేపాయి. మీ తల్లిదండ్రుల శృంగారం పిల్లలు చూడటం దానిపై వారి భావనల గురించి రణవీర్ ఇటీవల ఒక షో లో అనుచిత వ్యాఖ్యలు చేశారు. దానిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైన తర్వాత ఆయన కార్యక్రమాలను నిలిపేస్తూ ఫిబ్రవరి 18న సుప్రీం కోర్టు ఉత్తర్వులిచ్చింది. దానిపై రణవీర్ అరెస్టు చేయొద్దంటూనే ఆయన కార్యక్రమాలను నిలిపేసింది. ఈ నిలిపివేతను తొలగించాలంటూ ఆయన తరపున న్యాయవాది అభినవ్ చంద్రచూడ్ పిటిషన్ వేశారు. తన క్లయింట్ పైన 280 మంది ఆధారపడి వున్నారనీ, అతనేదో అపహాస్యం కోసం కావాలని అలా మాట్లాడలేదని సంజాయిషీ ఇచ్చారు. దానిపై జస్టిస్ సూర్యకాంత్ నిలిపివేత ఉత్తర్వులను సవరిస్తూ రణవీర్ షో కొనసాగించడానికి అనుమతించారు. అదే సమయంలో నైతికత హుందాతనం పాటించాలనీ, భారతీయ సమాజంలో సువ్యవస్థితమైన నైతిక ప్రమాణాలకు అనుగుణంగా నడుచుకోవలని హితవు పలికారు. దారి తప్పి వ్యవహరించి ప్రాథమిక వాక్ స్వాతంత్ర్యంపై సెన్సార్‌షిప్‌ను కొనితెచ్చుకోవద్దని హెచ్చరించారు. ఇంటిల్లిపాదినీ నవ్వించగలిగేదే మంచి హాస్యమని, దుర్భాషలతో ఎవరికీ ఎబ్బెట్టు అనిపించకూడదనీ ఆదేశించిన జస్టిస్ సూర్యకాంత్ బాలివుడ్‌లో మనకు గొప్ప హాస్యనటులున్నారని ప్రశంసించారు. హాస్యం, అసభ్యత, వికృతానందం వీటి మధ్య తేడా పాటించాలన్నారు. ఇలాంటి వాటిని క్రమబద్ధం చేసేందుకు ఏదైనా యంత్రాంగాన్ని సూచించాలని తుషార్ మెహతాను కోరారు.

'ఆనంద వికటన్'కూ అనుమతి


ఇక నూరేళ్లుగా నడుస్తున్న ప్రసిద్ధ తమిళ వార పత్రిక 'ఆనంద వికటన్'కూ ఈ ఆంక్షల సెగ తప్పలేదు. అది రాజకీయ కోణంతో కూడినది కావడం మరింత విశేషం. ఇటీవల డోనాల్డ్ ట్రంప్ మళ్లీ అధ్యక్ష పదవి చేపట్టాక ప్రధానమంత్రి మోడీ ఆదరాబాదరాగా వెళ్లి కలసి రావడం అనేక వ్యాఖ్యలకు దారి తీసిన సంగతి తెలిసిందే. ట్రంప్ విపరీత పోకడలనూ భారతీయ నిపుణుల, వ్యాపార వర్గాల ప్రయోజనాలపై వేటు వేసి తమ దేశానికి లాభం చేకూరే విధంగా ఆయన అనేక హుకుందారీ చర్యలకు పాల్పడ్డారు. అయితే మోడీ వాటిలో దేన్నీ ప్రశ్నించలేకపోయారు. పైగా అవేవో మనకు మేలు చేసేవన్నట్టుగా విదేశాంగ మంత్రి జైశంకర్ సమర్థిస్తున్నారు. అదలా వుంచితే 'ఆనంద వికటన్' ఆయన పర్యటన నేపథ్యంలో ఫిబ్రవరి 15న ఒక కేరికేచర్ ప్రచురించింది. ట్రంప్ ముందు మోడీ సంకెళ్లతో బందీగా వున్నట్టు అంటే స్వేచ్ఛ లేనట్టు అందులో చిత్రించింది. ఈ కార్టూన్ అమెరికాతో సంబంధాలకు హానికరమంటూ ఆనంద వికటన్ వెబ్‌సైట్‌ను అమాతం నిలిపేసింది కేంద్రం. ఎందుకంటే మెటా వంటి ప్లాట్‌ఫాంల నిర్వాహకులు కేంద్రం ఆదేశాలు చాలా వరకూ అమలు చేస్తుంటారు. దీనిపై ఆ పత్రిక న్యాయ పోరాటం చేసింది. ఆ కార్టూన్ తప్పనుకుంటే అది తొలగించమని ఆదేశాలివ్వాలి గానీ ఇంత చరిత్ర గల తమ సంస్థ సైట్‌నే మూసేయడం ఏంటని ప్రశ్నించింది. దానిపై చివరకు మద్రాసు హైకోర్టు మోడీ కేరికేచర్ లేకుండా దాన్ని పున:ప్రారంభించుకోవచ్చని అనుమతినిచ్చింది.

ఆర్ణబ్ కేసే వేరు!

మొత్తంగా తమకు నచ్చని మీడియా, సోషల్ మీడియాలపై కేంద్రం రాష్ట్రాల పాలకులు వివిధ రకాలుగా సాగించే వేధింపులూ, ఆంక్షలపై అనేక ఉదాహరణలున్నాయి. అసలు యూట్యూబ్ కంటెంటును మొత్తంగా తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి కొన్ని చట్టాలు కూడా తీసుకొచ్చారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 69ఎ ఇందుకు సాధనంగా వుంది. దానిపై అభ్యంతరాలొచ్చాయి కూడా. అదే సమయంలో తమకు నచ్చినవారి పట్ల మాత్రం కేంద్రం ద్వంద్వ నీతిని పాటించడం పరిపాటి. ఆ జాబితాలో అగ్రగణ్యుడు ఆర్ణబ్ గోస్వామి. ఇంతకూ కేసేమిటంటే 2022లో రాజస్థాన్‌లోని అల్వాల్‌లో ఒక దేవాలయ విధ్వంసం జరిగిందంటూ రిపబ్లిక్ టీవీ హిందీ ఛానల్ కథనం ప్రసారం చేసింది. అప్పుడు అక్కడ కాంగ్రెస్ సర్కారుంది. ఈ కథనం ప్రసారం చేయడంతో ఆగక దానికి 'జహంగీర్‌పూర్‌కు ప్రతీకారమా?' అని ట్యాగ్ తగిలించింది రిపబ్లిక్ టీవీ. దానిపై కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా ఫిర్యాదు మేరకు ఎఫ్‌ఐఆర్ దాఖలైంది. ఈలోగా అక్కడ బిజెపి అధికారంలోకి వచ్చింది. ఢిల్లీలో జరిగిన ఘటనపై ఆరోపణల నేపథ్యంలో తాము ఈ ట్యాగ్ తగిలించామేగానీ వేరే దురుద్దేశం లేదనీ, తమ కథనం వల్ల ఎలాంటి గొడవలు జరగలేదని ఆర్ణబ్ సమర్థించుకున్నారు. రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఫర్జానంద్ అలీ ఈ వాదనలతో ఏకీభవిస్తూ పూర్తి కేసు తేలేవరకూ ఆర్ణబ్‌పై ఎలాంటి చర్య తీసుకోవద్దని తాజాగా ఆదేశించారు. ఇన్ని రోజుల్లో పోలీసులు ఏ సాక్ష్యాలు సేకరించారని ప్రశ్నించారు. కరోనా రోజుల్లోనే అనేక అవాస్తవాలు ప్రసారం చేసిన ఆయనను ఆదుకున్న తీరు చూశాం. హత్రాస్ ఘటన తర్వాత అక్కడకు వెళ్లిన కేరళ జర్నలిస్టు సిద్దిక్ కప్పన్‌ను మూడేళ్లపాటు జైలులో పెట్టిన కేంద్రం అప్పటి మహారాష్ట్ర ప్రభుత్వం ఆర్ణబ్‌ను అరెస్టు చేస్తే స్వయంగా హోంమంత్రిని రంగంలోకి దింపి విడుదలయ్యేందుకు కృషి చేసింది. ఈ కేసు మరోసారి ఆ సన్నివేశాన్ని కళ్ల ముందు నిలబెట్టడంలేదా? ఏమైనా మీడియా కథనాలు స్వేచ్ఛ, సభ్యత బూతులు, అసత్యాలు, విద్వేష ప్రచారాలు పార్టీలను వ్యక్తులను బట్టి కులమతాలను బట్టిగాక ప్రజాస్వామిక విలువలు, ప్రజా జీవిత ప్రమాణాలను బట్టి నడవాలని కోరుకోవాలి.

'పి 4'తో పేదరికం పోతుందా?

పేదరిక నిర్మూలన కోసమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ప్రకటించి వేల కోట్లు కేటాయిస్తున్నా అది ఎందుకు అంతం కావడంలేదు? పేదరిక నిర్మూలన అనేది దాతల సహాయంతో, ప్రభుత్వాల అరకొర పథకాలతో పరిష్కారమయ్యే సమస్య కాదన్నది జగమెరిగిన సత్యం. పేదరికం శాశ్వతంగా నిర్మూలించబడాలంటే ఈ వ్యవస్థను సమూలంగా మార్చడమే పరిష్కారం. ఈ వాస్తవాన్ని ప్రజలు గమనించకుండా మభ్యపెట్టేందుకు పాలకులు ఇలాంటి జిమ్మిక్కులు చేస్తుంటారు. అందులో చంద్రబాబు నాయుడు సిద్ధహస్తులు.



విశ్లేషణ

'పి4' విధానం ద్వారా రాష్ట్రంలోని పేదరికాన్ని (జీరో పావర్టీ) సమూలంగా నిర్మూలిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెబుతున్నారు. సమాజంలో ఉన్నత స్థితిలో వున్న 10 శాతం మంది, పేదరికంలో అట్టడుగున వున్న 20 శాతం పేదలను దత్తత తీసుకుంటే పేదరికం నిర్మూలించబడుతుందంటున్నారు. ఆయన చేసిన విజ్ఞప్తులకు స్పందించి దానధర్మాలు చేయడానికి సంపన్నులు క్యూలో సిద్ధంగా వున్నారట. అందుకని పేదలను గుర్తించే పని వేగంగా చేయాలని ఈ ఉగాది నుండే ఈ కార్యాన్ని ప్రారంభించాలని అధికార యంత్రాంగాన్ని చంద్రబాబు నాయుడు పరుగులు పెట్టిస్తునారు. పి4 విధానం ద్వారా పేదరికాన్ని నిర్మూలించి విజనరీ (దార్శానికుడుగా) నాయకుడుగా నిలువనున్నారని ఆయన అనుయాయులు, మీడియా అనుచరులు సంబరపడిపోతున్నారు. పేదరికాన్ని నిర్మూలించడం ఇంత తేలకైన వ్యవహారమా?

'పి4' అంటే ఏంటి?

'పి4' అంటే పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్. ప్రభుత్వం, ప్రైవేటు కంపెనీలు, ప్రజలు కలిసి భాగస్వామ్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చెబుతున్నారు. ఈయన 1995లో అమలు చేసిన ప్రపంచబ్యాంకు సంస్కరణల్లో భాగంగా 'పి3' పబ్లిక్, ప్రైవేటు, పార్టనర్‌షిప్ విధానాన్ని అమలు చేసి అద్భుతాలు సాధించానని ఆ స్ఫూర్తితో 'పి4' రూపొందించానంటున్నారు. ఈసారి ప్రజల భాగస్వామ్యం ఎందుకు చేరింది? కంపెనీలు పరిశ్రమలు పెట్టాలంటే భూసేకరణ చేయాలి. అందుకు చట్టబద్ధంగా పరిహారం ఇవ్వాలి, పునరావాసం, ఇతర సదుపాయాలు కల్పించాలి. ఇవి అమలు చేయడం కంపెనీల యజమానులకు ఇష్టం లేదు. భూ సేకరణ చట్టాన్ని మార్చాలని చాలా కాలంగా వారు ప్రభుత్వాలపై ఒత్తిడి తెస్తున్నారు. ఎన్నికల్లో తమకు అండగా నిలిచే యజమానులకు అదనపు లాభాలు రావాలంటే చట్టాన్ని సవరించాలి, సవరిస్తే భూమి కోల్పోయిన రైతులు నుండి వ్యతిరేకత వస్తుంది. ఈ పరిస్థితి నుండి బాధిత రైతులను, ప్రజలను మభ్యపెట్టేందుకు కనుక్కున్నదే ఈ పి4 విధానం. ప్రభుత్వ భూ సేకరణలో ఆస్తులు కోల్పోయిన వారిని కంపెనీల్లో భాగస్వాములుగా చేర్చుకుంటే ఎలాంటి పరిహారం, పునరావాసం కల్పించాల్సిన అవసరం వుండదు. ఒకే బోనులో పులి, మేక వుంటే ఏం జరుగుతుందో వేల కోట్ల రూపాయల పెట్టుబడి వున్న యజమానులతో, తమకున్న కొద్దిపాటి ఆస్తి కోల్పోయిన పేదలు భాగస్వాములుగా మారితే అదే జరుగుతుంది. ఇప్పటికే సోలార్ ఎనర్జీ పేరుతో లక్షల ఎకరాల భూమిని అదాని, అంబానీ, టాటా లాంటి పెద్ద కంపెనీలకు ప్రభుత్వమే రైతుల నుండి కౌలు పేరుతో అప్పగిస్తుంది. ఎకరం భూమి సంవత్సరానికి రూ.30,000 కౌలు ఇచ్చేటట్లు ఒప్పందాలు చేయిస్తుంది. ఈ కంపెనీలు ఆ భూమిని బ్యాంకులో తాకట్టు పెట్టి తీసుకున్న రుణాన్ని చెల్లించకపోయినా, రైతుకు సకాలంలో లీజు చెల్లించకపోయినా ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందో లేదో స్పష్టం చేయడంలేదు. కంపెనీ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే న్యాయస్థానం ద్వారా రైతు రక్షణ పొందవచ్చు అని ప్రభుత్వ నేతలు సూక్తులు వల్లిస్తున్నారు. ఆస్తి కోల్పోయిన వారు కోర్టుకు వెళ్లడం, న్యాయాన్ని పొందడం ఎంత వరకు సాధ్యం?

పేదలను కోత కోయడం

2047 వికసిత ఆంధ్రప్రదేశ్ విజనరీలో భాగంగా ముఖ్యమంత్రి ఈ 'పి4' కు మరో కొత్త భాష్యం చెబుతున్నారు. పబ్లిక్, ప్రజలు, దాతలు (ఫిలాంత్రఫిక్), పార్టనర్‌షిప్ అంటున్నారు. అట్టడుగునున్న 20 శాతం పేదలను, అత్యున్నతంగా వున్న 10 శాతం సంపన్నులు దాతృత్వం ద్వారా ఆదుకుంటారట! దీనిద్వారా 2023 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేస్తారట! మొదట రాష్ట్రంలో 4 గ్రామాల్లో పి 4 విధానాన్ని 5,869 కుటుంబాలకు పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తారు. దాతల సహాయంతో పేదరికాన్ని నిర్మూలించే ఈ విధానాన్ని రానున్న ఉగాది నుండి రాష్ట్రమంతటా అమలు చేస్తారు. ఇందుకోసం ఇంటింటి సర్వే ద్వారా అర్హులను గుర్తించే పని చేస్తున్నారు. మొదటి దశ కింద 10 జిల్లాల్లో ఫిబ్రవరి 20 నుంచి సర్వే జరుగుతుంది. రెండవ దశలో మిగిలిన 16 జిల్లాల్లో మార్చి 8 నుంచి సర్వే ప్రారంభమవుతుంది. మొదటి దశ కింద 52 లక్షల కుటుంబాలు, రెండవ దశ కింద 76 లక్షల కుటుంబాలను సర్వే చేస్తారు. 27 ప్రశ్నలతో ఉన్న ఈ సర్వే పత్రంలో 2 ఎకరాల మాగాణి లేదా ఐదు ఎకరాల మెట్ట భూమి, 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వాడుతున్నవారిని, మున్సిపల్ ఏరియాలో సొంత ఆస్తి వున్నవారిని, నాలుగు చక్రాల వాహనం వున్నవారిని, కుటుంబ సభ్యుల్లో ఎవరైనా ఆదాయపన్ను చెల్లిస్తున్నవారిని, ఇంటి స్వభావాన్ని బట్టి, వారు వాడుతున్న గ్యాస్ వినియోగాన్ని బట్టి ఈ సర్వే నుండి మినహాయిస్తారు. అంటే వారంతా పేదలు కాకుండా పోతారు. ఇలా అన్ని రకాల మినహాయింపుల తర్వాత మిగిలాల్సిన కుటుంబాలు 40 లక్షలట! సర్వే చేయకుండానే కుటుంబాల సంఖ్య తేల్చేశారు. దీని ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం రేషన్ పొందుతున్న పేదలు ఒక కోటి 48 లక్షలమంది వున్నారు. ఇందులో కోటి ఎనిమిది లక్షల మంది ఈ సర్వే నుండి మినహాయించబడతారు. సర్వే పేరుతో కోటి మందిని పేదరికం నుండి నిర్మూలించేస్తారు. మిగిలిన 40 లక్షల మందిని 'సమృద్ధి బంధనమ్' అనే ప్లాట్‌ఫాంలో చేరుస్తారు. రాష్ట్రం, దేశం, విదేశాల్లో వున్న సంపన్న దాతలు ఈ పేదలను ఎంచుకుని వారికి దానధర్మాలు చేసి వారి దాతృత్వాన్ని చాటుకుని పేదరికం నుండి విముక్తులను చేస్తారు. ఇందులో ప్రభుత్వం పాత్ర మ్యాచింగ్, ఎనర్జింగ్, ట్రాకింగ్‌కే పరిమితం అవుతుందని, అంతకు మించి ఎలాంటి ఆర్థిక వ్యవహారాల్లో తలదూర్చదని పాలకులు చెబుతున్నారు.

దానధర్మాలతో పేదరికం అంతం కాదు

దాతల దాతృత్వ విధానం కొత్తదేమీ కాదు. రాజుల కాలం నుండి ఇలాంటి దానధర్మాల సిద్ధాంతం వుంది. కొందరి దగ్గర సంపద పోగుబడడం, అత్యధికమంది పేదరికంలో మగ్గడం పెట్టుబడిదారీ వ్యవస్థ వున్నంత కాలం కనిపించే శాశ్వత సమస్య. ఈ అసమానతలు తగ్గించేందుకు రాజ్యం సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందించాలని కీన్స్ లాంటి ఆర్థికవేత్తలు చెప్పారు. తాము పోగేసుకున్న కోట్ల సంపదలో అప్పుడప్పుడు తృణమో, ఫణమో విదల్చి కీర్తిప్రతిష్టలు పోగేసుకుంటున్న కార్పొరేట్ యజమానులు వున్నారు. యజమానులు సంపాదించుకున్న సొమ్ము నుండి కార్మికులకు దానధర్మాలు చేయాలనే మహాత్మా గాంధీ ధర్మకతృత్వ సిద్ధాంతం, భూస్వాముల నుండి భూదానం పొంది పేదలకు పంచిపెడతానని 1951 ఏప్రిల్ 18న తెలంగాణలో పోచంపల్లిలో వినోభా బావే ప్రారంభించిన భూదానోద్యమం ఏమైందో చూస్తున్నాము. పేదరిక నిర్మూలన కోసమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ప్రకటించి వేల కోట్లు కేటాయిస్తున్నా అది ఎందుకు అంతం కావడంలేదు? పేదరిక నిర్మూలన అనేది దాతల సహాయంతో, ప్రభుత్వాల అరకొర పథకాలతో పరిష్కారమయ్యే సమస్య కాదన్నది జగమెరిగిన సత్యం. పేదరికం శాశ్వతంగా నిర్మూలించబడాలంటే ఈ వ్యవస్థను సమూలంగా మార్చడమే పరిష్కారం. ఈ వాస్తవాన్ని ప్రజలు గమనించకుండా మభ్యపెట్టేందుకు పాలకులు ఇలాంటి జిమ్మిక్కులు చేస్తుంటారు. అందులో చంద్రబాబు నాయుడు సిద్ధహస్తులు.

రాష్ట్రంలో పేదరికం

ఇటీవల అసెంబ్లీలో ఆర్థికమంత్రి ప్రవేశపెట్టిన 2024-25 రాష్ట్ర సామాజిక, ఆర్థిక సర్వే రిపోర్టు ప్రకారం దేశంలో మన రాష్ట్రం ఎనిమిదో అతి పెద్ద రాష్ట్రం. కానీ పేదరికంలో తొమ్మిదో స్థానంలో వున్నాం. పౌష్టికాహారంలో పదవ, శిశు మరణాలలో పదకొండవ, పాఠశాలలో వుండాల్సిన పిల్లల్లో 25వ, తాగునీటి సమస్యలో 18వ స్థానాల్లో వున్నాం. గిరిజనులు ఎక్కువగా వున్న విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు, వ్యవసాయం మీద ఆధారపడిన కర్నూలు, ప్రకాశం, అనంతపురం లాంటి జిల్లాలు అత్యధిక పేదరికంలో వున్నాయని ఈ రిపోర్టు తేల్చింది. పెరుగుతున్న నిరుద్యోగం, వ్యవసాయంలో ఉపాధి తగ్గిపోవడం, భూమి, ఇల్లు, మంచినీరు, విద్య, వైద్యం, విద్యుత్ లాంటివి అత్యధిక మందికి లేకపోవడం పేదరికానికి కారణాలు. వీటిని దాతలు ఎలా పరిష్కరిస్తారు? ఒకవైపు జాతీయ, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలు తీవ్ర సమస్యల్లో కూరుకుపోతుంటే సంపన్నులు దానాలు ఎందుకు చేస్తారు? డాలర్లు సంపాదిద్దామని వెళ్లిన వారిలో కొందరు సంకెళ్ళతో తిరిగి వస్తుంటే, మరికొందరు ఆందోళనలతో గడుపుతుంటే ఈ నెల 12న సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి దాతలకు 'పి4' విధానం గురించి బహిరంగ లేఖ రాశారు. 1995లో తాను చేపట్టిన సంస్కరణల వల్లే రాష్ట్రంలో ఉపాధి పెరిగి, సంపద సృష్టి జరిగి, సామాన్య రైతు కుటుంబం నుండి వచ్చిన వారు ఉన్నత స్థానాలకు చేరారని, గ్లోబల్ సిటిజన్ల నుండి గ్లోబల్ లీడర్లుగా ఎదిగారని ఆ లేఖలో చెప్పుకున్నారు. తాజాగా పది సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 విజన్‌ను అమలు చేసి తెలుగుజాతిని ప్రపంచంలో నెంబర్1 చేసేందుకు మీ సహాయం కావాలని దాతలను కోరారు.

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కారణంగా చెబుతూ వచ్చిన ముఖ్యమంత్రి ఇప్పుడు పేదల దత్తత అందుకున్నారు. గతంలో జన్మభూమి పేరుతో గ్రామాల దత్తత, ఇప్పుడు పేదల దత్తత సంక్షేమ పథకాల కోతలో భాగమే. గారడీ విద్యతో కొంత కాలం భ్రమలు కలిగించవచ్చు గానీ, వాస్తవాలను ఎల్లకాలం కప్పి వుంచలేరు. / **వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/**



వి. రాంభూపాల్

గుడ్డు..వెరీ బ్యాడ్...!



- అంగన్‌వాడీ, పాఠశాలలకు నాసిరకం సరఫరా
- గుడ్డుపై సీలు మాయం
- చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంతో చెలగాటం
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పెనుకొండ (సత్యసాయి జిల్లా)

ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశాయి. పిల్లలు విద్యతో పాటు, ఆరోగ్యకర వాతవరణం కోసం ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, పాఠశాలల్లో విద్యార్థులకు బలవర్ధక ఆహారం అందించేందుకు కోడిగుడ్లను సరఫరా చేస్తోంది. కోడిగుడ్లను సరఫరా చేసే బాధ్యత ప్రయివేటు ఏజెన్సీలకు ప్రభుత్వం అప్పగించింది. వీరు కోడిగుడ్ల సరఫరాలో నిబంధనలకు తిలోదకాలు వదులుతున్నారు.

ప్రతి నెల 5 లక్షల కోడిగుడ్లు సరఫరా..

పెనుకొండ నియోజకవర్గం వ్యాప్తంగా అంగన్‌వాడీ, పాఠశాలకు ప్రతి నెలా 5 లక్షల కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారు. పెనుకొండ మండలంలో ప్రతినెలా 1,02,825, గోరంట్ల 1,32,500, సోమందేపల్లి, రొద్దం, పరిగి మండలాకు 2,64,675 కోడిగుడ్లను అందించాలి.

నిబంధనలకు నీళ్లు

ప్రతినెలా నాలుగు సార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు కోడిగుడ్లు సరఫరాచేయాలి. రవాణాదారులు నెలకు రెండుసార్లు లేదా మొత్తం ఒకేసారే అందిస్తున్నారు. రవాణ బిల్లు మాత్రం నాలుగుమార్లు సరఫరా చేసినట్లు బిల్లు మంజూరు చేసుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి వారం ఒక రంగు కోడి గుడ్లపై మార్కు వేయాలి. నీలం, ఎరుపు, ఆకు పచ్చ, పర్పల్ రంగులు కోడి గుడ్లపై మార్కు వేయాల్సి ఉంది. ఒక వారం వేసిన రంగు, మరో వారం వేయరు. నిబంధనలకు విరుద్ధంగా కోడిగడ్లపై ఎలాంటి రంగులువేయడం లేదు. దీంతో కోడి గుడ్లు పక్కదారిపట్టే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అంగన్‌వాడీల్లో బాలింతలు, గర్భిణీలకు, చిన్నారులకు రోజుకు ఒకటి చొప్పున ఇవ్వాలి. ఒక వారం ఒక రంగ ఉన్న కోడిగుడ్లు సరఫరా చేస్తే మరో వారం వేరే రంగు ఉన్న ముద్రులున్న కోడి గుడ్లు సరఫరా చేయాలి. గుత్తేదారులు మాత్రం రంగులు వేయడం లేదు.

తక్కువ పరిణామంతో కోడిగుడ్లు

కాంట్రాక్టర్లు నాణ్యతలేని చిన్న సైజు కోడిగుడ్లను సరఫరా చేస్తున్నట్లు విమర్శలున్నాయి. అంగన్‌వాడీల ద్వారా పంపిణీ చేసే కోడిగుడ్లు ఒక్కోటి 45గ్రాములు నుంచి 50 గ్రాముల బరువుండాలి. ఒక ట్రేలో ఉండాల్సిన 30కోడిగుడ్లు 1350 గ్రాముల నుంచి 1500 గ్రాములు బరువు ఉండాలి. సగటున ఒక్కో గుడ్డు 30 గ్రాములు ఉండగా ట్రే బరువు 1000గ్రాములు దాటడం లేదని ఆరోపణలున్నాయి. నాణ్యత లేని తక్కువ బరువు ఉన్న గుడ్లను పంపిణీ చేయడం ద్వారా కావాల్సిన స్థాయిలో పోషకాలు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కుళ్లిన గుడ్లు సరఫరా..

చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించి వారిని ఆరోగ్యవంతులు చేయడమే ప్రభుత్వం లక్ష్యం. గుత్తేదారులు, రవాణాదారులు కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేస్తూ వారి ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. మొన్న పెనుకొండ మండలంలో, నేడు గోరంట్ల మండలలో కుళ్లిన కోడిగుడ్లు సరఫరా చేసినట్లు సంబంధింత అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహకులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు.

విదేశీ కోకో గింజల దిగుమతులు ఆపాలి

- రైతుల వద్ద కొనుగోలు చేయాలి
- కోకో రైతుల సమావేశం డిమాండ్

ప్రజాశక్తి- పెదవేగి (ఏలూరు జిల్లా)

విదేశీ కోకో గింజల దిగుమతులను వెంటనే నిలుపుదల చేయాలని, రైతుల వద్ద నిల్వ ఉన్న కోకో గింజలను వెంటనే కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విజయరాయి, గాంధీనగర్ షిరిడి సాయి కల్యాణ మండపంలో కోకో రైతుల ప్రాంతీయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విదేశాల నుంచి కోకో గింజలు దిగుమతి చేసుకున్నందున, రైతుల నుంచి తగినంతగా కోకో గింజలు కొనుగోలు చేయలేమని కొన్ని కంపెనీలు రైతులను బెదిరించడం తగదన్నారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వకుండా కంపెనీలు రైతులను మోసగిస్తూ ఇబ్బందులు గురి చేయడం అన్యాయమని తెలిపారు. కిలో కోకో గింజలకు రూ.900 ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల ఆరున జరిగిన కోకో రైతు చలో ఏలూరు కార్యక్రమం సందర్భంగా కోకో రైతుల సమస్యలను జిల్లా కలెక్టర్‌కు వివరించామన్నారు. ఈ నెల పదో తేదీన ఉద్యాన శాఖ రాష్ట్ర కమిషనర్ దృష్టికి కోకో రైతుల కొనుగోలు సమస్య తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఉద్యాన శాఖ కమిషనర్ కార్యాలయం వద్దకు కోకో రైతులు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు జరుపుతామని, కోకో రైతుల కొనుగోలు సమస్య పరిష్కారమయ్యేవరకూ పోరాడతామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కంపెనీలు కోకో గింజలు కొనుగోలు చేసేలా, అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు బొల్లు రామకృష్ణ, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం ఉపాధ్యక్షులు మున్సంగి సుబ్బారెడ్డి, కొసరి సతీష్, గుడిబండి రమేష్‌రెడ్డి, ఎ.అనిల్‌కుమార్, కె.రామిరెడ్డి, కె.గోపాలరెడ్డి, పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్ట్ విడుదల

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల సీనియార్టీ వివరాలు విద్యా శాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు తెలిపారు. హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్స్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, పిఇటి ఉపాధ్యాయులు, లాంగ్వేజ్ పండిట్‌ల వెబ్‌సైట్‌లో ఉంచిన సీనియార్టీ జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే పరిశీలించుకోవాలని తెలిపారు. వారి అభ్యంతరాలపై సంబంధిత నమూనా ప్రొఫార్మాతో ఈ నెల 8, 9వ తేదీల్లో కార్యాలయపు పని వేళలల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

నిరుపయోగంగా
కియోస్క్ యంత్రాలు

- లక్షలాది రూపాయల ప్రజాధనం వృధా
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- గుడిపాల:

రైతు సేవాకేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయల వ్యయంతో ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన యంత్రాలు సేవలు అందించకుండా మూలకు చేరాయి. రైతులకు మెరుగైన సేవలందించాలనే ఉద్దేశంతో రైతుసేవా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఈ యంత్రం పనిచేయాలంటే ఇంటర్నెట్ సౌకర్యం ఉండాలి. గత ప్రభుత్వం యంత్రాలిచ్చిందే తప్ప ఇంటర్నెట్ సౌకర్యం కల్పించలేదు. దీంతో సిబ్బందే సొంత నిధులతో ఈ సదుపాయం ఏర్పాటు చేసుకుని సేవలందించారు. తర్వాత ఫోన్‌లోనే అందుకు సంబంధించిన యాప్ ఉండటంతో యంత్రాలను పట్టించుకోలేదు. ఫలితంగా రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మూలనపడ్డాయి.

గుడిపాల మండలంలో 17 రైతు సేవా కేంద్రాలల్లోని కియోస్క్ యంత్రాలు అన్ని మరమ్మతులకు గురై మూలన పడేశారు. తొలి ఏడాదిలో సిబ్బంది సొంత డబ్బులతో ఇంటర్నెట్ రీఛార్జి చేసి వినియోగించారు. వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందితో సంబంధం లేకుండా రైతులే స్వయంగా కేంద్రానికి వెళ్లి, వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యంత్రాలు, పశుగ్రాసం వంటివి అవసరమైన పరిమాణంలో కియోస్క్ యంత్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చు. ఇందుకు అవసరమైన నగదు రైతు చెల్లిస్తే 48 గంటల్లో అందిస్తామని ప్రకటించారు. ఆచరణలో సక్రమంగా అమలు చేయకపోవడంతో యంత్రాలు మూలనపడ్డాయి. యంత్రాలకు ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు, బ్యాటరీలు పనిచేయకపోవడంతో అధికారులు, సిబ్బంది వీటిని గాలికి వదిలేశారు. దీంతో లక్షలాది రూపాయలు ప్రజాధనం వృధాగా పోయిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకొని వాటిని వినియోగంలోకి తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరుతున్నారు.

కలుషిత నీరు తాగి 32 జీవాలు మృతి



నార్పల : మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో కలుషిత నీరు తాగి గొరవ గంగప్పకు చెందిన 32 జీవాలు మృత్యువాత పడ్డాయి. బాధిత కాపరి తెలిపిన వివరాల మేరకు.. తనకున్న మేకలను ఉదయం మేతకు తీసుకెళ్లాడు. ఈనేపథ్యంలో మధ్యాహ్నం ఓ చేనులని 45 రోజుల జొన్నచొప్పను మేపారు. దీంతోపాటు అక్కడే డ్రిప్‌ల్లో మందు కలిపిన నీటిని తాపాడు. దీంతో విషం ఎక్కి దాదాపు 32 మేకలు మృతిచెందినట్లు వాపోయాడు. మరో 15 మేకలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. మృతిచెందిన గొర్రెలు, మేకల విలువ దాదాపు రూ.1.50లక్షలు ఉంటాయన్నారు. సమాచారం అందుకున్న వెటర్నరీ డాక్టర్ గోవిందారజు వచ్చి వైద్యం చేసినా ఫలితం దక్కకుండా పోయిందన్నారు. ప్రభుత్వ ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

రూ.1 ఫోన్ పే చేయించుకుని రూ.98 వేలు స్వాహా

- నారాయణపురంలో సైబర్ మోసం

ప్రజాశక్తి- ఉంగుటూరు (ఏలూరు జిల్లా)

నారాయణపురంలో మణి ఫుట్‌వేర్ కంగన్ హాల్ ఫ్యాన్సీ దుకాణం యజమానికి ఓ సైబర్ నేరస్తుడు టోకరా వేసి రూ.98 వేలు కాజేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి దుకాణ యజమాని నిడమోలు సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒక యువకుడు ఉదయం 10.35 గంటల సమయంలో వచ్చి పరీక్ష రాసే అట్టలు, పుస్తకాలు, పెన్నులు ఇతర వస్తువులను కొనుగోలు చేశాడు.. బిల్లు రూ.2,800 అయ్యింది. ఫోన్‌పే చేస్తానని నమ్మించి షాపు యజమానిని రూ.1 ఫోన్‌పే చేయమన్నాడు. సత్యనారాయణ తన ఫోన్‌పే నుంచి ఒక రూపాయి వేశారు. సైబర్ నేరస్తుడు షాపు ఓనరుది ఫోను తీసుకుని స్కాన్ చేసి సరుకులు తీస్తుండండి, ముందుకెళ్లొస్తానని బయటకు వెళ్లాడు. మరుక్షణంలోనే దుకాణం యజమాని బ్యాంకు ఖాతా నుండి రూ.98 వేలు డెబిట్ అయినట్లు ఫోన్‌కు మెసేజీ వచ్చింది. దీంతో, మోసపోయినట్లు తెలుసుకుని బాధితుడు వెంటనే పోలీసులకు, సైబర్ డిపార్ట్‌మెంట్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక సిసి కెమెరాల ద్వారా అగంతకుడి ఆనవాళ్లను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

విద్యార్థులకు ‘బ్రాండ్ ప్రమోషన్’ కీలకం

- హిమాలయ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు

ప్రజాశక్తి అనంతపురం

విద్యార్థులకు బ్రాండ్ ప్రమోషన్ అనేది చాలా కీలకమని హిమాలయ యూనివర్శిటీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు అన్నారు. శనివారం స్థానిక అనంత లక్ష్మి కళాశాలలో మూడు రోజులపాలు నిర్వహించనున్న బ్రాండ్ ప్రమోషన్ కార్యక్రమాన్ని ఛైర్మన్ అనంత రాముడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాండ్ ప్రమోషన్ మార్కెటింగ్‌లో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఎవరైరా భవిష్యత్తులో వ్యాపార ప్రపంచంలో నిలదొక్కుకోవడానికి అవసరమైన అనుభవాన్ని సంపాదించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానంలో నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎన్.రామమూర్తి, వైస్ ఛైర్మన్ ఎం.రమేష్‌నాయుడు, కళాశాల నైపుణ్యాభివృద్ధి సంచాలకులు ఎం.సురేంద్రనాయుడు, ఎంబిఎ, ఎంసిఎ విభాగాధిపతి చక్రధర్ పాల్గొన్నారు.

ప్రకాష్‌రెడ్డీ.. నోటికి వచ్చినట్లు మాట్లాడొద్దు..

- ఎమ్మెల్యే పరిటాల సునీత



ప్రజాశక్తి-అనంతపురం రూరల్

‘తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డీ.. నోటికి వచ్చినట్టు మాట్లాడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి..’ అంటూ ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. శనివారం అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాలకు సంబంధించిన 53 మంది బాధితులకు రూ.52.65 లక్షలు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాలకు చెందిన 30 మందికి రూ.33.32లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు కష్టం ఉందంటే క్షణం కూడా ఆలోచించకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు సాయం చేస్తున్నారన్నారు. ఇటీవల రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు అడుగుతున్నారని.. దీనిపై సంబంధిత శాఖ మంత్రిని కలిశామని.. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు అందిస్తామన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల మీద తీవ్రంగా స్పందించారు. ‘నోరు ఉందని.. చేతిలో సెల్ ఫోన్ ఉందని ఏదిబడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదు..’ అని హెచ్చరించారు. గత ఐదేళ్లలో పేరూరు జలాశయంకు నీరందించే ప్రాజెక్టును అటకెక్కించారన్నారు. వర్షపు నీటితో నిండిన ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి వాటిని విరగగొట్టి మొత్తం నీటిని ఏటిపాలు చేసి నేడు నీతివ్యాఖ్యలు చెప్పడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా దినోత్సవం రోజున ఒక మహిళాగా చెబుతున్నానని.. పేరూరు ప్రాజెక్ట్ గేట్లు మరమ్మతులు చేయించి, ప్రాజెక్టుకు నీరందించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. పేదలకు ఇళ్లు నిర్మిస్తామని చెప్పి.. రాక్రీట్ సంస్థ పేరుతో దోపిడీ చేసింది నిజం కాదా..? అని నిలదీశారు. సొంతింటి కలతో ఉన్న పేదల్ని మోసం చేశారన్నారు. తాము ఇళ్లు లేని ప్రతి నిరుపేదకూ కచ్చితంగా ఇళ్లు ఇచ్చి తీరుతామని స్పష్టం చేశారు. నీ అవినీతి లెక్కలు కూడా త్వరలోనే తేలుతాయని హెచ్చరించారు.

ఏదైతే దిగువసంతకందారు అయిన మెస్సర్స్ చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అతనికి అందించబడిన అధికారాలను వినియోగించుకుంటూ సదరు నోటీసు రసీదు తేది నుండి 60 రోజులలోపల తదుపరి వడ్డీ మరియు పేర్కొన్న నోటీసులో వివరించబడిన మొత్తం తిరిగిచెల్లించుటకు రుణగ్రహీత (పేరులు మరియు చిరునామా దిగువ పేర్కొనబడినాయి) లను పిలుస్తూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న తేదిన డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తాన్ని తిరిగిచెల్లించుటలో విఫలమైనందున, ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద అతనికి అందించిన అధికారాలు అధ్యాయనం చేస్తూ ఇక్కడ క్రింద వివరించబడిన ఆస్తిని దిగువసంతకందారుడు స్వాధీనపరుచుకోవడమైంది. ప్రత్యేకంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను హెచ్చరించడమేమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారు ఇక్కడ క్రింద పేర్కొన్న మొత్తం మరియు దానిపిమ్మట వడ్డీ మెస్సర్స్. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క చార్జ్‌కు లోబడి జరుపవచ్చును.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.



తాతకు సాయం




ఒక ఊరిలో ముసలితాత ఉండేవాడు. అతనికి ఎవరూ లేరు. చేతి కర్ర సాయంతో ఇంటింటికి వెళ్లి అడుక్కొని తినేవాడు. ఒక రోజు సోని అనే 6వ తరగతి చదువుతున్న అమ్మాయి, తాతని చూసింది. తన ఇంటికి వచ్చినప్పుడల్లా తాతకి కడుపునిండా అన్నం పెట్టేది. అంతేకాక, రాత్రుళ్లు వాళ్ల ఇంటి అరుగు మీద పడుకోమని చెప్పింది. ప్రతిరోజూ తాత పగలంతా ఊళ్లు తిరుగుతూ, రాత్రుళ్లు సోనీ ఇంటి వద్ద బస చేసేవాడు. తాత కోసం సోనీ ఎదురుచూసేది కూడా. రోజూ తాత సోనీకి మంచి మాటలు, కథలు చెప్పేవాడు.

సోని ప్రతిరోజూ బడికి వెళ్ళేది. స్కూల్లో తనకి మధ్యాహ్న భోజనంలో గుడ్డు పెట్టేవారు. తాతతో పరిచయం అయిన దగ్గర నుండి ఆ గుడ్డుని తినకుండా తాత కోసం తెచ్చేది. ఈ విషయాన్ని ప్రీతి చూస్తుంది. మాస్టారుకు చెపుతుంది. మాస్టారు సోనిని పిలిపించి 'గుడ్డు ఇంటికి ఎందుకు తీసుకెళ్తున్నావు' అని ప్రశ్నిస్తారు. సోని ఏడ్చుకుంటూ, తనకి తాత పరిచయం అయిన సంగతి, గుడ్డు అతనికి ఇస్తున్న విషయం చెప్పింది. 'అదంతా అబద్దమ'ని ప్రీతి అంది.

ఆ రోజు సాయంత్రం అందరూ కలిసి సోనీ ఇంటికి వెళ్లారు. కొంతసేపటికి తాత అక్కడికి వచ్చాడు. సోనీ తాతతో జరిగిన విషయం చెప్పింది. అప్పుడు తాత మాస్టారుతో సోనీ చెప్పిందంతా నిజమేనని చెప్పాడు. పెద్దలకు సాయం చేయాలన్న ఆలోచన వచ్చినందుకు, సోనీని మాస్టారు ఎంతో అభినందించారు. ప్రీతి కూడా సోనీని అనుమానించానని బాధపడింది. ప్రధానోపాధ్యాయులు సోనిని మెచ్చుకొని మంచి బహుమతి అందిస్తారు.

- నరాల ప్రసన్న,
6వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బక్రిచెప్యాల, సిద్దిపేట.

దారి చూపండి



పిల్లలూ, ఫైర్ ఇంజన్ వెళ్లి మంటలను ఆర్పాలి. మరి ఏ దారిలో వెళుతుంతో దారి చూపరూ!

నేను గీసిన బొమ్మ



టి.మాధురి,
6వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పోతారెడ్డిపేట, సిద్దిపేట.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

జానపద కళకు ఊపిరి పోస్తున్నారు..



ఆ ఊరంతా కళాకారులే. అది కడప జిల్లా మైదుకూరు సమీపంలోని పార్వతీ నగరం. కళలే నమ్ముకుని అక్కడ వందలమంది జీవనం సాగిస్తున్నారు. ఈ ఊరి రూపకర్త కొండపల్లి వీరభద్రయ్య. ఈయన పూర్వీకులు తెలంగాణలోని మహబూబ్ నగర్ జిల్లా గత్వా అంతారం నుంచి తుంగభద్ర, కృష్ణ నదులను దాటి ప్రస్తుత నంద్యాల జిల్లా దీబగుంట గ్రామానికి సంచారం చేస్తూ వలస వచ్చారు. కళాకారుల కుటుంబంలో జన్మించిన వీరభద్రయ్య చిన్నతనం నుంచి యక్షగానంలో అందెవేసిన చేయి. భాగవతార్ బిరుదు అందుకున్న ఆయన రాష్ట్రం నలుమూలల తిరుగుతూ భూమి కొనుగోలు చేసి ఊరు నిర్మించాలని ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఎంతోమంది అవమానించినా, ఆయన వెనుదిరగలేదు. ఎట్టకేలకు కడప జిల్లాలో ఊరి నిర్మాణం చేపట్టి, తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్నాడు.



ఈ ఊళ్లో ఉన్న జనాభాలో ఇప్పటికీ ముప్పాతిక శాతం మంది కళల పైనే ఆధారపడి జీవిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అవకాశం ఉన్నన్ని రోజులూ ఊరూరా ప్రదర్శనలిచ్చి, తరువాత పార్వతీ నగరం చేరుకుంటారు. వీరు సాంప్రదాయ జానపద కళాకారులైనప్పటికీ మారుతున్న కాలానికి అనుగుణంగా కళలను ప్రదర్శిస్తున్నారు. హార్మోని వాయించే సాంప్రదాయ కళాకారులు క్యాషియో, యమహా కంపెనీలకు చెందిన కీబోర్డు, రిథమ్ ప్యాడ్ అద్భుతంగా వాయిస్తూ, ప్రదర్శనలిస్తూ అందరి చేతా శభాష్ అనిపించుకుంటున్నారు.

వారి కుటుంబాల్లోని పిల్లలు ఉన్నత చదువులు చదివి పలు రంగాల్లో రాణిస్తున్నారు. గ్రామంలో కొందరు ఇంజనీరింగ్, మరికొందరు వైద్య విద్య అభ్యసిస్తున్నారు. ఇంజనీరింగ్ చదివి, బెంగళూరు, చెన్నై వంటి మహానగరాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డ వారు కూడా ఉన్నారు.

వీరభద్రయ్య పసిప్రాయం నుంచే యక్షగాన (పగటి వేషాలు, హరికథ, బుర్రకథ హార్మోనియం మృదంగం తబలా, డప్పు, డోలక్ క్యాషియో) కళలను తండ్రి నుంచి నేర్చుకున్నాడు. పదేళ్ల వయసు నుండే ప్రదర్శనలు ఇచ్చి, ఎందరో గొప్ప వ్యక్తుల మన్ననలను పొందారు. తండ్రి వారసత్వంగా 40 హరికథలను నేర్చుకొని 1965 కొండ సుంకేశల ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉత్తర గోగ్రహణం చేశారు. ఆంధ్ర, తెలంగాణ, మద్రాస్, కర్ణాటకలోని చిల్లగట్టు చింతామణి, చిక్కబల్లాపూర్ తదితర ప్రాంతాల్లో పదివేలకు పైగా కళా ప్రదర్శనలు ఇచ్చాడు. 25 ఏళ్ల వయసు వరకు నంద్యాల జిల్లా పొన్నాపురంలోనే గడిపాడు. కర్నూలు జిల్లాలో దసరా ఉత్సవాల్లో మాత్రమే హరికథలు చెప్పించేవారు. మిగతా రోజుల్లో ఖాళీగా ఉండాల్సి వచ్చేది. కడప జిల్లాలో అన్ని కాలాల్లోనూ హరికథ చెప్పించుకుంటారని తెలిసి, నంద్యాల జిల్లా నుంచి కడపకి వలస వచ్చారు.

ఆకాశవాణిలో..

1983లో హైదరాబాదు ఆకాశవాణి కేంద్రం హరికథ పోటీల్లో వీరభద్రయ్య ఉత్తీర్ణులయ్యారు. తరువాత కడప ఆకాశవాణి వేదికగా హరికథలు చెప్పాడు. అదే ఏడాది శ్రీ వాఘేశ్వరీ రాయలసీమ యక్షగానం హరికథ, బుర్రకథ కళాకారుల సంఘం ఏర్పాటు చేశాడు. 1988లో 15 ఇళ్ల నిర్మాణంతో ఊరు ప్రారంభమైంది. మొదట ఐదు కుటుంబాల వారు నివసించేవారు. రెండు కుటుంబాల వారు యక్షగానాల కోసం వెళ్తే మిగిలిన మూడు కుటుంబాల వారు ఊరు నిర్మాణ పనులను చూసుకునేవారు. 1990 నాటికి ఊర్లో కుటుంబాల సంఖ్య 40కి చేరింది. ఊరంతా పచ్చదనం ఉండేలా రకరకాల చెట్లు పెంచుతున్నారు. ఊర్లో ప్రత్యేకమైన మురుగు నీటి పారుదల లేదు. అయినా వర్షపు నీరు ఒక్క చుక్క కూడా నిల్వ ఉండదు.

ప్రస్తుతం ఊళ్లో 100 కళాకారుల కుటుంబాలు నివసిస్తున్నాయి. సాంకేతిక పరంగా అభివృద్ధి చెందుతున్న కాలంలో అంతరించిపోతున్న కళకు జీవం పోస్తున్న ఈ కళాకారుల్లో మోటే శ్రీనివాసులు మాటీవీలో రేలారే రేలారే కార్యక్రమంలో తన ప్రతిభ చూపారు. మరో కళాకారుడు నటరాజన్ 18 తబలాలను ఏకకాలంలో వాయించి గిన్నిస్ బుక్ రికార్డు సాధించాడు. ఊరి కళలు అంతరించిపోకుండా డాక్యుమెంటరీ తీసి సజీవం చేశారు. హైదరాబాద్ శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు పార్వతీ నగరం గురించి ఒక పుస్తకం వెలువరించటం మైదుకూరుకే గర్వకారణం..

- బొమ్మిశెట్టి రమేష్,
రచయిత, చరిత్ర పరిశోధకులు,
కడప జిల్లా, 98483 73736.

అంతర్జాతీయ రికార్డే లక్ష్యం!



వీరభద్రయ్య సంతానంలో మూడవ వాడిని. చిన్నతనం నుంచి కళలంటే అమితమైన ప్రీతి. హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీలో 2000 నుంచి 2002లో ఎం.ఎ సంగీతం మృదంగం సబ్జెక్టుగా తీసుకొని పూర్తి చేశాను. 2002లో తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్నమాచార్య ప్రాజెక్టులో ఔట్సోర్సింగ్‌లో మృదంగ కళాకారునిగా చేరి ఇప్పటికీ పనిచేస్తున్నాను. హైదరాబాదులోని రవీంద్ర భారతి, త్యాగరాజగాన సభ, హరిహర కళాభవనాలలో పెద్ద, పెద్ద కచేరీల్లో సహకార మృదంగం వాయిస్తున్నాను. ప్రస్తుతం పిల్లల చదువు రీత్యా, నా మృదంగ లక్ష్యాల కోసం హైదరాబాదులో ఉంటున్నాను. 2021 సెప్టెంబర్ 17న రవీంద్ర భారతిలో అష్టాదశ తబలానవరాగ తరంగిణి అనే కార్యక్రమం రూపకల్పన చేశాను. ఆ కార్యక్రమంలో 18 తబలాలపై శాస్త్రీయ కృతులను పలికించి అందరూ పార్వతీ నగర్ వైపు చూసేలా చేశాను. భవిష్యత్తులో అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శన చేసి అంతర్జాతీయ రికార్డులు సాధించాలన్నదే నా లక్ష్యం.

- కొండపల్లి నటరాజు,
ఇండియన్ బుక్ రికార్డ్ గ్రహీత.

కళలే మా జీవనాధారం



రెండు తెలుగు రాష్ట్రాల్లో మా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. నా బృందంలో ఏడుగురు సభ్యులు ఉన్నారు. వివిధ ప్రదర్శనలతో ప్రజలను ఆనందింపజేస్తూ, కళలను బతికిస్తున్నాం. ప్రతి నెలలో సరాసరి పది ప్రోగ్రామ్స్ వస్తాయి. ప్రతి ప్రోగ్రాంకు రూ.60 వేల వరకూ ఆర్జిస్తున్నాం. వచ్చిన డబ్బు సమానంగా పంచుకుంటాం. అన్ని ఖర్చులూ పోను ఒక్కొక్క సభ్యునికి సుమారు రూ.3000 వస్తుంది. నేను పార్వతీనగర్‌కు చెందిన మిరియాల రవికుమార్ గురువు దగ్గర కళలను నేర్చుకున్నాను. ప్రతి ప్రోగ్రాంకు వారి కుటుంబానికి కొంతమొత్తం అందిస్తాము. క్రమశిక్షణకు మారుపేరైన కొండపల్లి వీరభద్రయ్య సాక్షిగా పార్వతి నగర్ ఊర్లో ఉన్నా, ప్రోగ్రామ్స్ చేయటానికి వెళ్ళినా మద్యం, ధూమపానం చేయం. మేమే కాదు, మా ఊళ్లో ఎవ్వరూ మద్యపానం, ధూమపానం చేయరు.

- యడవల్లి మురళీ కృష్ణ,
ప్రోగ్రాం ఆర్గనైజర్

కళలను నేర్చుకోమని ప్రోత్సహిస్తున్నాం



మన సంస్కృతిని చాటే జానపద కళలను నేర్చుకోమని భావితరాల వారిని ప్రోత్సహిస్తున్నాం. శిక్షణ ఇస్తూ అదనంగా సంపాదించుకోవచ్చు అని మా విద్యార్థులకు చెబుతుంటా. కళలను నేర్చుకుని కలలను సాకారం చేసుకోవడం కళాకారులకు మాత్రమే ఉన్న అవకాశం. ఆ దిశగా అడుగులు వేస్తున్న మేము, ఎంతో ధన్యులం.

- కొండపల్లి ఉమాకాంత్,
రాయలసీమ జానపద కళాకారుల సంఘం సెక్రటరీ

'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' ఫస్ట్ లుక్



నందమూరి కళ్యాణ్ రామ్ నటిస్తున్న తాజా చిత్రం టైటిల్ వచ్చేసింది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు భారీ స్థాయిలో నిర్మిస్తునారు. మహిళా దినోత్సవం సందర్భంగా, శనివారం ఈ చిత్ర టైటిల్ 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి'గా రివిల్ చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని చిత్రబృందం విడుదలచేసింది. సాయి మంజ్రేకర్ ఈ చిత్రంలో హీరోయిన్. సోహైల్ ఖాన్ విలన్ పాత్రలో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ రామ్ ప్రసాద్ అందించగా, అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూర్చారు. తమ్మిరాజు ఎడిటర్. స్క్రీన్‌ప్లేను శ్రీకాంత్ విస్సా రాశారు. సినిమా ఇప్పటికే టాకీ పార్ట్ పూర్తి చేసుకుంది. మిగిలిన భాగం పూర్తయ్యాక, రిలీజ్ డేట్‌ని ప్రకటిస్తారని తెలుస్తోంది.

సరికొత్త కథతో తీశాం : అఫ్జల్




'మా సినిమా సరికొత్త కథతో తెరకెక్కింది. అన్ని నాణ్యతా ప్రమాణాలను పాటించి వాస్తవికతకు దగ్గరగా ఈ సినిమాను తీశాం. క్లాస్, మాస్ ప్రేక్షకులు మెచ్చుకునేలా మా చిత్రం ఉంటుంది. యువత ఈ సినిమాతో బాగా ఎంజాయ్‌చేస్తారని నేను నమ్ముతున్నా. కామెడీని కూడా బాగా పండించాం. సస్పెన్స్ థ్రిల్లర్‌గా కూడా ఉంటుంది. అందువల్ల మా సినిమాను ఆదరించాల్సిందిగా కోరుతున్నా' అని దర్శకుడు షేక్ అఫ్జల్ అన్నారు. సూపర్‌హిట్ మూవీ మేకర్స్ పతాకంపై షారుఖ్ నిర్మాణంలో అమిత్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం '1000 వాలా'. షారుఖ్, నవిత, కీర్తి, సుమన్, పిల్లా ప్రసాద్, ముఖ్తార్‌ఖాన్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈనెల 14న ఈ సినిమా విడుదల కానుంది.



నటుడిని కాకపోయుంటే..

'నటుడిని కాకపోయి ఉంటే పాలిటిక్స్‌లోకి వెళ్లేవాడిన'ని కిరణ్ అబ్బవరం అంటున్నారు. కిరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'దిల్ రుబా'. ఈ సినిమాకి విశ్వ కరుణ్ దర్శకత్వం వహిస్తున్నారు. రవి, జోజో, జోస్, రాకేష్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రుక్సర్ ధిల్లాన్ కథానాయికగా నటిస్తున్నారు. మార్చి 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌కి సంబంధించి వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటున్న కిరణ్ తాజా ఇంటర్వ్యూలో మాట్లాడారు. సినిమాలకు రాకముందు జీవితంలో ఏదోఒకటి సాధించాలనే కోరిక బలంగా ఉండేది. అందులో భాగంగానే హీరో అవ్వాలి అనుకున్నాను. అయితే నాకు రాజకీయాలు అంటే చాలా ఇష్టం. రాయాలసీమకి చెందిన వ్యక్తిగా రాజకీయాలను చిన్ననాటి నుంచి దగ్గరిగా చూశాను. ఒకవేళ నేను సినిమా హీరో కాకపోయి ఉంటే కచ్చితంగా రాజకీయాల్లోకి వెళ్లేవాడిని. మంచి చెడుని పక్కనపెట్టి ప్రజలతో కలవడం నాకు ఇష్టం. దాని వల్లనే నాకు రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. అలాగే భవిష్యత్తులో నేను వ్యాపార రంగంలో కూడా అడుగు పెట్టాలని ప్లాన్ చేస్తున్నాను. ప్రత్యేకంగా, రాయలసీమ స్టైల్‌లోని ఆహారాన్ని అందరికీ అందించాలని కోరుకుంటున్నా. దానికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నాను, త్వరలోనే దాన్ని ప్రకటిస్తాను' అని కిరణ్ అబ్బవరం తెలిపారు.



సోనాక్షి సిన్హా 'జటాధర'

బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా, టాలీవుడ్ ఎంట్రీకి రంగం సిద్ధమైంది. సుధీర్‌బాబు హీరోగా నటిస్తోన్న 'జటాధర' సినిమాతో నటిగా ఆమె తెలుగులోకి అడుగుపెడుతున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం శనివారం స్పెషల్ పోస్టర్ విడుదల చేసింది. పాన్ ఇండియా మూవీగా ఈ చిత్రం సిద్ధమవుతోంది. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమవుతోంది. 'శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతిని పొందుతారు' అని గతంలో ఈ ప్రాజెక్ట్‌ను ఉద్దేశించి సుధీర్ బాబు చెప్పారు.

14న కోర్టు చిత్రం విడుదల



కథానాయకుడు నాని నిర్మాతగా వ్యవహరిస్తున్న సినిమా 'కోర్ట్ : స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. ప్రియదర్శి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోంది. హర్ష్‌రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. శివాజీ, సాయికుమార్, హర్షవర్ధన్, రోహిణి తదితరులు ముఖ్యపాత్రల్లో నటించారు. రామ్ జగదీష్ దర్శకుడు. ఈనెల 14న ఈ సినిమా విడుదల కానుంది. శుక్రవారంనాడు ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. నాని, నాగ్‌అశ్విన్, శివాజీ, నటీనటులు తదితరులు హాజరయ్యారు. నాని సమర్పణలో ప్రశాంత్ తిపిర్నేని నిర్మాత. చట్టంలోని కొన్ని లొసుగుల్ని ఆధారంగా చేసుకొని అమాయకుల్ని న్యాయస్థానంలో దోషులు కొంతమంది నిలబెడుతున్నారు. కేసులూ, అందులోని సెక్షన్లు అర్థంకాక నిర్దోషులు సైతం శిక్షను అనుభవిస్తున్నారు. ఇలాంటి వ్యథలు ఎన్నో ఈ ట్రైలర్‌లో చూపించారు.

'23'
చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందా!

'మల్లేశం', '8 ఏఎమ్ మెట్రో' వంటి ప్రయోగాత్మక చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన దర్శకుడు రాజ్ రాచకొండ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం '23'. మన సమాజంలో చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందా! అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా రాబోతుంది. తేజ, తన్మయ, ఝాన్సీ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా నిర్మాణంలో ఈ సినిమా రూపొందు తోంది. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కాబోతుంది. శనివారం మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ మూవీ నుంచి చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో 1991లో జరిగిన చుండూరు మారణకాండ, 1993 చిలకలలూరిపేట బస్సు దహనం, 1997 హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన కార్ బాంబు దాడి ఘటనల ఆధారంగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తోంది.

ఛాంపియన్ ఎవరో..?

- నేడు భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య టైటిల్ పోరు
- మ. 2.30గం॥ల నుంచి



దుబాయ్: ప్రతిష్ఠాత్మక ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీని ఏ జట్టు కైవసం చేసుకోనుందో మరికొద్ది గంటల్లో తేలిపోనుంది. దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఆదివారం టైటిల్ సంగ్రామం జరగనుంది. లీగ్ దశలో అప్రతిహాత విజయాలతో ఫైనల్లో దూసుకొచ్చిన టీమిండియా.. ఆ క్రమంలోనే న్యూజిలాండ్‌పైనా విజయం సాధించింది. మరోవైపు న్యూజిలాండ్ జట్టు భారత్ చేతిలో ఓడినా.. లీగ్ దశలో రెండు మ్యాచుల్లో, సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై భారీ విజయాన్ని సొంతం చేసుకొని టైటిల్ పోరుకు సిద్ధమైంది. లీగ్ దశలో న్యూజిలాండ్‌ను చిత్తుచేసిన టీమిండియా అందుకు తగ్గట్లు వ్యూహాలు రచిస్తోంది. మెగాటోర్నీలో ఓటమి అన్నది ఎరుగకుండా అజేయంగా ఫైనల్లోకి దూసుకొచ్చిన రోహిత్‌సేన.. ఫైనల్లోనూ అదే ప్రదర్శనను కనబరిస్తే టైటిల్ కొట్టడం ఖాయం. ఐసిసి మెగా టోర్నీల్లో తమకు కొరకరాని కొయ్యగా మారిన కివీస్‌కు ఎలాగైనా ఈసారి చెక్ పెట్టాలని టీమిండియా ఆటగాళ్లంతా రెండ్రోజులు నెట్ ప్రాక్టీస్‌లో మునిగి తేలారు. బలబలాల పరంగా చూస్తే ఇరు జట్లు సమవుజ్జీలుగా కనిపిస్తున్నా.. ప్రస్తుతం టీమిండియా ఫామ్ చూస్తే బ్యాటింగ్, బౌలింగ్ పరంగా కివీస్ కంటే మెరుగ్గా ఉంది. బ్యాటింగ్‌లో కోహ్లి, శ్రేయాస్ అయ్యర్, రాహుల్, రోహిత్, గిల్, హార్దిక్ వీరిలో ఏ ఒక్కరు నిలదొక్కుకున్నా.. మ్యాచ్ స్వరూపం మారడం ఖాయం. ఇక బౌలింగ్‌లో వరుణ్ చక్రవర్తి, మహ్మద్ షమీ అద్భుత ఫామ్ మనకు కలిసి రానుంది. ఇక కివీస్ విషయానికొస్తే.. రచిన్ రవీంద్ర, విలియమ్సన్ సూపర్ ఫామ్‌లో ఉన్నారు. హెన్రీ గాయం జట్టును కలవరపెడుతోంది. 2002, 2013లో టైటిల్ విజేతగా నిలిచిన భారత్.. ముచ్చటగా మూడో ఛాంపియన్స్ ట్రోఫీపై కన్నేయగా.. 2000లో తొలిసారి టైటిల్‌ను చేజిక్కించుకున్న న్యూజిలాండ్ జట్టు రెండోసారి ఈ టైటిల్‌ను కైవసం చేసుకోవాలని ఉవ్విళ్లూరుతోంది. గత నెల 19న న్యూజిలాండ్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌తో ప్రారంభమైన 9వ ఛాంపియన్స్ ట్రోఫీ మార్చి 9న జరిగే మ్యాచ్‌తో ముగియనుంది.

రోహిత్‌కి కలిసిరాని టాస్

భారత్ కెప్టెన్ రోహిత్ శర్మకి మాత్రం ప్రస్తుతం టాస్ కలిసి రావట్లేదు. రోహిత్ వరుసగా గత 14 వన్డే మ్యాచ్‌లలో టాస్ గెలవలేక పోయాడు. 2023 నవంబర్ 19న అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్‌తో ప్రారంభమైన ఈ టాస్ పరాజయాల పరంపర ఇప్పటికీ కొనసాగుతోంది. అయితే భారత్ మాత్రం ఈ 14 మ్యాచ్‌లలో తొమ్మిది విజయాలు సాధించింది, నాలుగింటిలో ఓటమి పాలై.. ఒక మ్యాచ్ (శ్రీలంకతో)తో టై గా ముగిసింది. ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడిన నాలుగు మ్యాచుల్లోనూ టీమిండియా టాస్ ఓడినా.. అన్ని మ్యాచుల్లో విజయం సాధించడం విశేషం. దీంతో టాస్ భారత్ విజయావకాశాలపై ప్రభావం చూపించలేదన్నది వాస్తవం. ఈ మైదానంలో ఛేదనకు దిగే జట్టుకు విజయావకాశాలు మెండుగా ఉంటాయని సమాచారం.

జట్లు(అంచనా)...

భారత్: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, కోహ్లి, శ్రేయస్, హార్దిక్, కెఎల్ రాహుల్(వికెట్ కీపర్), అక్షర్, జడేజా, వరుణ్, కుల్దీప్, షమీ.

న్యూజిలాండ్: సాంట్నర్(కెప్టెన్), యంగ్, రవీంద్ర, విలియమ్సన్, మిచెల్, లాథమ్(వికెట్ కీపర్), ఫిలిప్స్, బ్రాస్‌వెల్, హెన్రీ, జెమీసన్, రూర్కే.

డిఫెండింగ్ ఛాంపియన్‌ను చిత్తుచేసినా.. యుపికి నిరాశే...
లీగ్ దశలోనే నిష్క్రమించిన వారియర్స్, బెంగళూరు



లక్నో: డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)ని యుపి జట్టు చేత్తు చేసినా.. లీగ్ దశలోను దాటలేకపోయింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే బెంగళూరు, యుపి జట్లు ప్లే-ఆఫ్ రేసునుంచి నిష్క్రమిం చగా.. ముంబయి, గుజరాత్ జట్లు ప్లే-ఆఫ్స్ బెర్త్‌లను ఖాయం చేసుకున్నాయి. బెంగళూరుతో శనివారం జరిగిన మ్యాచ్‌లో భారీ తేడాతో నెగ్గాల్సిన యుపి జట్టు కేవలం 12పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన యుపి మహిళలు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 225 పరుగుల భారీస్కోర్ నమోదు చేయగా.. అనంతరం బెంగళూరు జట్టు 19.3 ఓవర్లలో 213పరుగులకే ఆలౌటైంది. తొలుత యుపి ఓపెనర్లు హ్యారీస్, జార్జియా వాల్ కలిసి తొలి వికెట్‌కు 77పరుగులు జతచేశారు. ఆ తర్వాత హ్యారీ(39) ఔటైనా.. జార్జియా ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసింది. కేవలం 56బంతుల్లోనే 17ఫోర్లు, ఒక సిక్సర్‌తో 99పరుగులు చేసింది. మరోవైపు నవ్‌గైర్(46), హెన్రీ(19), ఎక్లేస్టోన్(13) ధాటిగా ఆడారు. దీంతో యుపి జట్టు నిర్ణీయాత్మక మ్యాచ్‌లో భారీస్కోర్ నమోదు చేసింది. బెంగళూరు బౌలర్లలో వారేహామ్‌కు రెండు, ఛార్లీ డీన్‌కు ఒక వికెట్ దక్కాయి. భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బెంగళూరు జట్టు చివర్లో స్నేహ్ రాణా(26; 6బంతుల్లో 2ఫోర్లు, 3సిక్సర్లు) ధనా ధన్ బ్యాటింగ్ తో రాణించి విజయంపై ఆశలు రేపినా.. కీలక సమయంలో ఔటవ్వడంతో బెంగళూరు విజయావకాశాలు నీరుగారాయి. యుపి బౌలర్లలో ఎక్లేస్టోన్, దీప్తి శర్మకు మూడేసి, హెన్రీకి రెండు వికెట్లు దక్కాయి.



సెమీస్‌లో ఓడిన ఆయుష్
ఓర్లీన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ

ఓర్లీన్: ఫ్రాన్స్ వేదికగా జరుగుతున్న ఓర్లీన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. సెమీస్‌కు చేరి ఆశలు రేపిన ఏకైక షట్లర్ ఆయుష్ శెట్టి శనివారం జరిగిన మ్యాచ్‌లో వరుససెట్లలో 2వ ర్యాంకర్ చెన్-యు-లిన్(చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలయ్యాడు. ఏక పక్షంగా సాగిన సెమీఫైనల్ పోటీలో ఆయుష్ 13-21, 15-21తో పరాజయాన్ని చవిచూశాడు.

ఇజ్రాయిల్ మహిళ సహా ఇద్దరిపై అత్యాచారం

బెంగుళూరు : కర్ణాటకలో ఇద్దరు మహిళలపై సామూహిక అత్యాచారం జరిగింది. ఈ ఘటన కొప్పాల్‌లో ఉన్న తుంగభద్ర కెనాల్ వద్ద గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి డిన్నర్ చేసి తుంగభద్ర లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ వద్ద విహారానికి వెళ్లిన సమయంలో బైక్‌పై వచ్చిన వ్యక్తులు పర్యాటక బృందంపై దాడి చేశారు. ఆ సమయంలో మహిళలతో కలిసి ఉన్న మరో ముగ్గురిని దాడికి పాల్పడినవారు కాలువలోకి తోసివేశారు. వీరిలో అమెరికాకు చెందిన డేనియల్, మహారాష్ట్ర పర్యాటకుడు పంకజ్ ప్రాణాలతో బయటకు వచ్చారు. ఒడిశాకు చెందిన బిబాష్ గల్లంతయ్యారు.

పర్యాటక బృందాన్ని పెట్రోల్ ఎక్కడ దొరుకుతుందని అడిగి.. ఆ తర్వాత డబ్బులు డిమాండ్ చేశారని హోమ్‌స్టే ఓనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించడంతో.. వాళ్లు పర్యాటకులపై దాడి చేశారని, మహిళలపై అత్యాచారం చేశారని తెలిపారు. నిందితులు బైక్‌పై పారిపోయినట్లు చెప్పారు. సామూహిక అత్యాచారానికి గురైన ఇద్దరు మహిళల్లో ఒకరు ఇజ్రాయిలీ మహిళ ఉన్నారని కొప్పాల్ ఎస్‌పి రామ్ అరసిద్ధి తెలిపారు. చికిత్స కోసం వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మహిళలు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నిందితులపై గ్యాంగ్ రేప్, దొంగతనం కేసు నమోదు చేశారు.



బిజెపితో కుమ్మక్కై పనిచేసే వాళ్లపై వేటు

- రాహుల్ సంచలన వ్యాఖ్యలు

అహ్మదాబాద్ : కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే బిజెపితో కుమ్మక్కై కలిసి పనిచేసే వారిపై వేటు తప్పదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. అహ్మదాబాద్‌లో ఆయన కాంగ్రెస్ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. 'గుజరాత్‌లో సగం మంది కాంగ్రెస్ నేతలు బిజెపితో చేతులు కలిపారు. బిజెపికి అనుకూలంగా ఉన్న ఎవరినీ వదిలిపెట్టేది లేదు. కాంగ్రెస్ పార్టీలో నేతలకు కొదవలేదు. తెలంగాణాలో అసాధ్యం అనుకున్నచోటే గెలిచి చూపించాం. అక్కడ 22 శాతం ఓట్లు పెరిగాయి. ఇక్కడ గుజరాత్‌లో కాంగ్రెస్‌కు 40 శాతం ఓటు బ్యాంక్ ఉంది. అయినప్పటికీ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ.. పార్టీ ప్రతిష్టను రోజురోజుకూ దిగజార్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. అందరూ పార్టీ లైన్‌లో ఉండి పనిచేయాల్సిందే. గీత దాటిన వారిపై వేటు వేయడానికి ఎంతో సమయం పట్టదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. వైఖరిని మార్చుకుని పార్టీకోసం పనిచేయాలి. పిసిసి నుంచి కిందిస్థాయి కార్యకర్త వరకు అందరూ పనిచేయాలి' అని ఆయన అన్నారు. ప్రజల పట్ల బాధ్యతతో ఉన్నప్పుడే అధికారంలోకి వస్తామని చెప్పారు.



పిల్లల వార్డులో ఎలుకలు

- మధ్యప్రదేశ్‌లోని ఆస్పత్రిలో ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- నెటిజన్ల ఆగ్రహం

భోపాల్ : ఆస్పత్రులు అంటేనే పరిశుభ్రమైన వాతావరణాన్ని కలిగి ఉండాలి. కానీ బీజేపీ పాలిత రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో ఆస్పత్రుల పరిస్థితులు మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. ఒక ఆస్పత్రిలోని పిల్లల వార్డులో రోగి బెడ్ వద్ద అనేక సంఖ్యలో ఎలుకలు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. దీనికి సంబంధించి ఒక వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో రాష్ట్రంలోని ఆస్పత్రుల పరిస్థితులపై ప్రజలు, నెటిజన్లు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో ఆస్పత్రి యాజమాన్యం, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనబడుతున్నదని ఆరోపిస్తున్నారు. సదరు ఆస్పత్రిలో పరిశుభ్రత, నిర్వహణపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఈ వీడియో విస్తృతంగా వైరల్ కావటంతో ఆస్పత్రి యాజమాన్యం తమ తప్పును ఒప్పుకున్నది. ఈ సమస్యను పరిష్కరించటం కోసం కఠినమైన ప్రయత్నాలను అమలు చేస్తామని వివరించింది. "మేము క్రమం తప్పకుండా పెస్ట్ కంట్రోల్‌ను నిర్వహిస్తాం. సమస్య మాత్రం అలాగే ఉంటే.. కఠిన చర్యలు తీసుకుంటాం" అని ఆస్పత్రి రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ్ ఉయ్కే అన్నారు. ఈ ఘటనపై స్పందించిన సీనియర్ జిల్లా అధికారి.. పిల్లల వార్డును సందర్శించారు. సదుపాయాలను మరింతగా పెంచుకోవాలని ఆస్పత్రి యాజమాన్యాన్ని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే, మధ్యప్రదేశ్ ప్రజారోగ్య ఇంజినీరింగ్ మంత్రి సంపతీయ ఉయ్కే స్పందించారు. ఆస్పత్రిని సందర్శించారు. ఘటనను నిర్లక్ష్యపు చర్యగా అభివర్ణించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీనియర్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్‌ను ఆదేశించారు.

కుకీ మహిళలపై లాఠీఛార్జి

- భద్రతా దళాల దాడిలో ఒకరు మృతి
- మణిపూర్‌లో బస్సు సర్వీసులను పలుచోట్ల అడ్డుకున్న నిరసనకారులు



ఇంఫాల్ : మహిళా దినోత్సవం రోజునే కుకీ మహిళలపై భద్రతా దళాలు విరుచుకుపడ్డాయి. పలుచోట్ల బాష్పవాయు గోళాలు ప్రయోగించడంతోపాటు లాఠీఛార్జి చేశారు. మణిపూర్‌లో అంతర్ జిల్లాల బస్సు సర్వీసులను పునరుద్ధరించిన నేపథ్యంలో భద్రతా బలగాలకు, కుకీ జో గ్రూపునకు మధ్య పలుచోట్ల ఘర్షణలు జరిగాయి. పలుచోట్ల బస్సులను ఆందోళనకారులు అడ్డుకున్నారు. కంగ్పోకి జిల్లాలో జరిగిన ఈ ఘర్షణల్లో ఒక వ్యక్తి మరణించాడు. జిల్లాలోని పలు సబ్ డివిజన్‌ల్లో ప్రజల, వాహనాల కదలికలపై ఆంక్షలు విధించారు. రెండవ నెంబరు జాతీయ రహదారిపై ఈ ఆంక్షలు వెంటనే అమల్లోకి వచ్చాయి. జిల్లా మేజిస్ట్రేట్ మహేష్ చౌదరి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఇంఫాల్ నుండి సేనాపతి జిల్లాకు వెళుతున్న ప్రభుత్వ రవాణా సంస్థకు చెందిన బస్సును ఆపడానికి ప్రయత్నించి, ప్రైవేటు వాహనాలకు ఆందోళనకారులు నిప్పంటించడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. తమకు ప్రత్యేక పరిపాలన వచ్చేంతవరకు స్వేచ్ఛగా తిరిగేందుకు అనుమతించవద్దని డిమాండ్ చేస్తూ కాంగ్‌పోక్పి జిల్లాలో కుకీలు శనివారం నిరసన తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో బస్సులను అడ్డుకోవడంతోపాటు రాళ్లు రువ్వారు. పలుచోట్ల రోడ్లను దిగ్బంధించారు. గో బ్యాక్ అని నినాదాలు చేశారు. కుకీ నిరసనకారులను భద్రతా దళాలు చెదరగొట్టేందుకు ప్రయత్నించాయి. పలుచోట్ల భద్రతాదళ సిబ్బంది లాఠీచార్జ్ చేశారు. ఈ ఘర్షణల్లో కొంతమంది కుకీ మహిళలకు గాయాలయ్యాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజునే గాంగిపై, కాంగ్‌పోక్పి జిల్లాలో నిరసన చేసిన కుకీ మహిళలు క్రూరమైన హింసను ఎదుర్కొన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై పురుష పోలీసులు విరుచుకుపడ్డారు. బలప్రయోగం ద్వారా శాంతిని ఎప్పటికీ సాధించలేము అని ఈ ఘర్షణలకు సంబంధించిన వీడియో.. మణిపూర్‌లో ఈ హింసను ఆపండి అనే హ్యాష్‌ట్యాగ్‌తో వైరల్ అవుతున్నాయి.

రెండేళ్ల క్రితం మణిపూర్‌లో జాతుల మధ్య ఘర్షణలతో నిలిచిపోయిన అంతర్ జిల్లా బస్సుల రాకపోకలను శనివారం ఉదయం పునరుద్ధరించారు. ప్రయాణికులెవరూ లేకుండానే ఈ బస్సులు ప్రయాణించాయి. భారీగా కేంద్ర బలగాల కాన్వాయ్‌లతో ఈ బస్సులు వెళ్లాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని మార్గాల్లో ప్రజలు స్వేచ్ఛగా రాకపోకలు వీలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రి భద్రతా బలగాలను ఆదేశించడంతో ఈ బస్సు సర్వీసులను పునరుద్ధరించారు.

ఆలయ ప్రవేశం కోసం 130 దళిత కుటుంబాల ఆందోళన



- సాంఘిక బహిష్కరణతో ఇబ్బందులు

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్‌లోని పుర్బా బర్ధమాన్ జిల్లాలో 130 దళిత కుటుంబాలు నేటికీ కులవివక్షను ఎదుర్కొంటున్నాయి. కులం ప్రాతిపదికగా ఆలయ ప్రవేశానికి పెత్తందారులు అడ్డుచెబుతుండటంతో వారు ఆందోళనబాటపట్టారు. గిద్‌గ్రామ్ గ్రామంలోని దాస్‌పరా ప్రాంతంలో గిదేశ్వర్ శివాలయం ఉంది. ఆ ప్రాంతంలో అదొక్కటే ఆలయం. చర్మపు వస్తువుల తయారీ, నేత పని చేస్తున్న 'దాస్' ఇంటి పేరున్న వారిని తక్కువ కులంగా చూస్తూ, ఆ ఆలయంలోకి అనుమతించడం లేదు. సుమారు 300 సంవత్సరాల క్రితం ఈ ఆలయం స్థాపించినప్పటి నుంచీ కులవివక్ష కొనసాగుతోందని గ్రామస్థులు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 25కు విరుద్ధంగా ఉన్న ఈ వివక్షకు చరమగీతం పాడాలని, ఆలయంలో ప్రవేశించే హక్కును కల్పించాలని దళితులు డిమాండ్ చేస్తున్నారు.

పోలీసుల మధ్యవర్తిత్వం విఫలం

దాస్ కుటుంబాలు ఆలయంలో ప్రార్థన చేయడానికి వీలుగా పోలీసులు, ప్రభుత్వాధికారులు ఫిబ్రవరి 28న మధ్యవర్తిత్వం వహించి, సమావేశం నిర్వహించారు. కట్వా, మంగల్‌కోట్ ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. దాస్ కుటుంబాలకు ఆలయంలో ప్రార్థన చేయడానికి అనుమతించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం కాగితాలకే పరిమితమైంది.

సాంఘిక బహిష్కరణ

దాస్ కుటుంబాలు ఆలయంలో ప్రార్థన చేయడానికి ప్రయత్నించిన తర్వాత వారిని సాంఘిక బహిష్కరణ చేశారు. ఎవరూ ఆర్థిక లావాదేవీలు నిర్వహించకుండా కట్టడి చేశారు. గ్రామంలోని పాడి కేంద్రాల్లో వారి పాలు కొనుగోలు చేయడం నిలిపివేయడంతో 30 నుంచి 40 కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయాయి.

సంప్రదాయాలు ఉల్లంఘిస్తే అశాంతి : ఆలయ కమిటీ సభ్యుడు

ఆలయ కమిటీ సభ్యుడు దినబంధు మోండల్ మాట్లాడుతూ "ఈ గ్రామంలో ఎవరూ ఈ పురాతన సంప్రదాయాన్ని ఉల్లంఘించాలనుకోవడం లేదు. వారు ఆలయంలోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తే, గ్రామంలో అశాంతి సృష్టించబడుతుంది. ప్రభుత్వం జాగ్రత్తగా వ్యవహరించాలి," అని అన్నారు.

నాటి నిర్ణయాలను త్వరలో అమలు చేస్తాం : కట్వా ఎస్‌డిఒ

"ఫిబ్రవరి 28న జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను త్వరలో అమలు చేస్తామని, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని కట్వా ఎస్‌డిఒ అనిషా జైన్ తెలిపారు.

దాస్ కుటుంబాల నిర్ణయం

"ఈ పోరాటాన్ని చివరి వరకు కొనసాగిస్తాం. కొల్‌కతా, ఢిల్లీలోని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. సమస్య పరిష్కారం కాకపోతే మా పూర్వీకుల కట్టుబాట్లను వదిలి వెళ్తాం" అని దాస్ కుటుంబాల ప్రతినిధి ఎక్కోరి దాస్ తెలిపారు. "మేము శివునికి పూజలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. మా భద్రత కోసం భయపడి ఆలయంలోకి వెళ్లలేదు. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకోవాలి," అని దాస్‌పరా నివాసి లిపి దాస్ తెలిపారు. ఈ వివక్షతను అంతం చేయడానికి ప్రభుత్వం, పోలీసులు ఎప్పుడు చర్యలు తీసుకుంటారనేది ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది.

గాజాలో అరబ్ ప్రణాళికనే అమలు చేయాలి

- సమర్థించిన ఓఐసి
- రంజాన్ మాసంలో మసీదులపై దాడికి దిగిన ఇజ్రాయిల్



ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన వ్యక్తి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గాజా : గాజాలోకి మానవతాసాయం ప్రవేశించనివ్వకుండా గత వారం రోజులుగా ఇజ్రాయిల్ అమలు చేస్తున్న ఆంక్షలను తక్షణమే విరమించాలని పలు దేశాలు చేస్తున్న విజ్ఞప్తులను ఇజ్రాయిల్ పెడచెవిన పెడుతోంది. గాజాపై మరిన్ని దాడులకు కూడా దిగుతోంది. తాజాగా ఈ దాడుల్లో రాఫాలో ఇద్దరు పాలస్తీనియన్లు మరణించారు. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని ఉత్తర ప్రాంతంలోని నబ్లస్ నగరంలో గల పలు మసీదులపై శుక్రవారం ఇజ్రాయిల్ దాడులకు దిగింది. పురాతనమైన అల్ నాసర్ మసీదులోకి చొరబడిన సైనికులు ఇమామ్ గదికి నిప్పంటించారు. అగ్నిమాపక దళాన్ని కూడా లోపలకు ప్రవేశించనీయలేదని సంబంధిత వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మరోవైపు ఆహారం, నిత్యావసరాలు, శిబిరాలు, మొబైల్ ఇళ్లు వంటి సాయంపై విధించిన నిషేధాన్ని ఎత్తివేయడానికి నాలుగు రోజుల గడువును ఇస్తున్నామని, లేనిపక్షంలో ఇజ్రాయిల్‌పై నావికాదళ దాడులు మొదలవుతాయని హౌతి రెబెల్స్ హెచ్చరించారు.

ట్రంప్ ప్రణాళికను వ్యతిరేకిస్తున్నాం : ఓఐసి

గాజాను మొత్తంగా స్వాధీనం చేసుకుని పునర్నిర్మాణం చేస్తామని ట్రంప్ చేసిన ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈజిప్ట్ నేతృత్వంలోని అరబ్ దేశాలు చేసిన గాజా పునర్నిర్మాణ ప్రణాళికను ఇస్లామిక్ సహకార సమాఖ్య (ఓఐసి) సమర్ధించింది. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం ముగిసిన తర్వాత స్వతంత్ర పాలనాపరమైన కమిటీని ఏర్పాటు చేయాలని ఈజిప్ట్ ప్రతిపాదించింది. వృత్తిపరమైన నిపుణులతో కూడిన ఈ కమిటీకి గాజా పాలనా బాధ్యతలు అప్పగించాలని సూచించింది. మొదటి దశ ఆరు మాసాల పాటు వుంటుందని, తర్వాత రెండు దశలు కలిసి నాలుగు నుండి ఐదేళ్లు వుంటాయని తెలిపింది. రహదారులపై శిధిలాలను తొలగించిన తర్వాత, 2లక్షల తాత్కాలిక ఇళ్లను నిర్మించి, ప్రజలకు అప్పగించాలి. దెబ్బతిన్న 60వేల భవనాలను పునరుద్ధరించాలన్నది ఆ ప్రణాళికలో భాగంగా వుంది. నెమ్మదిగా నీరు, వ్యర్థాల వ్యవస్థలను ఏర్పాటు చేయడం, టెలికమ్యూనికేషన్, విద్యుత్ సేవలను పునరుద్ధరించాలని సూచిస్తోంది.

దాడుల్లో 12.298 మంది మహిళలు మృతి

గాజాపై ఇజ్రాయిల్ 519రోజులుగా సాగించిన దాడుల్లో 12,298మందికి పైగా మహిళలు మరణించారని పాలస్తీనా అథారిటీ తెలిపింది. వేలాదిమంది మహిళలు ఇళ్లూ వాకిళ్ళు వదిలేసి, పిల్లా పాపలతో నిర్వాసితులయ్యారని వెల్లడించింది. మనుగడ కోసం పోరాటం సాగించే వారిలో పాలస్తీనా మహిళలు అగ్ర భాగాన వుంటారని పిఎ వ్యాఖ్యానించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. హింస, వేధింపులు భరిస్తూ 21మంది మహిళలు ఇజ్రాయిల్ జైళ్లలో మగ్గిపోతున్నారని తెలిపింది.

గాజాలో రెండో దశ కాల్పుల విరమణ చర్చలపై సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయని హమాస్ వ్యాఖ్యానించింది. హమాస్ ప్రతినిధి బృందం కైరోలోని మధ్యవర్తులను కలిసిన నేపథ్యంలో ఈ ప్రకటన విడుదలైంది.

మస్క్‌తో విదేశాంగ, రవాణా మంత్రుల వాగ్వాదం ?

- అలాంటిదేమీ లేదన్న ట్రంప్

వాషింగ్టన్ : వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు ట్రంప్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం సందర్భంగా ప్రభుత్వ సీనియర్ సలహాదారు ఎలన్ మస్క్, విదేశాంగ మంత్రి మార్క్ రూబియోల మధ్య వాగ్వివాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు మీడియా కథనాలు వెలువడ్డాయి. అలాంటిదేమీ లేదని, వారిద్దరు చక్కగా కలిసి పని చేసుకుంటున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు. రూబియోతోనే కాకుండా రవాణా శాఖ మంత్రి సియాన్ డఫీతో కూడా మస్క్ వాదన పెట్టుకున్నారని న్యూయార్క్ టైమ్స్ కథనం వెలువరించింది. ప్రభుత్వ శాఖల వ్యయాన్ని తగ్గించే బాధ్యతలను చేపట్టిన డోజ్‌కు మస్క్ నేతృత్వం వహిస్తుండగా, ఇందులో భాగంగా అనేక ఉద్యోగాల్లో కోతలు విధిస్తుండటంపై గురువారం నాటి సమావేశంలో వాదన జరిగినట్టు తెలిపింది. ఉద్యోగాల్లో కోతలు కొనసాగుతాయని, అయితే గొడ్డలితో బదులుగా కత్తిని ఉపయోగిస్తామని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ వివాదం గురించి శుక్రవారం ట్రంప్‌ను విలేకర్లు ప్రశ్నించగా, అలాంటిదేమీ లేదని స్పష్టం చేశారు. ఎలంటి ఘర్షణ లేదు, నేను అక్కడే వున్నానని చెప్పారు. పదే పదే పట్టుబట్టి ప్రశ్నించగా మస్క్, రూబియో అద్భుతంగా తమకు అప్పగించిన పనులు చేస్తున్నారని అన్నారు.

అసలు కారణం ?

విదేశాంగ శాఖలో వ్యయం తగ్గింపు చర్యల గురించి ప్రశ్నిస్తూ మస్క్, మొదటి 45రోజుల కాలంలో రూబియో ఒక్కరిని కూడా ఉద్యోగం నుండి తొలగించలేదని వ్యాఖ్యానించారు. దీనికి రూబియో ఘాటుగా స్పందించారు. ఇప్పటికే 1500మంది విదేశాంగ శాఖ ఉద్యోగులు ముందుగానే పదవీ విరమణ చేయడానికి అంగీకరించారని, ఒకవేళ తాను ఎవరినన్నా తీసేయాలనుకుంటే ఆ 1500మందిని మళ్లీ విధుల్లోకి తీసుకుని, తొలగించాలని వ్యంగంగా వ్యాఖ్యానించారు. మరోవైపు రవాణా శాఖ మంత్రి డఫీతో మస్క్‌కు చిన్నపాటి ఘర్షణ నెలకొంది. కీలకమైన ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లను తొలగించడానికి మస్క్ ప్రయత్నిస్తున్నారని డఫీ ఆరోపించారు. దానిపై మస్క్ స్పందిస్తూ ఆయన అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. ఈలోగా ట్రంప్ జోక్యం చేసుకుని వాదనలను సద్దుబాటు చేయడానికి ప్రయత్నించారు. ఇకపై ప్రతిష్టాత్మకమైన మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో చదువుతున్న మేధావుల నుండి కంట్రోలర్లను నియమించాల్సి వుందని వ్యాఖ్యానించారు.



రూబియో, ట్రంప్

టొరంటో పబ్‌లో కాల్పులు

- 12మందికి గాయాలు

టొరంటో : తూర్పు టొరంటోలోని పబ్‌లో శుక్రవారం రాత్రి జరిగిన కాల్పుల్లో 12మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. రాత్రి 10.40గంటల ప్రాంతంలో ప్రోగ్రెస్ అవెన్యూకు సమీపంలోని పబ్‌లో పలువురిపై కాల్పులు జరిగినట్లు తమకు సమాచారం అందిందని పోలీసులు చెప్పారు. వీరిలో కొంతమందికి స్వల్ప గాయాలవగా, మరికొంతమందికి తీవ్ర గాయాలయ్యాయని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. తల వరకు నల్లని ముసుగు ధరించిన అనుమానితుడు సిల్వర్ రంగు కారులో పారిపోయాడని పోలీసులు తెలిపారు. ఆ వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. ఆ ప్రాంతంలో ఎవరూ బయట తిరగవద్దని ప్రజలను కోరారు. ఇంకా దర్యాప్తు కొనసాగుతున్నందున ఇప్పుడే ఏ వివరాలు తెలియవని టొరంటో మేయర్ చెప్పారు. అనుమానితుడు వద్ద అసాల్ట్ రైఫిల్, చేతి తుపాకులు వున్నాయని పోలీసులు తెలిపారు. ఆపబ్‌పై దాడి చేయడానికి ప్రత్యేక కారణమేమైనా వుందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

దక్షిణ కొరియా నేత సుక్ యోల్ విడుదల

సియోల్ : దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ శనివారం జైలు నుండి విడుదలయ్యారు. భౌతికంగా ఆయనను నిర్బంధించకుండా విచారణకు అనుమతించాలని పేర్కొంటూ ఆయన అరెస్టును రద్దు చేస్తూ సియోల్ జిల్లా కోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ విడుదల చోటు చేసుకుంది. జైలు బయట వేచి వున్న తన మద్దతుదారులకు అభివాదంచేస్తూ యూన్ బయటకు రావడాన్ని టివిలు ప్రసారం చేశాయి. జనవరి 3న కొద్ది గంటల పాటు దేశంలో సైనిక పాలన విధించిన దేశంలో రాజకీయ సంక్షోభానికి కారణమయ్యారంటూ యూన్‌ను అరెస్టు చేశారు. ఆయనను అభిశంసిస్తూ ప్రతిపక్షం నేతృత్వంలోని నేషనల్ అసెంబ్లీ ఓటు వేయడంతో ఆయనను అధికారం నుండి సస్పెండ్ చేశారు.

అవాస్తవాలతో అసెంబ్లీని, ప్రజలను తప్పుదారి పట్టించొద్దు

(మొదటి పేజీ తరువాయి)

టిడిపి కూటమి సర్కారుకు జగన్ ప్రభుత్వానికి తేడా లేదని రుజువు చేసిందని విమర్శించారు. అదాని అవినీతిని కప్పిపుచ్చడానికి మోడీ, జగన్, చంద్రబాబు కంకణం కట్టుకున్నారని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్ల విషయంలోనూ కూటమి సర్కారు మాట తప్పిందని విమర్శించారు. వాగ్దానాలను విస్మరించడమే గాక ప్రజలకు అబద్ధాలు చెబుతూ మోసగించి ఎల్లకాలం పాలన సాగించలేరని తెలిపారు. విద్యుత్ భారాలు మోస్తున్న ప్రజలు తప్పక ప్రతిఘటిస్తారని, ప్రభుత్వానికి బుద్ధి చెప్పక మానరని పేర్కొన్నారు.

వ్యవసాయరంగం ద్వారాలు తెరవాలి

- అమెరికన్ నట్స్, పళ్లు, కోళ్ల వాణిజ్యానికి అవకాశమివ్వాలి
- ఇండియా టుడే సదస్సులో అమెరికా వాణిజ్య మంత్రి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : విదేశీ వాణిజ్యానికి భారత వ్యవసాయ రంగం ద్వారాలు తెరవాలని అమెరికా కోరింది. ఆ రంగంలోకి బయటివారు ప్రవేశించకుండా ద్వారాలు మూసుకుని కూర్చుంటే సరిపోదని వ్యాఖ్యానించింది. దేశీయంగా అనేక సున్నితమైన పరిస్థితులు నెలకొన్నాయని, వాటిని కారణాలుగా చూపుతూ ప్రభుత్వం, వ్యవసాయ రంగాన్ని విదేశీ వాణిజ్యానికి అనుమతించడం లేదని అమెరికా వాణిజ్య శాఖ మంత్రి హెువార్డ్ లుత్నిక్ వ్యాఖ్యానించారు. అమెరికన్ నట్స్, పళ్లు, కోళ్లకు భారత మార్కెట్ ద్వారాలు తెరవాలని అమెరికా చాలా కాలంగా పట్టుబడుతున్నా, భారత ప్రభుత్వం వినడం లేదని అన్నారు. "అలా కాకుండా భారత వ్యవసాయ మార్కెట్ తలుపులు బార్లా తెరవాలి, అది మీరు ఎలా చేస్తారో మీ ఇష్టం, కోటాలు పెట్టుకోవచ్చు, పరిమితులు విధించుకోవచ్చు. కానీ మీకు అతి ముఖ్యమైన వాణిజ్య భాగస్వామి చర్చలకు ఆవలి వైపు వున్నప్పుడు మీరు మరింత తెలివిగా ఆలోచించాలి." అని ఆయన వ్యాఖ్యానించారు. భారత్ ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకోవాలని, ప్రపంచంలోనే అతిపెద్ద వినిమయ ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంతో ఒప్పందం లాభదాయకంగా వుంటుందని చెప్పుకున్నారు.

ఇండియా టుడే సదస్సులో ఆయన మాట్లాడుతూ అమెరికా పట్ల భారత్ తన టారిఫ్ విధానాన్ని తగ్గించుకుంటే అసాధారణమైన అవకాశాలను, అద్భుతమైన సంబంధాలను తమదేశం అందిస్తుందని చెప్పారు. ట్రంప్ రెండో హయాంలో వాణిజ్యం, టారిఫ్‌లపై ప్రధానంగా దృష్టి పెడుతున్న తరుణంలో విస్తృతమైన భారత్–అమెరికా సంబంధాలపై అడిగిన ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, పరస్పరం వాణిజ్యం చేసేటప్పుడు ప్రభుత్వాలు ఆలోచించే అంశాలు చాలా వుంటాయని అన్నారు. భారత్ చారిత్రకంగా తన మిలటరీ సామాగ్రిని ఎక్కువగా రష్యా నుండి కొనుగోలు చేస్తుందని, దాన్ని కొంతమేరకు ఆపాలని తాము కోరుకుంటున్నామని చెప్పారు. బ్రిక్స్‌లో భారత్ భాగస్వామ్యాన్ని ప్రస్తావిస్తూ, ఉమ్మడి కరెన్సీని చైనా ప్రతిపాదించడం తమకు నచ్చడం లేదన్నారు. డాలర్ ప్రాముఖ్యతను తగ్గించే యత్నంగా తాము చూస్తున్నామన్నారు. భారత్‌లో తమకు నచ్చని అంశాలు కొన్ని వున్నాయని, అలాంటివి ఆగిపోవాలని తాము కోరుకుంటామని చెప్పారు. భారత్‌తో విశ్వసనీయమైన, బలమైన సంబంధాలను ఏర్పాటు చేసుకోవాలన్నది అమెరికా అభిమతమని ఆయన స్పష్టం చేశారు.

కార్మికుల ఆనవాళ్లను గుర్తించిన క్యాడవర్ డాగ్స్

- నేటి నుంచి రోబోలను దించనున్న ప్రభుత్వం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎస్‌ఎల్‌బిసి సొరంగంలో మూడు చోట్ల కార్మికుల ఆనవాళ్లను క్యాడవర్ డాగ్స్ గుర్తించాయి. ఆ ప్రాంతాల్లో తవ్వేందుకు రెస్క్యూ బృందాలు లోపలికి వెళ్లాయి. ఈ ప్రమాదం ఒక జాతీయ విపత్తు అని, కార్మికులను వెలికితీయడానికి, సహాయక చర్యల్లో ప్రపంచంలోని అత్యుత్తమ సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. అయితే, జిపిఆర్ స్కాన్, కేరళ డాగ్స్‌ను రంగంలోకి దింపినా ఉబికి వస్తున్న నీటి ఊట వల్ల సహాయక చర్యలు ముందుకు సాగడం లేదన్నారు. చివరి 50 మీటర్ల నిడిది పూర్తిగా ప్రమాదకరంగా మారిందని తెలిపారు. టన్నెల్ పై భాగం నెర్రెలు బారి కూలడానికి సిద్ధంగా ఉందని, అందుకే టన్నెల్‌లో పని చేయాలంటే ప్రమాదం కొనితెచ్చుకున్నట్టేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారని తెలిపారు. కార్మికులను గుర్తించడానికి ఆదివారం నుంచి రోబోలను దించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. సొరంగంలో కేరళ క్యాడవర్ డాగ్స్ ముగ్గురు కార్మికుల ఆనవాళ్లు గుర్తించినట్టు అధికారులు చెప్పారు. పూర్తి స్థాయిలో సమీక్ష నిర్వహించడానికి ఈనెల 11న సిఎంతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

సొరంగంలో ప్రమాదం పొంచి ఉంది. అంతర్జాతీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడినా 15 రోజులుగా కార్మికులను గుర్తించలేదు. జిపిఆర్ స్కాన్ ద్వారా కార్మికుల ఆచూకీ తెలుస్తుందని భావించారు. అయితే, జిపిఆర్ గుర్తించిన దగ్గర ఇనుప రాడ్లు ఉన్నట్టు తేలింది. ఆ తర్వాత కేరళ క్యాడవర్ డాగ్స్‌ను సొరంగంలోకి పంపి రెండ్రోజులుగా కార్మికుల ఆచూకీ కోసం గాలించారు. ఊట రాళ్లు పడుతుండటంతో కార్మికులకు ప్రమాదం పొంచి ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే నేటి నుంచి రోబోలను ప్రభుత్వం రంగంలోకి దించనుంది.

మహిళల బాధలకు ఎవర్ని బాధ్యుల్ని చేస్తారు? : నితీష్‌పై తేజస్వి ఆగ్రహం

పాట్నా : 'బీహార్ రాష్ట్రంలో మహిళలు అనేక కష్టాల్ని ఎదుర్కొంటున్నారు. వారు పడే బాధలకు ఎవర్ని బాధ్యుల్ని చేస్తారు?' అని ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్ బీహార్ సిఎం నితీష్‌కుమార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సంక్షేమం పట్ల ముఖ్యమంత్రి నిబద్ధత ఏమిటని ఆయన ప్రశ్నించారు. 'బీహార్‌లో 63 శాతం గర్భిణులు పోషకాహారలోపంతో, రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రసూతి మరణాల రాష్ట్రాల్లో బీహార్ అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇప్పటికీ రాష్ట్రంలో 59 శాతం మహిళలు మాత్రమే రుతుక్రమ ఉత్పత్తులు (శానిటరీ ప్యాడ్స్)ను ఉపయోగిస్తున్నారని ఆరోగ్య మంత్రిత్వశాఖ గణాంకాలే చెబుతున్నాయి. బీహార్ శాసనసభలో ఏ పార్టీ మహిళలను నిజంగా గౌరవిస్తుందో, ఏ పార్టీ అగౌరవపరుస్తుందో తెలుస్తుంది' అని తేజస్వియాదవ్ ఎక్స్ వేదికగా నితీష్‌కుమార్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు.

'స్విమ్స్'లో మతవివక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఛైర్మన్‌గా, ఇఒ కమిటీ మెంబర్‌గా వ్యవహరిస్తారు.

మత వివక్ష తగదు : సిపిఎం

స్విమ్స్ యూనివర్సిటీలో సీనియర్ రెసిడెంట్ వైద్యుల పోస్టుల భర్తీలో మత వివక్ష పాటించడం రాజ్యాంగ వ్యతిరేకమని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మతాన్ని బట్టి వివక్షత చూపడం చట్ట విరుద్ధమని, అప్రజాస్వామికమని తెలిపారు. టిటిడి ఆధ్వర్యంలో నడిచే విద్య, వైద్య సంస్థలు ప్రభుత్వ నియమనిబంధనలకు, రాజ్యాంగ వ్యవస్థకు లోబడి పని చేయాలని, అవి కూడా లౌకిక సంస్థలేనని పేర్కొన్నారు. ఇప్పటివరకు లేని నిబంధనలను ఉన్నట్లుండి ఒక్కసారిగా ముందుకు తేవడంలో రాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బిజెపి, దాని మాతృ సంస్థ ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర కనిపిస్తోందని విమర్శించారు. ఈ నిబంధనను ఉపసంహరించుకొని మతానికి అతీతంగా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని మతం పేరుతో సాగుతున్న ఈ వివక్షతాపూరితమైన నిబంధనను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కాఫీ కొనుగోలులో దోపిడి

(మొదటి పేజీ తరువాయి)

రూ.12 వేలు నష్టతున్నారు.

ఈ ఏడాది ఏం జరుగుతోంది?

అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని 2023-24 కంటే 2024-25లో కాఫీ కొనుగోలు ధరను జిసిసి పెంచి చెల్లిస్తోంది. జిసిసి ధర ప్రకటించకముందే దళారులు రంగంలోకి దిగి తక్కువ ధరకు రైతుల నుంచి కాఫీ కొన్నారు. జిసిసి ధర గతం కంటే పెంచడంతో దళారులు కూడా కొంత పెంచి కొనుగోలు చేయడం ప్రారంభించారు. అయితే, పెంచిన ధర కంటే తూకంలో మోసం ద్వారా ఎక్కువ లాభం పొందుతున్నారు. అల్లూరి జిల్లా పాడేరు డివిజన్‌లోని 11 ఏజెన్సీ మండలాల్లో 2,46,139 మంది రైతులు 2,58,021 ఎకరాల్లో కాఫీ పండిస్తున్నారు. ఏడాదికి 16 వేల మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడి వస్తున్నప్పటికీ జిసిసి కొనుగోలు వెయ్యి మెట్రిక్ టన్నులు దాటడం లేదు. పార్చుమెంట్ రకానికి పది శాతం, చెర్రీ రకానికి 10.5 శాతం తేమ మించకూడదని కొర్రీలు పెడుతుండడమూ ప్రయివేటు వైపు రైతులు వెళ్లేందుకు ఆస్కారమిస్తోంది.

ఏజెన్సీ కాఫీకి గిరాకీ ఉన్నప్పటికీ..

ప్రకృతి ప్రతికూలతలతో వియత్నాం, బ్రిజిల్‌లో కాఫీ దిగుబడి తగ్గడంతో మన ఏజెన్సీ కాఫీకి మంచి గిరాకీ ఏర్పడింది. అంతర్జాతీయ మార్కెట్ డిమాండ్ ఆధారంగా 2024-25 (ఈ ఏడాది) కిలో అరాబికా పార్చుమెంట్ కాఫీకి రూ.400, అరాబికా చెర్రీ రకపు కాఫీకి రూ.250, రొబస్తా చెర్రీకి రూ.160 చొప్పున జిసిసి ధర నిర్ణయించింది. 2023-24 (గతేడాది)లో కిలో పార్చుమెంట్ కాఫీకి రూ.280, చెర్రీకి రూ.145, రొబస్తాకు రూ.70 చొప్పున చెల్లించింది. గతేడాది 565.90 మెట్రిక్ టన్నుల కాఫీని జిసిసి కొనుగోలు చేసింది. ఈ ఏడాది వెయ్యి మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయవచ్చని జిసిసి అంచనా వేసింది. ఈ క్రమంలో 2024 డిసెంబరు చివరి వారం నుంచి కొనుగోలు ప్రారంభించి ఈ ఏడాది మార్చి ఐదు నాటికి 542.754 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. 2022-23లో 996 మెట్రిక్ టన్నుల కాఫీని కొనుగోలు చేసింది. ప్రైవేట్ బ్యాపారుల దోపిడీ నుంచి గిరిజన కాఫీ రైతులను ఆదుకోవడం, జిసిసి కొనుగోళ్లు పెంచడం, అంతర్జాతీయ మార్కెట్ ధరలను బట్టి వాటిని పెంచడమూ అవసరం.

భారత సాయుధ దళాలలో అగ్నివీర్‌గా చేరండి



ఎంపిక ప్రమాణాలు

విద్యాసంబంధిత అర్హతలు

(ఆర్మీ)

అగ్నివీర్ (జనరల్ డ్యూటీ) (ఆల్ ఆర్మ్స్) & అగ్నివీర్ (జనరల్ డ్యూటీ) (మహిళా మిలిటరీ పోలీస్) – ఐదు ప్రాథమిక సబ్జెక్టులలో మొత్తం 45% మార్కులతో 10వ తరగతి/ మెట్రిక్ ఉత్తీర్ణత మరియు ఆ ఐదు సబ్జెక్టులలో ప్రతిదానిలో కనీసం 33% మార్కులు. గ్రేడింగ్ విధానాన్ని అనుసరించే బోర్డుల కోసం, పైన పేర్కొన్న శాతాలకు అనుగుణంగా గ్రేడ్‌లు పరిగణించబడతాయి.
గమనిక: చెల్లుబాటు అయ్యే లైట్ మోటార్ వెహికల్ (ఎల్ఎంవి) డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న అభ్యర్థులకు డ్రైవర్ అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

అగ్నివీర్ (టెక్నికల్) (ఆల్ ఆర్మ్స్)– 10+2/ ఇంటర్మీడియట్ పరీక్షలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ మరియు ఇంగ్లీషుతో సైన్స్‌లో కనీసం 50% మార్కులతో మరియు ప్రతి సబ్జెక్టులో 40% మార్కులతో ఉత్తీర్ణత.

లేదా

ఏదైనా గుర్తింపు పొందిన రాష్ట్ర విద్యా బోర్డు లేదా కేంద్ర విద్యా బోర్డు నుండి ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ మరియు ఇంగ్లీషుతో 10+2/ ఇంటర్మీడియట్ పరీక్ష ఉత్తీర్ణత, అవసరమైన రంగంలో కనీసం ఒక సంవత్సరం ఎన్ఐఓఎస్ మరియు ఐటిఐ కోర్సును చేర్చడానికి ఎన్ఎస్‌క్యూఎఫ్ స్థాయి 4 లేదా అంతకంటే ఎక్కువ.

లేదా

10వ తరగతి/మెట్రిక్ ఉత్తీర్ణతతో 50% మార్కులతో ఇంగ్లీష్, మ్యాథ్స్ మరియు సైన్స్‌లో కనీసం 40% మార్కులతో ఉత్తీర్ణతతో పాటు ఐటిఐ నుండి 2 సంవత్సరాల సాంకేతిక శిక్షణ లేదా రెండు/మూడు సంవత్సరాల డిప్లొమాతో సహా గుర్తింపు పొందిన విద్యా సంస్థల నుండి నిర్దిష్ట స్ట్రీమ్‌లలో (మెకానిక్ మోటార్ వెహికల్, మెకానిక్ డీజిల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, టెక్నీషియన్ పవర్ ఎలక్ట్రానిక్ సిస్టమ్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మన్ (అన్ని రకాలు), సర్వేయర్, జియో ఇన్ఫర్మేటిక్స్ అసిస్టెంట్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ సిస్టమ్ మెయింటెనెన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మెకానిక్ కమ్‌ఆపరేటర్ ఎలక్ట్రిక్ కమ్యూనికేషన్ సిస్టమ్, వెస్సెల్ నావిగేటర్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఆటో మొబైల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ) ఇండియన్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ప్రకటించబడింది.

అగ్నివీర్ (క్లర్క్/ స్టోర్‌కీపర్ టెక్నికల్): 10+2/ ఇంటర్మీడియట్ పరీక్షలో ఏదైనా స్ట్రీమ్‌లో (ఆర్ట్స్, కామర్స్, సైన్స్) 60% మార్కులతో మరియు ప్రతి సబ్జెక్టులో కనీసం 50% మార్కులతో ఉత్తీర్ణత. 12వ తరగతిలో ఇంగ్లీష్ మరియు మ్యాథ్స్/ అకౌంట్స్/ బుక్ కీపింగ్‌లో 50% సాధించడం తప్పనిసరి.
అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ 10వ తరగతి ఉత్తీర్ణత (ఆల్ ఆర్మ్స్): –సింపుల్ 10 పాస్ (అగ్రిగేట్ శాతం అవసరం లేదు కానీ ఐదు ప్రాథమిక సబ్జెక్టుల్లో 33% స్కోర్ ఉండాలి).
అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ 8వ తరగతి ఉత్తీర్ణత (ఆల్ ఆర్మ్స్): –సింపుల్ 8 పాస్ (అగ్రిగేట్ శాతం అవసరం లేదు కానీ ఐదు ప్రాథమిక సబ్జెక్టుల్లో 33% స్కోర్ ఉండాలి).

నేవీ

అగ్నివీర్ (సీనియర్ సెకండరీ రిక్రూట్) – భారత ప్రభుత్వం, విద్యా మంత్రిత్వ శాఖ గుర్తించిన పాఠశాల విద్య బోర్డుల నుండి 10+2లో గణితం మరియు భౌతిక శాస్త్రంలో కనీసం 50% మార్కులతో అర్హత సాధించాలి.

లేదా

సెంట్రల్, స్టేట్ మరియు యుటి గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ ఇన్స్టిట్యూట్ నుండి ఇంజనీరింగ్ (మెకానికల్/ఎలక్ట్రికల్/ఆటోమొబైల్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లో మూడేళ్ల డిప్లొమా కోర్సులో 50% మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

లేదా

సెంట్రల్, స్టేట్ మరియు యుటి గుర్తింపు పొందిన విద్యా బోర్డుల నుండి ఫిజిక్స్ మరియు మ్యాథమెటిక్స్ అనే నాన్–వొకేషనల్ సబ్జెక్టుతో రెండేళ్ల వృత్తిపరమైన కోర్సులో 50% మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి.

అగ్నివీర్ (మెట్రిక్ రిక్రూట్) – ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుండి మెట్రిక్యులేషన్/10వ తరగతి లేదా తత్సమాన కోర్సులో కనీస ఉత్తీర్ణత సాధించాలి.

అగ్నివీర్ (మెట్రిక్ రిక్రూట్ మ్యూజిసియన్)– ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల/ బోర్డు నుండిమెట్రిక్యులేషన్/10వ తరగతి లేదా తత్సమాన కోర్సులో కనీస ఉత్తీర్ణత సాధించాలి.

వైమానిక దళం

సైన్స్ సబ్జెక్టులు – అభ్యర్థులు సెంట్రల్, స్టేట్ మరియు యుటి గుర్తింపు పొందిన విద్యా బోర్డుల నుండి గణితం, భౌతిక శాస్త్రం మరియు ఇంగ్లీష్‌తో ఇంటర్మీడియట్/ 10+2/ తత్సమాన పరీక్షలో కనీసం 50% మార్కులతో మరియు ఇంగ్లీషులో 50% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.

లేదా

సెంట్రల్, స్టేట్ మరియు యుటి గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ నుండి ఇంజనీరింగ్ (మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ ఆటోమొబైల్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్‌స్ట్రుమెంటల్ టెక్నాలజీ/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ)లో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సులో 50% మార్కులతో మరియు డిప్లొమా కోర్సులో ఇంగ్లీషు సబ్జెక్ట్ కాకపోతే (లేదా ఇంటర్మీడియట్/ మెట్రిక్యులేషన్‌లో, డిప్లొమా కోర్సులో ఇంగ్లీష్ సబ్జెక్ట్ కాకపోతే) ఇంగ్లీషులో 50% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి.

లేదా

సెంట్రల్, స్టేట్ మరియు యుటి గుర్తింపు పొందిన విద్యా బోర్డుల నుండి ఫిజిక్స్ మరియు మ్యాథమెటిక్స్ వంటి నాన్–వొకేషనల్ సబ్జెక్టులతో రెండేళ్ల వొకేషనల్ కోర్సులో 50% మార్కులతో మరియు వొకేషనల్ కోర్సులో (లేదా ఇంటర్మీడియట్/ మెట్రిక్యులేషన్‌లో, ఇంగ్లీష్ వొకేషనల్ కోర్సులో సబ్జెక్ట్ కాకపోతే) ఉత్తీర్ణులై ఉండాలి.

సైన్స్ సబ్జెక్టులు కాకుండా– సెంట్రల్, స్టేట్ మరియు యుటి గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డుల నుండి ఏదైనా స్ట్రీమ్‌లు/సబ్జెక్టులలో ఇంటర్మీడియట్/10+2/ తత్సమాన పరీక్షలో కనీసం 50% మార్కులతో మరియు ఇంగ్లీషులో 50% మార్కులతో ఉత్తీర్ణత.

లేదా

కేంద్ర, స్టేట్ మరియు యుటి గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డుల నుండి రెండు సంవత్సరాల వొకేషనల్ కోర్సులో కనీసం 50% మార్కులతో మరియు ఇంగ్లీషులో 50% మార్కులతో వొకేషనల్ కోర్సులో ఉత్తీర్ణత (లేదా ఇంగ్లీషు వృత్తి కోర్సులో సబ్జెక్టు కాకపోతే ఇంటర్మీడియట్/మెట్రిక్యులేషన్‌లో).

గమనిక 1. సైన్స్ సబ్జెక్టుల పరీక్షకు అర్హత ఉన్న అభ్యర్థులు (ఇంటర్మీడియట్/ 10+2/ఇంజనీరింగ్‌లో మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సు లేదా ఫిజిక్స్ మరియు మ్యాథ్స్ నాన్–వొకేషనల్ సబ్జెక్టులతో రెండు సంవత్సరాల వొకేషనల్ కోర్సుతో సహా) సైన్స్ సబ్జెక్టులకు కూడా అర్హులు మరియు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఫారమ్ నింపేటప్పుడు ఒకేసారి సైన్స్ సబ్జెక్టులు మరియు సైన్స్ సబ్జెక్టులు కాకుండా ఇతర పరీక్షలకు హాజరు కావడానికి అవకాశం ఇవ్వబడుతుంది.
గమనిక 2. రిజిస్ట్రేషన్ తేదీ నాటికి సెంట్రల్, స్టేట్ మరియు యుటి గుర్తింపు పొందిన ఎడ్యుకేషన్ బోర్డులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు.
గమనిక 3. 10+2/ ఇంటర్మీడియట్/ తత్సమాన పరీక్ష/ మూడేళ్ల డిప్లొమా కోర్సు/ రెండేళ్ల వృత్తి విద్యా కోర్సు లేదా సంబంధిత విద్యా బోర్డులు/ పాలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్ నిబంధనల ప్రకారం లెక్కించిన దశాంశానికి ముందు మార్కుల ఖచ్చితమైన మొత్తం శాతం మాత్రమే పరిగణించబడుతుంది (ఉదాహరణకు 49.99%ని 49%గా తీసుకోవాలి మరియు 50%కి రౌండ్ చేయకూడదు)
అగ్నివీర్‌వాయు (మ్యూజిసియన్)– ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల/ బోర్డు నుండి మెట్రిక్యులేషన్/ 10వ తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణత.

జెండర్

- (ఆర్మీ) పురుషులు & మహిళలు (సైనిక పోలీసులకు మాత్రమే)
- (నేవీ) పురుషులు & మహిళలు
- (వైమానిక దళం) పురుషులు & మహిళలు

Height

(ఆర్మీ)

ఎస్ఇఆర్	ప్రాంతాలు	
1	**స్త్రీలు** (జనరల్)	162
	గర్వాలీలు, గూరా?లు, లడఖీలు, గుర్తింపు పొందిన గిరిజన ప్రాంతాల గిరిజనులు, ఈశాన్య ప్రాంతం (సిక్కిం, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపుర, మిజోరాం, మేఘాలయ, అస్సాం)	158
2	**పురుషులు** **పశ్చిమ హిమాలయన్** – జమ్మూ & కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ కొండలు (అంతర్ రాష్ట్రానికి దక్షిణం మరియు పశ్చిమ ప్రాంతం మరియు హిమాచల్ ప్రదేశ్ మరియు పంజాబ్ మధ్య సరిహద్దు మరియు ముకేరియన్ రోడ్డుకు ఉత్తరం మరియు తూర్పున హోషియార్పూర్, గర్ శంకర్ మరియు రోపర్, గర్ శంకర్ మరియు కుమావున్ (యుకె)	163
	తూర్పు హిమాలయన్ – సిక్కిం, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపుర, మిజోరాం, మేఘాలయ, అస్సాం మరియు పశ్చిమ బెంగాల్‌లోని కొండ ప్రాంతం (డార్జిలింగ్ జిల్లా)	160
	పశ్చిమ మైదానాలు – పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్ మరియు పశ్చిమ ఉత్తర ప్రదేశ్ (మీరట్ మరియు ఆగ్రా డివ్)	170
	తూర్పు మైదానాలు – తూర్పు ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ మరియు ఒడిశా	169
	మధ్య మైదానాలు – మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, మహారాష్ట్ర, దాదర్, నాగర్, హవేలి, డామన్ & డయ్యూ	168
	దక్షిణ మైదానాలు – ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, గోవా మరియు పుదుచ్చేరి, అ &నీ దీవులు	166
	క్లర్క్/ ఎస్‌కెటి	162

ఎత్తులో సడలింపు ఉన్న ప్రాంతాలు	Min Ht forMales (in Cms)
లడఖ్	157
గూర్ఖాలు (నేపాలీ మరియు భారతీయులు ఇద్దరూ)	157
మినికాయ్‌తో సహా అండమాన్ మరియు నికోబార్ ద్వీపం, లక్షద్వీప్ సమూహం నుండి అభ్యర్థులు	
(1) స్థిరనివాసులు	165
(2) స్థానికులు	155
గుర్తింపు పొందిన గిరిజన ప్రాంతాల గిరిజనులు	162

నేవీ

కనీస ఎత్తు ప్రమాణం 157 సెం.మీ. అయితే, క్రింద పేర్కొన్న ప్రాంతాలలో నివాసం ఉన్న అభ్యర్థులకు మరియు ప్రతిభావంతులైన క్రీడా అభ్యర్థులకు ఎత్తులో సడలింపు అనుమతించబడుతుంది:

Ser	Category	Minimum height
(a)	లడఖ్ నుండి గిరిజనులు	155 cms
(b)	ఏ&ఎన్ దీవులు, లక్షద్వీప్ & మినికాయ్ (స్థానికులు)	155 cms
(c)	గూర్ఖా నేపాలీ, అస్సామీ, గర్వాలి, కుమావోని మరియు ఉత్తరాఖండ్	152 cms
(d)	భూటాన్, సిక్కిం మరియు ఎన్ఇ ప్రాంతం	152 cms

వైమానిక దళం

పురుషుడు అగ్నివీర్వాయుకు 152 సెం.మీ.లు పురుషుడు అగ్నివీర్వాయుకు 162 సెం.మీ.లు

మహిళా 152 సెం.మీ.లు అగ్నివీర్వాయుకు(సంగీతకారుడు): ఉత్తరాఖండ్‌లోని ఈశాన్య లేదా కొండ ప్రాంతాలకు చెందిన అభ్యర్థులకు, కనీస ఎత్తు 147 సెం.మీ. అంగీకరించబడుతుంది. లక్షద్వీప్ అభ్యర్థుల విషయంలో, కనీస ఎత్తు 150 సెం.మీ.

గమనిక. ఉత్తరాఖండ్/లక్షద్వీప్‌లోని ఈశాన్య/కొండ ప్రాంతాల నివాసంగా ఉండటానికి ఎత్తు సడలింపు పొందుతున్న "మహిళా అభ్యర్థులు" దశ–2 పరీక్ష సమయంలో నివాస స్థితి యొక్క ఎండార్స్‌మెంట్‌తో వారి నివాస ధృవీకరణ పత్రాన్ని సమర్పించాలి.

ఇంకా, ఉత్తరాఖండ్‌లోని కొండ ప్రాంతాల అభ్యర్థులు వారి నివాస ధృవీకరణ పత్రంలో కొండ ప్రాంతం యొక్క నిర్దిష్ట ఎండార్స్‌మెంట్‌ను కలిగి ఉండాలి.

ఎంపిక విధానం

(ఆర్మీ)
స్టేజ్ –1 ఆన్‌లైన్ పరీక్ష
సిఇఇ (సాధారణ ప్రవేశ పరీక్ష)
స్టేజ్– 2
శారీరక దృఢత్వ పరీక్ష, శారీరక కొలత పరీక్ష మరియు వైద్య పరీక్ష పురుషులు

(నేవీ)
స్టేజ్ 1 – ఆన్‌లైన్ పరీక్ష
ఐఎన్ఇటి (ఇండియన్ నేవీ ఎంట్రాన్స్ టెస్ట్)
స్టేజ్ 2
శారీరక ఫిట్‌నెస్ పరీక్ష, వ్రాత పరీక్ష & రిక్రూట్‌మెంట్ మెడికల్

(వైమానిక దళం)
స్టేజ్ 1 – ఆన్‌లైన్ పరీక్ష
స్టార్ (అగ్నివీర్వాయు నియామకానికి షెడ్యూల్డ్ పరీక్ష)
స్టేజ్ 2
శారీరక ఫిట్‌నెస్ పరీక్ష -1&2, అనుకూలత పరీక్ష - 1&2 మరియు వైద్య పరీక్ష

శారీరక దృఢత్వ ప్రమాణం

(ఆర్మీ)

1.6 Km Run				Beam (Pull Ups)		9 feet ditch	Zig-Zag balance
Group	Timings From	Timings To	Marks	Pull Ups	Marks		
Group-I	-	Up to 5 min 30 sec	60	10	40	Need to Qualify	Need to Qualify
Group-II	5 min 31 sec	5 min 45 sec	48	9	33		
Group-III	5 min 46 sec	6 min	36	8	27		
Group-IV	6 min 01 sec	6 min 15 sec	24	7	21		
				6	16		

Female

1.6 Km Run		10 Feet Long Jump	3 Feet High Jump
Group	Time	Need to Qualify	Need to Qualify
Group-I	Up to 7 Min 30 Secs		
Group-II	Up to 8 Min		

(నేవీ)

Gender	1.6 Km Run	Squats (Uthak Bathak)	Push-ups	Bent Knee Sit-ups
Male	06 min 30 sec	20	15	15
Female	08 min	15	10	10

(వైమానిక దళం)

Gender	1.6 Km Run	Squats (Uthak Bathak) (Time)	Push-ups (Time)	Sit-ups (Time)
Male	07 Min	20 (01 Min)	10 (01 Min)	10 (01 Min)
Female	08 Min	15 (01 Min)	--	10 (01 Min and 30 secs)

వయస్సు

$17^{1}/_{2}$ – 21 years
గమనిక (భారత సైన్యంలోని మహిళా మిలిటరీ పోలీసులకు మాత్రమే) –రక్షణ సిబ్బందిలో మరణించిన వారి భార్యకు సంబంధించి గరిష్ట వయోపరిమితి 30 సంవత్సరాల వరకు సడలించబడుతుంది.

సేవా వ్యవధి

నాలుగు సంవత్సరాలు

రెగ్యులర్ కేడర్‌లో నమోదు

నాలుగు సంవత్సరాల సేవ పూర్తయిన తర్వాత, సంస్థ యొక్క అవసరాలు మరియు సంబంధిత సేవలు ప్రకటించిన విధానాల ఆధారంగా. సాయుధ దళాలలో శాశ్వత నమోదు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అగ్నివీర్లకు అవకాశం ఇవ్వబడుతుంది. ఈ దరఖాస్తులను వారి నాలుగు సంవత్సరాల నిశ్చితార్థ కాలంలో పనితీరుతో సహా లక్ష్య ప్రమాణాల ఆధారంగా కేంద్రీకృత పద్ధతిలో పరిగణిస్తారు మరియు అగ్నివీర్ల యొక్క ప్రతి నిర్దిష్ట బ్యాచ్‌లో 25% వరకు భారత సాయుధ దళాలలో రెగ్యులర్ కేడర్‌లో తిరిగి నిశ్చితార్థం కోసం నమోదు చేయబడతారు. భారత ప్రభుత్వంలో తదుపరి నమోదు కోసం అగ్నివీర్‌లకు ఎంపికయ్యే హక్కు ఉండదు. తదుపరి నమోదు కోసం అగ్నివీర్‌ల ఎంపిక, ఏదైనా ఉంటే, అది భారత ప్రభుత్వ అభీష్టానుసారం ఉంటుంది.

వైవాహిక స్థితి మరియు గర్భధారణ

అవివాహిత భారతీయ పురుష మరియు మహిళా అభ్యర్థులు మాత్రమే అగ్నివీర్‌గా నమోదుకు అర్హులు. అభ్యర్థులు నమోదు సమయంలో 'అవివాహితులు' అనే సర్టిఫికేట్ ఇవ్వాలి. అగ్నివీర్‌లు సంబంధిత సర్వీసులలో వారి నాలుగు సంవత్సరాల మొత్తం పదవీకాలంలో వివాహం చేసుకోవడానికి అనుమతించబడరు. ఒక అభ్యర్థి తన/ఆమె పదవీకాలంలో వివాహం చేసుకుంటే లేదా అవివాహితులని సర్టిఫికేట్ ఇచ్చినప్పటికీ ఇప్పటికే వివాహం చేసుకున్నట్లు తేలితే సర్వీస్ నుండి తొలగించబడతారు. మహిళా అభ్యర్థులు అదనంగా నిశ్చితార్థ కాలంలో గర్భం దాల్చకూడదని హామీ ఇవ్వాలి. అగ్నివీర్ అనే మహిళ గర్భం కారణంగా తక్కువ వైద్య వర్గం (ఎల్ఎంసి)గా మారితే, ఆమెను సర్వీస్ నుండి డిశ్చార్జ్ చేసే అవకాశం ఉంటుంది. అగ్నివీర్ అనే మహిళను రెగ్యులర్ కేడర్‌లోకి ఎంపిక చేయకుండా నిషేధిస్తుంది.
గమనిక (భారత సైన్యంలో మహిళా మిలిటరీ పోలీసులకు మాత్రమే) –వితంతువులు, విడాకులు తీసుకున్న లేదా చట్టబద్ధంగా విడిపోయిన మహిళలు కూడా పిల్లలు లేనట్లయితే అర్హులు. రక్షణ సిబ్బందిలోని వితంతువులు తిరిగి వివాహం చేసుకోకపోతే పిల్లలు కలిగి ఉండటానికి అర్హులు.

వైద్య ప్రమాణాలు

అభ్యర్థులు సంబంధిత సర్వీసులు సూచించిన విధంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. సంబంధిత సర్వీసుల వెబ్‌సైట్‌లలో మరిన్ని వివరాలు అందుబాటులో ఉన్నాయి.

జీతం, భత్యాలు, అనుబంధ ప్రయోజనాలు మరియు అగ్నివీర్ కార్పస్ ఫండ్ (సేవా నిధి ప్యాకేజీ)

ఈ పథకం కింద చేరిన అగ్నివీర్‌లకు నెలకు రూ. 30,000/– అగ్నివీర్ ప్యాకేజీని స్థిర వార్షిక ఇంక్రిమెంట్‌తో చెల్లిస్తారు. అదనంగా, రిస్క్ మరియు కష్ట భత్యాలు, దుస్తులు మరియు ప్రయాణ భత్యాలు చెల్లించబడతాయి. రేషన్, దుస్తులు, వసతి మరియు లీవ్ ట్రావెల్ కన్సెషన్ (ఎల్‌టిసి) వంటి ప్రోత్సాహకాలు కూడా ప్రస్తుత నిబంధనల ప్రకారం అందించబడతాయి. అగ్నివీర్లకు వారి నిశ్చితార్థ వ్యవధి పూర్తయిన తర్వాత ప్రభుత్వం వారి నెలవారీ సహకారంతో పాటు చెల్లించే సహకారాన్ని కలిపి ఒకేసారి చెల్లించే సేవా నిధి ప్యాకేజీని క్రింద సూచించిన విధంగా అందిస్తారు:–

Year	Customised Package (Monthly)	In Hand (70%)	Contribution to Agniveer Corpus Fund (30%)	Contribution to Corpus Fund by GoI
All Figures in ₹ (Monthly Contribution)				
1st Year	30000	21000	9000	9000
2nd Year	33000	23100	9900	9900
3rd Year	36500	25550	10950	10950
4th Year	40000	28000	12000	12000
Total Contribution in Agniveer Corpus Fund after four years			Rs. 5.02 lakh	Rs. 5.02 lakh
Exit after 4th year	Approximately Rs. 10.04 Lakhs as Seva Nidhi Package (absolute amount excluding interest)			

జీవిత బీమా కవర్

అగ్నివీర్‌కు వారి నిశ్చితార్థ వ్యవధికి 48 లక్షల రూపాయల నాన్–కంట్రిబ్యూటరీ జీవిత బీమా కవర్ అందించబడుతుంది.

మరణ పరిహారం

48 లక్షల రూపాయల బీమా కవర్‌తో పాటు, సేవ కారణంగా మరణానికి 44 లక్షల రూపాయల వన్–టైమ్ ఎక్స్‌గ్రేషియాను ఎన్ఓకెకి అందిస్తారు.

వైకల్య పరిహారం

వైకల్యం శాతం (100%/75%/50%) ఆధారంగా అగ్నివీర్లకు 44/25/15 లక్షల రూపాయల వన్–టైమ్ ఎక్స్‌గ్రేషియా వర్తిస్తుంది.

సెలవులు

అగ్నివీర్లకు సంవత్సరానికి 30 రోజులసెలవు వర్తిస్తుంది. అదనంగా, సమర్థ వైద్య అధికారి వైద్య సలహా ఆధారంగా అనారోగ్య సెలవు వర్తిస్తుంది.

వైద్య మరియు సిడిఎస్ సౌకర్యాలు

భారత సాయుధ దళాలలో వారు నియమించబడిన కాలంలో, అగ్నివీర్‌లు సర్వీస్ ఆసుపత్రిలో వైద్య సదుపాయాలతో పాటు సిడిఎస్ సదుపాయాలను పొందేందుకు అర్హులు.

CBC 10701/13/0035/2425

Online applications available at:- https://joinindianarmy.nic.in/ https://joinindiannavy.gov.in https://agnipathvayu.cdac.in

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68